శుక్రవారం 21-7-2023



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 120

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మగ్గానికి మహర్దశ తీసుకొచ్చి, దేశంలో ఎక్కడా లేని విధంగా నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగనన్న ప్రభుత్వం..

వరుసగా ఐదో ఏడాది..

"వైఎస్సార్ నేతన్న నేస్తం"

... నేతన్నకు ఆపన్న హస్తం

అర్హులై ఉండి స్వంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ. **24,000** ఆర్థిక సాయం అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

రాష్ట్ర వ్యాప్తంగా 80,686 మంది నేతన్నలకు రూ. 193.64 కోట్లను తిరుపతి జిల్లా వెంకటగిరిలో నేడు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

నేతన్నలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా.. క్రమం తప్పకుండా ప్రతి ఏటా అదే కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తూ..
నేడు అందిస్తున్న సాయంతో కలిపి అర్హుడైన ప్రతి నేతన్నకు కేవలం "వైఎస్సార్ నేతన్న నేస్తం" ద్వారా ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం అందించిన మొత్తం సాయం

రూ. **1,20,000..**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుండి
"వైఎస్సార్ నేతన్న నేస్తం" క్రింద రూ. **969.77** కోట్లు,
నేతన్నల పెన్షన్ కోసం రూ. **1,396.45** కోట్లు,
ఆప్కోకు చెల్లించింది రూ. **468.84** కోట్లు
(గత ప్రభుత్వ బకాయిలు రూ. **103** కోట్లతో కలిపి)
... మొత్తంగా ఇప్పటివరకు కేవలం ఈ 3 పథకాల ద్వారానే నేతన్నల సంక్షేమం కోసం చేసిన వ్యయం

రూ. **2,835.06** కోట్లు..

చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం..

చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి నేతన్నల ఆదాయం పెంచేందుకు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలైన

amazon, Myntra, Flipkart, Loomfolks, MIRRAW, paytm, gocoop

వంటి వ్యాపార దిగ్గజాలతో ఒప్పందాలు చేసుకున్న జగనన్న ప్రభుత్వం.. తద్వారా చేనేత వస్త్రాలకు పటిష్టమైన మార్కెటింగ్ సౌకర్యం..

గత ప్రభుత్వం నేతన్నల కోసం ఐదేళ్లలో కేవలం రూ. **442** కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే,
మనందరి జగనన్న ప్రభుత్వం కేవలం నాలుగేళ్లలోనే దాదాపు **9** రెట్లు అధికంగా రూ. **3,706** కోట్లు ఖర్చు చేసింది.

"వైఎస్సార్ నేతన్న నేస్తం"కు సంబంధించిన సహాయం, ఫిర్యాదుల కొరకు
జగనన్నకు చెబుదాం
1902
టోల్ ఫ్రీ నంబర్

ఈ పథకం అమలు తర్వాత చేనేత కార్మికులు తమ మగ్గాలను డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసి క్రొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ వారి జీవితాలను మెరుగుపర్చుకున్నారు..



జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు నేతన్నల సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధి..

పథకం	అందించిన లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ నేతన్న నేస్తం	969.77
నేతన్నల పెన్షన్	1,396.45
ఆప్కోకి చెల్లించింది (గత ప్రభుత్వ బకాయిలతో కలిపి)	468.84
ఇళ్ల స్థలాలు	272.60
వైఎస్సార్ రైతు భరోసా	151.20
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	73.64
వైఎస్సార్ చేయూత	71.56
వైఎస్సార్ ఆసరా	68.76
జగనన్న అమ్మఒడి	59.02
హౌసింగ్ (డిబిటి)	56.75
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	25.06
జగనన్న విద్యా దీవెన	23.68
జగనన్న తోడు	15.15
వైఎస్సార్ సున్నా వడ్డీ (మహిళలు)	13.61
వైఎస్సార్ బీమా	10.42

...వీటితోపాటు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, జగనన్న వసతి దీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, కోవిడ్ సహాయం, జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ మత్స్యకార భరోసా, అర్చకులు, పాస్టర్లు, ఇమామ్‌లకు సాయం తదితర పథకాల ద్వారా నేతన్నలకు ఇప్పటి వరకు జగనన్న ప్రభుత్వం అందించిన లబ్ధి..

రూ. **3,706.16** కోట్లు..

నాగరికత నేర్పిన నేతన్న బాగుండాలి.. చేనేతల జీవితాలు రంగుల మయం కావాలి..
శ్రీ.గుడివాడ అమర్‌నాథ్, చేనేత, జౌళి, పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక వసతులు మరియు ఐటీ శాఖా మాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు తిరుపతి జిల్లా, వెంకటగిరి లో 21 జూలై, 2023 ఉదయం 9.30 గంటలకు బటన్ నొక్కి "వైఎస్సార్ నేతన్న నేస్తం" లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సాయం నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు..

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి ఫ్యామిలీ II
విజయవాడ
శుక్రవారం ॥ 21-7-2023




ఫ్యాషన్








క్యాజువల్ టు కార్పొరేట్

కుర్తాసెట్ ధరించిన సౌకర్యం కావాలి
సంప్రదాయం కాకుండా స్టయిలిష్‌గా కనిపించాలి
క్యాజువల్ వేర్ అనిపించాలి
కార్పొరేట్ లుక్‌తో ఆకట్టుకోవాలి.
ఇవన్నీ ఒకచోట కొలువుండాలంటే
ఎవర్‌గ్రీన్ చీరకట్టును మోడర్న్‌గా మెరిపించాలి.

లాంగ్ బ్లౌజ్‌లు, ఓవర్‌కోట్స్, పెప్లమ్, షర్ట్ స్టైల్... ఇలాంటి వాటితో కాటన్ లేదా సిల్క్ చీరకట్టును మ్యాచ్ చేస్తే స్టయిల్ లుక్ సొంతం కాకుండా ఉండదు. కాటన్, సిల్క్, బెనారస్ డిజైనర్ టాప్స్‌తో తీసుకువచ్చే ఈ లుక్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ ఆకట్టుకుంటుంది.

కిచెన్ టిప్స్

ఎండుకొబ్బరి తాజాగా...

ఎండుకొబ్బరిని నిల్వ ఉంచిన కొద్దిరోజులకే కొబ్బరిచిప్ప లోపల బూజులాగా రావడం, కొన్నిసార్లు లోపల తెల్లగా ఉన్నప్పటికీ చేదుగా మారడం చూస్తుంటాం. ఇవేవీ రాకుండా, కొబ్బరిచిప్పలను చింతలేకుండా ఇలా నిల్వచేసుకోండి...



- మార్కెట్ నుంచి తెచ్చిన ఎండు కొబ్బరి చిప్పలను శుభ్రంగా తుడిచి, ఎండలో ఆరబెట్టాలి. ఆరిన చిప్పలను ఉప్పునీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఇప్పుడు కొద్దిగా కొబ్బరినూనెను వేళ్లతో తీసుకుని చిప్పకు రాసి నిమిషం పాటు రుద్దాలి. ఈ చిప్పలను రెండురోజుల పాటు ఎండలో పెట్టి , కవర్‌లో మూటకట్టాలి. ఈ మూటను గాలిచొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఇలా పెట్టిన కొబ్బరి నెలల పాటు పాడవకుండా ఉంటుంది.
- టేబుల్ స్పూను పటికపొడిని కప్పు నీటిలో కలపాలి. పటిక మొత్తం కరిగిన తరువాత ఈ నీటిలో చిన్న గుడ్డను ముంచి కొబ్బరి చిప్పల లోపల, బయటా తుడవాలి. ఇలా తుడిచిన చిప్పలను ఎండలో రెండు రోజులపాటు ఆరబెట్టి, కవర్‌లో మూటకట్టాలి. ఈ మూటను గాలిచొరబడని డబ్బాలో నిల్వచేయాలి. ఇలా కూడా ఎక్కువ రోజులపాటు చిప్పలు తాజాగా ఉంటాయి.

మచ్చల్ని మాయం చేసే డ్రింక్!

దాహాన్ని తీర్చే కూల్‌డ్రింక్స్ టైల్స్, గిన్నెల మీద ఉన్న మరకలను ఇట్టే పోగొడతాయి.



- ఐరన్ ట్యాప్‌లు, టైల్స్ మీద ఏర్పడిన తుప్పు మరకలు ఒకపట్టాన వదలవు. అల్యూమినియం ఫాయిల్‌ను ఉండలా చుట్టి, కూల్‌డ్రింక్‌లో ముంచి తుప్పు మరకలపై రుద్దితే నిమిషాల్లో మరకలు మాయమైపోతాయి.
- డీప్‌ఫ్రైకి వాడే బాణళ్లు తరచూ వాడడం వల్ల లోపల బయట నల్లగా మారిపోతాయి. ఈ బాణలిపై కూల్‌డ్రింక్‌ను పోసి పదినిమిషాలు నానబెట్టాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్దితే మసిమరకలు పోయి బాణలి తెల్లగా మెరుస్తుంది.
- బాత్‌రూం టైల్స్ మీద వదలకుండా పట్టిపీడిస్తోన్న మొండి మరకలను కూల్‌డ్రింక్‌లో ముంచిన స్క్రబ్బర్‌తో రుద్దితే ఇట్టే పోతాయి.

మహిళా అధికారులు

పంజాబ్ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకు మహిళా ఆఫీసర్ల ధైర్యగాథలు మార్మోగుతున్నాయి. ఇటీవలి పెను వరదల్లో చిక్కుకున్నవారిని కాపాడటంలో మహిళా కలెక్టర్లు, ఎస్‌పిలు రేయింబవళ్లు కష్టపడి ధీరత్వాన్ని ప్రదర్శించారు. చంటి పిల్లల్ని ఇళ్లల్లో వదిలి ప్రజల కోసం రోజుల తరబడి పని చేసిన ఈ ఆఫీసర్ల పరిచయం...

వరదలకు ఎదురు నిలిచారు


కుల్లు ఎస్.పి. సాక్షి వర్మ


పాటియాలా కలెక్టర్ సాక్షి సహానే


మండి ఎస్.పి. సౌమ్య

ఉత్తర భారతాన్ని వానలు, వరదలు చుట్టుముట్టాయి. పంజాబ్ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకూ కుంభవృష్టి ముంచెత్తింది. నదులు వెర్రెత్తి ప్రవహించాయి. కొండ చరియలు విరిగి పడ్డాయి. గిరి వృక్షాలు కూకటివేళ్లతో సహా పెకలించుకుని వరద నీటిలో అడ్డొచ్చినవాటిని ధ్వంసం చేసుకుంటూ ముందుకు సాగాయి. కార్లు అగ్గిపెట్టెల్లా చెల్లాచెదురయ్యాయి. ప్రాణాలకు ప్రమాదం వచ్చి ఏర్పడింది. ఇలాంటి సమయాల్లో బయటకు అడుగు పెట్టడమే కష్టం. కాని ఈ సందర్భాలను సమర్థంగా ఎదుర్కొని ప్రశంసలు పొందారు మహిళా అధికారులు. ప్రకృతి విసిరే సవాళ్లకు తాము జవాబు చెప్పగలమని నిరూపించారు. సహాయక బృందాలను సమాయత్త పరచడం, లోతట్టు ప్రాంతాలను ఖాళీ చేయించడం, వరదల్లో చిక్కుకున్నవారిని సురక్షితంగా తరలించడం ఈ పనుల్లో స్వయంగా పాల్గొంటూ రేయింబవళ్లు పని చేశారు. అందుకే వారిని జనం మెచ్చుకుంటున్నారు. కృతజ్ఞతలు చెబుతున్నారు.

పాటియాలా కలెక్టర్

ఉత్తర భారతానికి పెను వర్షగండం ఉందని వార్తలొచ్చాక ఆ గండం పంజాబ్‌లో పాటియాలా జిల్లాకు కూడా వచ్చింది. జూలై 9, 10 తేదీల్లో పాటియాలా జిల్లా వరదల్లో చిక్కుకుంది. ఆ జిల్లా కలెక్టర్ సాక్షి సహానె వెంటనే రంగంలో దిగింది. ఆమెకు మూడేళ్ల కుమార్తె ఉంది. ఆ కుమార్తె బాగోగులు తన తల్లిదండ్రులకు అప్పజెప్పి దాదాపు 7 రోజులు ఇంటికే వెళ్లకుండా జిల్లా అంతటా తిరుగుతూ ప్రజలను కాపాడింది సాక్షి సహానె. ముఖ్యంగా ఎగువన ఉన్న మొహాలీ జిల్లా నుంచి వరద నీరు పాటియాలాలోని సట్లజ్ యమున లింక్ కెనాల్‌కి చేరడంతో ఒక్కసారిగా వరద చండీగఢ్–పాటియాలా హైవేపై ఉన్న రాజ్‌పుర ప్రాంతానికి వచ్చేసింది. అక్కడే చిత్కారా యూనివర్సిటీ, నీలమ్ హాస్పిటల్ ఉన్నాయి. రెండూ వరదలో చిక్కుకున్నాయి. 'నీలమ్ హాస్పిటల్‌లో ఉన్న అందరు పేషెంట్లను, 14 మంది ఐసియు పేషెంట్లను విజయవంతంగా తరలించ గలిగాం' అని సహానె తెలిపింది. అలాగే చిత్కారా యూనివర్సిటీలో విద్యార్థులందరూ బయటకు రాలేనంతగా వరద నీటిలో చిక్కుకున్నారు. సహానె స్వయంగా యూనివర్సిటీ దగ్గరకు వెళ్లి ఆర్మీ, ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాల సహాయంతో ఆ విద్యార్థులను బయటకు తరలించారు. 'సులూర్ అనే గ్రామంలో వరద నీటిలో చిక్కుకుని ఆహారం కోసం జనం అల్లాడుతున్నారని నాకు అర్ధరాత్రి ఫోన్ వచ్చింది. వెంటనే ఆహారం తీసుకుని ఆ వానలో వరదలో బయలుదేరాను. కారులో కూచుని ఉంటే వరద నీరు నా అద్దాల వరకూ చేరుకుంది. భయమూ తెగింపు కలిగాయి. అలాగే ముందుకు వెళ్లి ఆహారం అందించగలిగాను' అంది సాక్షి సహానె. 2014 ఐ.ఏ.ఎస్ బ్యాచ్‌కు చెందిన సహానె తన చొరవ, చురుకుదనంతో పాటియాలా జిల్లా ప్రజల అభిమానం గెలుచుకుంది.

కుల్లు ఎస్.పి.

హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లు జిల్లా ఎస్.పి 28 సంవత్సరాల సాక్షి వర్మను అందరూ 'లేడీ సింగం' అంటారు. సిమ్లా జిల్లాలో ఆమె పని చేసినప్పుడు బ్రౌన్‌షుగర్ సరఫరా చేసే ముఠాలను పట్టుకుంది. అలాగే పేరు మోసిన దొంగలను జైలు పాలు చేసింది. స్త్రీల రక్షణ కోసం 'గుడియా హెల్ప్‌లైన్', 'శక్తి బటన్', 'హోషియార్ సింగ్' అనే హెల్ప్‌లైన్లు ప్రారంభించింది. దాంతో జనం ఆదరణ పొందింది. కుల్లు ఎస్.పిగా చార్జ్ తీసుకున్నాక వచ్చిన తీవ్ర వరదలను సాక్షి వర్మ సమర్థంగా ఎదుర్కొంది. 'ఈ వరదల్లో నాకు ఎదురైన పెద్ద సవాలు ఏమిటంటే మా జిల్లాలో ఉన్న పెద్ద టూరిస్ట్ అట్రాక్షన్స్ మనాలి కావచ్చు, తీర్థన్ కావచ్చు... వీటన్నింటితో కమ్యునికేషన్ కోల్పోవడం. మొబైల్స్ పని చేయలేదు. మా పోలీసు శాఖ వైర్‌లెస్ ఫోన్లు కొన్ని చోట్ల మాత్రమే పని చేశాయి. మిగిలిన ప్రాంతాలకు శాటిలైట్ ఫోన్లు పంపి అక్కడి నుంచి సమాచారం తెప్పించాను. కాని శాటిలైట్ ఫోన్లు చేర్చడం కూడా పెద్ద సవాలైంది. అలాగే రోడ్లు ధ్వంసం కావడం వల్ల సహాయక బృందాలు చేరలేకపోయాయి. అయినా సరే మేమందరం సమర్థంగా సహాయక చర్యలు చేపట్టాము. పని చేసేటప్పుడు నేను స్త్రీనా, పురుషుడినా అనేది నాకు గుర్తు ఉండదు. ఒక ఆఫీసర్‌గా ఏం చేయగలను అనేదే ఆలోచిస్తాను' అని తెలిపింది సాక్షి వర్మ– 2014 ఐపిఎస్ బ్యాచ్ ఆఫీసర్.

మండి ఎస్.పి.

కుల్లు జిల్లా పక్కనే ఉంటుంది మండి జిల్లా. రెంటికీ రెండు గంటల దూరం. ఈ జిల్లా కూడా తీవ్రంగా వరద బారిన పడింది. వంతెనలు, ఇళ్లు, రోడ్లు పూర్తిగా మునిగిపోయాయి. చివరకు పోలీస్ స్టేషన్లకు బిఎస్‌ఎఫ్ దళాలకు కూడా కమ్యూనికేషన్ లేదు. ఇలాంటి సమయంలో గొప్ప సమర్థతతో పని చేసింది మండి ఎస్.పి సౌమ్య సాంబశివన్. 2010 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఈ ఆఫీసర్ బియాస్ నది ఒడ్డున ఉన్న స్లమ్స్ చిక్కుకున్న 80 మందిని కాపాడగలగడంతో మొదటి ప్రశంస పొందింది. టూరిస్ట్ ప్రాంతం కాబట్టి కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల అక్కడికి వచ్చిన టూరిస్ట్‌లు ఎలా ఉన్నారంటూ ఫోన్ల వరద మొదలైంది. టూరిస్టులను సురక్షితంగా ఉంచడం సౌమ్యకు ఎదురైన పెద్ద సవాలు. 'వారందరిని వెతికి స్థానిక సత్రాల్లో, గురుద్వారాల్లో చేర్చడం చాలా వొత్తిడి కలిగించింది. అలాగే ఇళ్లు విడిచి రావడానికి చాలామంది ఇష్టపడలేదు. కష్టపడి సంపాదించుకున్న వస్తువులను వదిలి రావడం ఎవరికైనా బాధే. వారు అలాగే ఉంటే చనిపోతారు. ఎంతో ఒప్పించి వారిని ఖాళీ చేయించాను' అందామె. సౌమ్య సాంబశివన్ కింద మొత్తం 1200 మంది సహాయక సిబ్బంది పని చేసి ఈ ఉత్పాతాన్ని ఎదుర్కొన్నారు.

మిగిలినా.. మరింత రుచిగా...

వంటిల్లు

లంచ్, డిన్నర్‌లలో వండిన అన్నం కొన్నిసార్లు మిగిలిపోతుంటుంది. అలా మిగిలిన అన్నాన్ని పులిహోర, ఎగ్‌రైస్, వెజ్ రైస్ చేసుకోవడం మామూలే. తరచూ మసాలా రైస్ తినబుద్ధికాదు. అందువల్ల మిగిలిపోయిన అన్నాన్నీ మరింత రుచిగా ఇలా కూడా చేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు...



రైస్ పకోడి

కావలసినవి: మిగిలిన అన్నం – ఒకటిన్నర కప్పులు; శనగపిండి – మూడు టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిబఠాణీ – పావు కప్పు ; పచ్చిమిర్చి – ఒకటి; వెల్లుల్లి రెబ్బలు – పది; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; కారం – అరటేబుల్ స్పూను ; జీలకర్ర పొడి – టీస్పూను; గరం మసాలా – అరటీస్పూను; పసుపు – పావు టీస్పూను; నూనె – రెండు టేబుల్‌స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● ఉల్లిపాయ, పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరిగి పెట్టుకోవాలి. ● పెద్దగిన్నెలో అన్నం, పచ్చిబఠాణీ, ఉల్లిపాయ ,పచ్చిమిర్చి, వెల్లుల్లి తరుగు, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. ● ఇప్పుడు కారం, పసుపు, జీలకర్రపొడి, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు, అరటేబుల్ స్పూను నూనెవేసి మరోసారి కలుపుకోవాలి. ● అన్నం మిశ్రమాన్ని పకోడీల్లా వేసుకోవాలి. ● ఈ పకోడీలపై కొద్దిగా నూనె రాసి ఎయిర్ ఫ్రైయర్‌లో 180 డిగ్రీల వద్ద పదిహేను నిమిషాలు ఫ్రై చేయాలి. ● గోల్డెన్ కలర్‌లో క్రిస్పీగా వేగిన తరువాత తీసేసి టొమాటో కెచప్, గ్రీన్ చట్నీతో సర్వ్‌చేసుకోవాలి.



రైస్ పట్టి

కావలసినవి: మిగిలిన అన్నం – కప్పు ; పచ్చి బఠాణీ – అరకప్పు ; క్యారట్ – ఒకటి(సన్నగా తురమాలి) ; ఉడికించిన మటన్ ఖీమా – పావు కప్పు ; చీజ్ – ముప్పావు కప్పు ; గుడ్డు – ఒకటి ; గోధుమ పిండి – టేబుల్ స్పూను ; నూనె – మూడు టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● నూనె తప్పించి మిగతా పదార్థాలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. ● ఈ మిశ్రమాన్ని పట్టీలా చేసుకోని రెండు వైపులా నూనె వేసుకుంటూ గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి. ● సాస్, చట్నీ సర్వ్‌చేసుకోవాలి.



ఇన్‌స్టంట్ ఊతప్పం

కావలసినవి: మిగిలిన అన్నం – కప్పు ; బొంబాయి రవ్వ – అరకప్పు ; పెరుగు – కప్పు; క్యారట్, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, టొమాటో ముక్కలు – కప్పు; అల్లం తరుగు – టీస్పూను ; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు ; జీలకర్ర – టీస్పూను ; ఉప్పు – రుచికి సరిపడా; నూనె ఊతప్పం వేయించడానికి – తగినంత.

తయారీ: ● పెద్దగిన్నెలో రవ్వ, పెరుగు వేసి కలిపి ఇరవై నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. ● అన్నంలో కొద్దిగా నీళ్లుపోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన అన్నాన్ని రవ్వ మిశ్రమంలో వేసి కలపాలి. దీనిలో కప్పు నీళ్లుపోసి కలపాలి. ● ఇప్పుడు కూరగాయ ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు, జీలకర్ర వేసి కలపాలి. ● ఈ మిశ్రమాన్ని వేడెక్కిన పెనంపై నూనె వేసి ఊతప్పంలా వేయాలి. రెండువైపులా నూనె చల్లుకుంటూ చక్కగా కాల్చుకుంటే ఇన్‌స్టంట్ ఊతప్పం రెడీ. ● కూరగాయ ముక్కలను పిండిలో కలపకుండా ఊతప్పం పైన చల్లుకుని కూడా కాల్చుకోవచ్చు.



రైస్ రొట్టి

కావలసినవి : మిగిలిన అన్నం – మూడు కప్పులు ; ఉల్లిపాయ తరుగు – అర కప్పు ; క్యారట్ తురుము – కప్పు ; పచ్చిమిర్చి – నాలుగు (సన్నగా తరగాలి) ; అల్లం – అంగుళం ముక్క (తురమాలి) ; కరివేపాకు – మూడు రెమ్మలు ; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; జీలకర్ర – అరటీస్పూను ; బియ్యప్పిండి – ముప్పావు కప్పు ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – రొట్టి వేగడానికి సరిపడా.

తయారీ: ● అన్నాన్ని నీళ్ల పోయకుండా పేస్టులా గ్రైండ్ చేయాలి. ● అన్నం పేస్టుని గిన్నెలో వేసి..ఉల్లిపాయ ముక్కలు , క్యారట్ తురుము, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అల్లం తరుగు, జీలకర్ర రుచికి సరిపడా ఉప్పువేసి చక్కగా కలుపుకోవాలి. ● కొద్దిగా బియ్యప్పిండి వేసి ముద్దగా కలుపుకుని పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ● చేతులు తడిచేసుకుని పిండిని టెన్నిస్ బంతి పరిమాణంలో ఉండలుగా చేయాలి. ● ఈ ఉండలను అరిటాకు లేదా కవర్ మీద పెట్టి రొట్టిలా చేతితో వత్తుకోవాలి. ● పలుచగా వత్తుకున్న రొట్టెపై అక్కడక్కడ రంధ్రాలు చేయాలి. ● ఈ రొట్టెను చక్కగా కాలిన పెనం మీద వేసి సన్నని మంట మీద కొద్దిగా నూనె వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుని వేడివేడిగా సర్వ్‌చేసుకోవాలి.



అన్నం వడియం

కావలసినవి: అన్నం – కప్పు ; ఎండు మిర్చి – మూడు ; జీలకర్ర – రెండు టీస్పూన్లు ; ఉల్లిపాయ – ఒకటి ; పచ్చిమిర్చి – ఒకటి ; కరివేపాకు – రెమ్మ ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అన్నం మునిగేలా నీళ్లుపోసి రాత్రంతా నానబెట్టుకోవాలి. ● ఉదయాన్నే నీళ్లు తీసేసి అన్నాన్ని మిక్సీ జార్‌లో వేయాలి. ● దీనిలో ఎండుమిర్చి, జీలకర్ర వేసి బరకగా గ్రైండ్ చేయాలి. ● ఈ మిశ్రమంలో సన్నగా తరిగిన ఉల్లిపాయను, పచ్చిమిర్చిని వేయాలి. ● కరివేపాకు, రుచికి సరిపడా ఉప్పు వేసి చక్కగా కలుపుకోవాలి. ● ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలు చేసి మూడు రోజులు ఎండలో ఆరబెట్టాలి. ● ఉండలు చక్కగా ఆరాక, గాలిచొరబడని డబ్బాలో వేసి నిల్వచేయాలి. ● స్నాక్స్ సమయం లేదా అన్నం తినేటప్పుడు ఈ ఉండలను గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి సర్వ్‌చేసుకోవాలి.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 120

శుక్రవారం 21-7-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



సాత్విక్ జోడీ ముందుకు..
కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత షట్లర్స్ - 13లో



భారత్ 182/4
వెస్టిండీస్‌తో రెండో టెస్టు. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ అర్ధ సెంచరీలు - 13లో



ఇండియా కూటమి తొలి భేటీ
ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చాంబర్‌లో సమావేశమై పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వివరాలు 6లో ▸



16 మంది సజీవ సమాధి
మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా ఇర్సల్‌వాడి గ్రామంలో భారీ వర్షం వల్ల కొండచరియలు విరిగిపడి 16 మంది ప్రాణాలు కోల్పోయారు. వివరాలు 6లో ▸



నాలుగోసారి కక్ష్య దూరం పెంపు
ఇస్రో శాస్త్రవేత్తలు గురువారం ఉదయం 6.45 గంటలకు చంద్రయాన్-3 మిషన్‌కు నాలుగోసారి కక్ష్య దూరాన్ని పెంచారు. వివరాలు 6లో ▸



ఆర్డినెన్స్ పిటిషన్ రాజ్యాంగ బెంచ్‌కు
కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ ఢిల్లీ సర్కార్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. వివరాలు 6లో ▸

ప్రపంచంతో పోటీ

ఏపీ విద్యార్థులను వెస్టర్న్ వరల్డ్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం

ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై హైపవర్ వర్కింగ్ గ్రూపుతో భేటీలో సీఎం జగన్

- మైక్రోసాఫ్ట్, గూగుల్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావిజ్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో సమాలోచనలు
- విద్యా రంగంలో కీలక మార్పులపై విస్తృత చర్చ
- పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధి.. ఆ మేరకు పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళిక
- బోధనలో, శిక్షణలో ఫ్యూచర్ టెక్నాలజీ వాడకంపై కార్యాచరణ
- ఐబీతో కలిసి కొత్త సిలబస్‌ను రూపొందించబోతున్నాం
- రాబోయే రోజుల్లో ఐబీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో కలిసి టీచింగ్ మెథడాలజీ, పాఠ్య ప్రణాళికలో మార్పు
- అది దేశానికే బెంచ్ మార్క్.. ఇందుకు మీ సహకారం కావాలి
- వచ్చే సమావేశం నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



సీఎం జగన్‌కు 'ఫ్యూచర్ లుకింగ్ విజన్' బుక్‌లెట్‌ను అందజేస్తున్న హైపవర్ వర్కింగ్ గ్రూప్ సభ్యులు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధిని అందించాల్సి ఉందని, ఆ మేరకు పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళికకు రూపకల్పన చేయాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా బోధనలో, శిక్షణలో ఫ్యూచర్ టెక్నాలజీ వినియోగంపై కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో హైపవర్ వర్కింగ్ గ్రూపుతో

మిగతా 2వ పేజీలో ▶

"వెస్టర్న్ వరల్డ్‌లో ఉన్న బోధనా స్థాయిలను అలవర్చుకుంటేనే ఏపీ విద్యార్థులు కూడా ఆ స్థాయికి చేరి పోటీ పడగలుగుతారు. దీనికోసం ప్రశ్నా విధానం మారాలి. పిల్లలకు బోధించే విధానంలో కూడా మార్పు రావాలి. కరిక్యులమ్‌లో కూడా మనం వాళ్లకంటే ఏ మేరకు మెరుగు పరుచుకోవాలన్న విషయాన్ని పరిశీలించాలి. ఇందుకు పాఠశాల స్థాయిలో కూడా బోధన, బోధనా విధానాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలన్నది ఆలోచించాలి. స్టేట్ సిలబస్, నేషనల్ సిలబస్, సీబీఎస్ఈ వంటి అంశాలకే పరిమితం కాకుండా ఇంకా ముందుకు అడుగులు వేయాలి.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

వరుసగా ఐదో ఏడాదీ 'వైఎస్సార్ నేతన్న నేస్తం' 2లో

నేడు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్

గురువారం మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్‌లో గిరిజన సంఘాల భారీ ర్యాలీ



మణిపూర్ మంటలు

మహిళలపై అమానుష ప్రవర్తన పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు

దారుణ ఉదంతాన్ని ఖండించిన అన్ని పార్టీల నేతలు

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

6లో

మీవల్ల కాకపోతే మేమే రంగంలోకి దిగుతాం



మణిపూర్‌లో జరిగిన ఘటనను మా అంతట మేం విచారణకు స్వీకరిస్తున్నాం. శాంతి భద్రతలను కాపాడేందుకు కేంద్రం వెంటనే చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే మేమే రంగంలోకి దిగి, తగిన చర్యలు తీసుకుంటాం.

6లో

దోషులను వదిలిపెట్టం



మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన దారుణోదంతం 140 కోట్ల మంది భారతీయులను తలదించుకునేలా చేసింది. నా హృదయం బాధతో నిండిపోయింది. దోషులను వదిలే ప్రసక్తే లేదు.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

తొలి రోజే గరంగరం 6లో

మణిపూర్ హింసాకాండపై అట్టుడికిన పార్లమెంట్ ఉభయ సభలు

ఫ్యాక్ట్ చెక్

ఇసుకలో బురద తవ్వకాలు!

- కుట్రపూరిత కథనాలతో నిత్యం విషం చిమ్ముతున్న రామోజీ
- ఇసుక దొరక్కుండా పేదలను ఇబ్బందులకు గురి చేసే పన్నాగం
- ఇళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులు ఆగిపోవాలనే ఆరాటం
- ఈనాడు కథనాల్లో దాగి ఉన్న పచ్చి నిజం ఇదే.. రాష్ట్రంలో పారదర్శకంగా ఇసుక విధానం
- గత సర్కారుకు విధించిన రూ.100 కోట్ల జరిమానాను ఎన్జీటీ రద్దు చేయడమే ఇందుకు నిదర్శనం

11లో



పెత్తందారులకు 'ప్రైవేట్' జబ్బు!

- వైద్య విద్యను వ్యాపారంగా మార్చిన చంద్రబాబు
- కొమ్ము కాసింది.. ఫిలినిటీ జమీందారే 11లో
- ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీని తేలేదు
- ఇప్పుడు ఏకంగా 17.. ఈ ఏడాదే ఐదు ఆరంభం
- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒక్క సీటూ తగ్గదు.. ఇంకా అదనంగా వస్తాయి
- అవేమీ కామినేని, నారాయణ కాలేజీలు కావు.. దబ్బుంతా ఆయా ప్రభుత్వ వైద్య కళాశాలలకే
- ఆర్థిక వనరులుంటే కాలేజీలు నిలదొక్కుకుని అత్యుత్తమ వైద్యాన్ని పేదలకు అందిస్తాయి
- మన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో బోధనందుతుంది
- సామాన్యుడికి అన్ని చోట్లా సర్కారు సూపర్ స్పెషాల్టీ వైద్యం అందుబాటులోకి వస్తుంది
- వైద్య రంగంలో 51 వేల పోస్టుల భర్తీ.. నాడు-నేడు ద్వారా రూ.16 వేల కోట్లకుపైగా వెచ్చించి ఆరోగ్యానికి జవసత్వాలు

ఇదండీ సంగతి



మన ఇల్లు లోతట్టు ప్రాంతంలో ఉండటం వల్ల సరాసరి ఇక్కడికే వరదల్లో కొట్టుకొచ్చాను!

గూగుల్ టేక్ అవుట్ తప్పే!

వివేకా హత్య కేసులో తుది చార్జ్‌షీట్‌లో మాటమార్చిన సీబీఐ

- గ్రీన్‌విచ్ కాలమానం, భారత కాలమానానికి వ్యత్యాసం తేడా గుర్తించలేదని వెల్లడి
- సునీల్ యాదవ్ 'గూగుల్ టేక్ అవుట్'పై ఇప్పుడు మరోమాట
- వైఎస్ భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్క ఆధారం లేదు
- చిన్నాన్న కడప ఎంపీ టికెట్ ఆశించలేదన్న షర్మిల
- నన్ను పోటీ చేయమంటే ఆసక్తి చూపలేదని వాంగ్మూలం
- వివేకా ఎంపీ టికెట్ ఆశించడంతోనే విభేదాలంటూ సీబీఐ అభియోగాలు.. గత చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా తుది చార్జ్‌షీట్



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ డొల్లతనం మరోసారి బట్టబయలైంది. ఈ కేసులో అత్యంత కీలకమైన ఆధారమంటూ గూగుల్ టేక్ అవుట్ పేరిట కొండను తవ్వినంత హడావుడి చేసిన సీబీఐ.. తుది చార్జ్‌షీట్‌లో తోక ముడిచింది. ఇన్నాళ్లూ ఎంతో శాస్త్రీయ ఆధారమంటూ చెప్పుకొచ్చిన అంశంపైనే చివరికి చేతులెత్తేసింది. తాను గతంలో చార్జ్‌షీట్లో పేర్కొన్న నిందితుడు సునీల్ యాదవ్


మిగతా 14వ పేజీలో ▶

తీరంలో కరెంట్ తీగలుండవ్..!



సముద్ర తీరం వెంబడి భూగర్భ విద్యుత్ కేబుళ్లు

- కోస్టల్ ఏరియాలో సబ్ స్టేషన్లన్నీ 'గ్రిడ్'
- స్మార్ట్ మీటర్లతో రైతులకు విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణ
- దరఖాస్తు చేసిన నెల రోజుల్లోపే వ్యవసాయ సర్వీసులు మంజూరు
- ప్రీ పెయిడ్ మీటర్లతో ప్రజల చేతుల్లో విద్యుత్ బిల్లు నియంత్రణ
- పట్టణ ప్రాంతాల్లో కొత్త సాంకేతికతతో కండక్టర్ సబ్ స్టేషన్లు
- ముప్పై ఏళ్లు దాటిన వైర్ల స్థానంలో కొత్త వైర్లు, కండక్టర్లు
- 'సాక్షి'తో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి



పద్మాజనార్దనరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు జిల్లా తడ వరకు 972 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరం ఉంది. తుపానులు వచ్చినప్పుడు ఈ తీరం వెంబడి ఉన్న గ్రామాల్లో ఎక్కువగా నష్టపోయేది విద్యుత్ వ్యవస్థ. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లను యథాస్థితికి తెచ్చేందుకు వారాలు పడుతుంది. అంత వరకు ఆ ప్రాంతాల ప్రజలు చీకటిలోనే గడపాలి. ఆ సమయంలో పాములు వంటి విషకీటకాల బారిన పడి జనం ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ బాధల నుంచి విముక్తి కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని ఆంధ్రప్రదేశ్ మధ్య

మిగతా 3వ పేజీలో ▶

మీ ఓటు ఉందా?.. చెక్ చేసుకోండి

నేటి నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన

- ఆగస్టు 21 వరకు ఇంటింటికీ రానున్న బీఎల్‌వోలు
- జాబితాలో ఓటు లేకపోతే నమోదు చేసుకోవచ్చు
- అక్టోబరు 17న ముసాయిదా ఓటరు జాబితా
- నవంబరు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
- జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా
- జనవరి1 కి 18 ఏళ్లు వచ్చే వారూ ఓటరుగా నమోదు

11లో





ఏపీకి యానిమల్ హెల్త్ లీడర్‌షిప్ అవార్డు

రాష్ట్రానికి వరుసగా రెండోసారి ప్రతిష్టాత్మకమైన 'ఇండియా యానిమల్ హెల్త్ లీడర్‌షిప్ అవార్డు-2023' వరించింది. పశువైద్య నిర్వహణలో అత్యుత్తమ రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు అగ్రికల్చర్ టుడే గ్రూప్ ఈ అవార్డును ప్రకటించింది. ఢిల్లీలో ఈనెల 26న జరగనున్న సమ్మిట్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

- వివరాలు 2లో



నీటి ఎద్దడి నివారణపై అంతర్జాతీయ సదస్సు

వ్యవసాయ రంగంలో నీటి ఎద్దడి నివారణపై నవంబర్ 1 నుంచి 8 వరకు విశాఖలో ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రెయినేజీ 25వ అంతర్జాతీయ సదస్సు జరగబోతోంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి అంబటి ఆవిష్కరించారు. ఈ సదస్సుకు 80 దేశాల ప్రతినిధులు హాజరవుతారు.

- వివరాలు 3లో

క్లుప్తంగా...

సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు ఉచిత శిక్షణకు ఆహ్వానం

కొమ్మాది(విశాఖ): సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, 2 పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ స్టడీ సర్కిల్ ఏవో నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు విశాఖలో సివిల్ సర్వీస్, విజయవాడ కోచింగ్ కేంద్రంలో గ్రూప్–1, తిరుపతి కేంద్రంలో గ్రూప్–2 కోచింగ్ ఉంటుందన్నారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు మించకూడదని పేర్కొన్నారు. http://aprtdc.apcfrr.in/ వెబ్‌సైట్ లింక్ ద్వారా ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

జీఎస్టీ రిటర్న్‌ల గడువు పెంపు



సాక్షి, అమరావతి: జీఎస్టీ రిటర్న్‌ల గడువును ఆగస్టు 31 వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్ గురువారం చెప్పారు. జీఎస్‌టీఆర్–4, జీఎస్‌టీఆర్–9, జీఎస్‌టీఆర్–10 రిటర్న్‌లు ఆగస్టు 31లోగా దాఖలు చేసుకోవచ్చని, వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. రాష్ట్రంలో వ్యాపారులు జీఎస్టీ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వ్యాపారాన్ని ప్రోత్సహించే విధంగా గడువు తేదీని పెంచినట్లు తెలిపారు.

అందాల పోటీల్లో మెరిసిన చంద్రగిరి యువతి

మిస్ టీన్ గ్లోబ్ ఇండియాగా సంజన




చంద్రగిరి (తిరుపతి రూరల్): జాతీయ స్థాయి అందాల పోటీల్లో చంద్రగిరి యువతి మెరిసింది. ఈ నెల 16న జైపూర్‌లో జరిగిన 'స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియా–2023' పోటీలలో చంద్రగిరికి చెందిన సంజన మిస్ ఇండియా కిరీటం కైవశం చేసుకుంది. ఫైనల్స్‌లో 47 మంది పాల్గొనగా.. వారిలో స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియాగా సంజన ఎంపికైంది. ఆ వివరాలను ఆమె తల్లిదండ్రులు గురువారం మీడియాకు తెలిపారు. చంద్రగిరి మాజీ ఎంపీటీసీ అల్లతూరు మోహన్ మనమరాలైన సంజన మోడలింగ్‌పై మక్కువ పెంచుకుంది. 2023 మేలో బెంగళూరులో ప్రిలిమినరీ రౌండ్‌లో 300 మందికి పైగా బాలికలు జూమ్ కాల్‌లో పాల్గొనగా.. ఫైనల్స్‌కు 57 మంది ఎంపికయ్యారు. వారిలో సంజన ఒకరు. ఈ నెల 16 నుంచి జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫైనల్‌లో 47 మంది పాల్గొనగా.. వారిలో సంజన మొదటి స్థానం పొందింది.

'వారికి సాధారణ పోలీస్ విధులు అప్పగించం'

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా సంక్షేమ కార్యదర్శులకు సాధారణ పోలీసులు నిర్వర్తించే విధులను అప్పగించబోమని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. ఈ మేరకు కిందిస్థాయి అధికారులకు డీజీపీ సర్క్యులర్ జారీ చేస్తారని వివరించారు. ఈ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణను 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించడాన్ని సవాల్ చేస్తూ పలు వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే.

ప్రస్తుత మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవీకాలం ఐదేళ్లు



సాక్షి, అమరావతి: ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా వాసిరెడ్డి పద్మ ఐదేళ్లపాటు పదవీకాలంలో కొనసాగుతారని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ స్పష్టం చేసింది. వాసిరెడ్డి పద్మ పదవీకాలం ముగిసిందంటూ ఒక పత్రికలో వచ్చిన వార్తలో నిజం లేదని పేర్కొంది. ఏపీ మహిళా కమిషన్ చట్టం– 1998లోని సెక్షన్ 6ను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సవరించింది. సవరించిన నిబంధన ప్రకారం చైర్‌పర్సన్, కమిషన్ సభ్యుల పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. దాన్ని గరిష్ఠంగా మరో రెండేళ్లపాటు పొడిగించవచ్చు. ఈ సవరణ నోటిఫైడ్ తేదీ తర్వాత అమల్లోకి వస్తుంది. కానీ.. సవరణ అమల్లోకి రాకముందే ఏపీ మహిళా కమిషన్ చట్టం –1998లోని సెక్షన్ 6 ప్రకారం ప్రస్తుతం ఉన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్, సభ్యుల నియామకం జరిగినందున పదవీకాలం ఐదేళ్లు పూర్తిగా ఉంటుందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ స్పష్టం చేసింది.

వరుసగా ఐదో ఏడాదీ 'వైఎస్సార్ నేతన్న నేస్తం'

- నేడు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్
- తిరుపతి జిల్లా వెంకటగిరిలో కార్యక్రమం
- అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం
- ఇలా ఐదు విడతల్లో ప్రతి కుటుంబానికి రూ.1.20 లక్షలు



సాక్షి, అమరావతి: మగ్గాలకే ఉరి వేసుకొనే దుస్థితి నుంచి మగ్గాలను ఆధునికీకరించుకొని, జీవనాన్ని మెరుగుపర్చుకొనే స్థాయికి నేతన్నలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మగ్గానికి మహర్దశ తీసుకొచ్చి, దేశంలో ఎక్కడా లేని విధంగా నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. చేనేత కార్మికులకు చేయూతనిచ్చి, వారి స్థితిగతులను మెరుగు పరిచేందుకు 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకాన్ని తీసుకొచ్చి, ఏటా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. అర్హులై ఉండి సొంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందిస్తున్నారు. గత నాలుగేళ్లు క్రమం తప్పకుండా ఈ సాయాన్ని అందించారు. వరుసగా ఐదో ఏడాది కూడా వైఎస్సార్ నేతన్న నేస్తం' ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగే సభలో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి, రాష్ట్రవ్యాప్తంగా 80,686 మంది నేతన్నలకు రూ.193.64 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. శుక్రవారం అందిస్తున్న సాయంతో కలిపి అర్హుడైన ప్రతి ఒక్క నేతన్నకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.1.20 లక్షలు అవుతుంది.

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ నేతన్న నేస్తం' ద్వారా రూ.969.77 కోట్లు, నేతన్నల పెన్షన్ కోసం రూ.1,396.45 కోట్లు, ఆప్కోకు చెల్లించింది రూ.468.84 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో కలిపి) ఖర్చు చేసింది. ఇప్పటివరకు ఈ 3 పథకాల ద్వారానే నేతన్నల సంక్షేమం కోసం చేసిన వ్యయం రూ.2,835.06 కోట్లు. గత చంద్రబాబు ప్రభుత్వం నేతన్నల కోసం ఐదేళ్లలో కేవలం రూ.442 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే.., వైఎస్ జగన్ ప్రభుత్వం కేవలం నాలుగేళ్లలోనే దాదాపు 9 రెట్లు అధికంగా రూ.3,706 కోట్లు ఖర్చు చేయడం విశేషం. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంతో చేనేత కార్మికులు వారి మగ్గాలను డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసి కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ జీవితాలను మెరుగుపర్చుకున్నారు.

చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం

నేతన్నలకు ఆర్థిక సాయాన్ని అందించి, వారి జీవనాన్ని మెరుగుపర్చడమే కాకుండా, వారు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ చేసేందుకూ వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, నేతన్నల ఆదాయం పెంచేందుకు ప్రముఖ ఈ కామర్స్ సంస్థలైన అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్, లూమ్‌ఫోక్స్, మిర్రా, పేటీఎం, గోకూప్ వంటి వ్యాపార దిగ్గజాలతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. తద్వారా చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, జగనన్న వసతి దీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, కోవిడ్ సహాయం, జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ కళ్యాణమస్తు, జగనన్న తోడు (వడ్డీ), మత్స్యకార భరోసా, అర్చకులు, పాస్టర్లు, ఇమామ్‌లకు సాయం తదితర పథకాల ద్వారా నేతన్నలకు ఇప్పటి వరకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన లబ్ధి రూ.3,706.16 కోట్లు.

నేడు తిరుపతి జిల్లాలో సీఎం పర్యటన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం తాడేపల్లి నుంచి బయలుదేరి తిరుపతి జిల్లా వెంకటగిరికి చేరుకుంటారు. విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా వైఎస్సార్ నేతన్న నేస్తం నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఆ తర్వాత వెంకటగిరి త్రిభువన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధనరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు.

సీఆర్డీఏలో పేదలకు సదుపాయాలు

- రూ.72.06 కోట్లతో స్కూళ్లు, హెల్త్, అంగన్‌వాడీ కేంద్రాలు
- 24న శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సీఆర్డీఏ పరిధిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని 53,216 మంది పేద ప్రజలకు కేటాయించిన ఇళ్లస్థలాల ప్రాంగణాల్లో ఈనెల 24న మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాంతంలో ప్రజలకు విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, డిజిటల్ లైబ్రరీలు, ఆస్పత్రులు నిర్మించనున్నారు. ఆయా పనులకు సోమవారం సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 25 లేఅవుట్లలో రూ.72.06 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కాగృహాలతో పాటు టిడ్కో గృహాలతో కలిపి ఈ ప్రాంతంలో నివాసముండే 2.36 లక్షలమంది జీవన ప్రమాణాలు అత్యుత్తమంగా ఉండాలనే లక్ష్యంతో అమరావతి స్మార్ట్ అండ్ సస్టయినబుల్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నామన్నారు. మొత్తం 25 లే అవుట్లలో 45 ప్రాజెక్టులు తలపెట్టినట్లు తెలిపారు. రూ.25 కోట్లతో 11 పాఠశాలలు, రూ.20 కోట్లతో 12 ఈ–హెల్త్ సెంటర్లు, రూ.17.60 కోట్లతో 11 అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.9.46 కోట్లతో 11 డిజిటల్ లైబ్రరీలు నిర్మిస్తున్నట్టు చెప్పారు.

ప్రపంచంతో పోటీ

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశం అయ్యారు. విద్యా శాఖ, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావివ్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఐబీ (ఇంటర్‌నేషనల్ బాకలారియేట్)తో కలిసి ఒక కొత్త సిలబస్‌ను రూపొందించబోతున్నామని, అది దేశానికే బెంచ్ మార్క్ కాబోతుందని ఈ సందర్భంగా సీఎం జగన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఐబీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో కలిసి టీచింగ్ మెథడాలజీని, పాఠ్య ప్రణాళికను మార్చబోతున్నామని.. దీనికి మీ లాంటి వారి సహకారం అవసరమని కోరారు. తద్వారా ఈ కల సాకారమయ్యే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> "ఉన్నత విద్యలో పరీక్షా విధానం, మెథడాలజీ, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో తీసుకురావాల్సిన మార్పులపై దృష్టి సారించాలి. మరోవైపు వెస్టర్న్ వరల్డ్ తరహాలో మరిన్ని వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై అధ్యయనం చేయాలి. వర్చువల్ టీచింగ్, వర్చువల్ కంటెంట్ అందుబాటులోకి తేవాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో వస్తున్న మార్పులను కరిక్యులమ్‌లో భాగం చేయాలి. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ఎలా భాగస్వామ్యం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలి. మరింత సమగ్రంగా, సులభంగా అర్థమయ్యేలా, ఆచరణీయంగా ఉండేలా మార్పు చేయాలి." - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఉన్నత విద్యలో మెరుగైన సంస్కరణలు

- మనం రెండు ప్రధాన అంశాలపై దృష్టి పెట్టాం. ఒకటి పాఠశాల విద్య, రెండోది ఉన్నత విద్య. పాఠశాల దశ నుంచి ఉన్నత విద్య వరకు ఈ రెండింటినీ అనుసంధానం చేయాలి. పాఠ్యప్రణాళిక కూడా సమ్మిళితం చేయాలి. ఇది ప్రధాన లక్ష్యం.
- ఉన్నత విద్యలో మరింత మెరుగైన సంస్కరణలు అవసరం. ఇండియాలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వంటి వర్టికల్స్ అభివృద్ధి చాలా తక్కువ. వాటిని బోధించే సిబ్బంది కొరత కూడా ఎక్కువ. వీటిని పాఠ్య ప్రణాళికలో భాగం చేయాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు ఫైనాన్స్ సబ్జెక్ట్‌నే తీసుకుంటే.. బీకామ్‌లో ఫైనాన్స్‌కు సంబంధించిన ఇతర వర్టికల్స్ ఏవీ అందుబాటులో లేవు. అక్కడితో ఆగిపోవాల్సిన పరిస్థితి. రిస్క్ మేనేజ్‌మెంట్, అసెట్ మేనేజ్‌మెంట్, రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ వంటి అంశాలను కరిక్యులమ్‌లో భాగం చేయాలి.
- కంటెంట్ ఉన్నా, ఈ వర్టికల్స్‌ను బోధించే సిబ్బంది అందుబాటులో లేనందునే కరిక్యులమ్‌లో భాగంగా వీటిని తీసుకురాలేకపోతున్నాం. వెస్టర్న్ వరల్డ్‌లో వీటికి సంబంధించిన ఫ్యాకల్టీ ఉంది. ఇవన్నీ అక్కడ కరిక్యులమ్‌లో భాగంగా ఉన్నాయి. అందువల్ల ఇక్కడ వర్చువల్ రియాలిటీ, అగ్‌మెంటెడ్ రియాలిటీ వంటి అంశాలు కరిక్యులమ్‌లో చేర్చాలి.
- ఈ కరిక్యులమ్ కేవలం ఒక సంస్థకే పరిమితం కాకుండా.. పెద్ద సంఖ్యలో స్కూళ్లు, కాలేజీల్లో అందుబాటులోకి తీసుకురావాలి. ఒక తరంలో వీటిని మనం నేర్పించగలిగితే... ఆయా వర్టికల్స్‌లో మనం నిపుణులను తయారు చేయగలుగుతాం. ఈ అంశాలను మన కరిక్యులమ్‌లో భాగంగా చేర్చకపోతే.. మన పాఠ్య ప్రణాళిక బలపడదు. వెస్టర్న్ వరల్డ్‌తో పోటీ పడలేం. అందువల్ల ప్రధానంగా ఈ అంశాలపై దృష్టి పెట్టాలి. దీన్ని పెద్ద ఎత్తున ఎలా చేపట్టాలన్న కసరత్తు జరగాలి. స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఎలా సమ్మిళితం చేయాలన్నది మూడో అంశం.

తరగతి గదుల డిజిటలైజేషన్

- రాష్ట్రంలో ఇప్పటికే 6వ తరగతి నుంచి తరగతి గదుల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టాం. ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 63 వేల తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నాం. డిసెంబర్ ఆఖరుకు ఇది పూర్తవుతుంది. ఇప్పటికే 32 వేల తరగతి గదుల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ముగిసింది.
- 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ను అమలు చేస్తున్నాం. బైలింగువల్ టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేస్తున్నాం. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు కూడా ఇస్తున్నాం. ఈ మార్పులన్నీ ఏపీలోని స్కూళ్లలో చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పులను ఇప్పుడు ఉన్నత విద్యతో సమ్మిళితం చేస్తూ మరింత ముందుకు ఎలా తీసుకువెళ్లాలన్నదే మన ముందున్న సవాలు.

ఐబీ యుగంలో ఉన్నాం

- ఇప్పుడు మనం ఐబీ (ఇంటర్‌నేషనల్ బాకలారియేట్) యుగంలో ఉన్నాం. మనం వాటిని అవలంబించలేకపోతే, ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను ఒడిసి పట్టుకోలేకపోతే.. వెస్టర్న్ కంట్రీస్‌లో పిల్లల మాదిరిగా మన పిల్లలు సమాధానాలు చెప్పగలిగే స్థితిలో ఉండరు. ఐబీలో వారి ప్రశ్నల స్థాయికి, మనకు మధ్య చాలా తేడా ఉంది.
- మనం 3వ తరగతి నుంచే టోఫెల్ ప్రైమరీ, టోఫెల్ జూనియర్, ప్లస్1, ప్లస్ 2 లెవల్లో సీనియర్ పరీక్షలను కరిక్యులమ్‌లో భాగం చేయబోతున్నాం. ఈ మార్పులన్నీ ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అందించగలిగితే అది గొప్ప మార్పు అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు అదే చేస్తున్నాం.
- స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఈ మార్పులు తీసుకుని వెళ్లి, సమ్మిళితం చేయడం ద్వారా ప్రధానమైన పోటీదారుల్లుగా నిలబెట్టి.. మా పిల్లలను ప్రపంచ స్థాయికి తీసుకుపోవాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. అత్యుత్తమ ఐటీ నిపుణులు, కంపెనీ ప్రతినిధులుగా నిలబెట్టాలన్నది మా ఆశయం. ఈ నేపథ్యంలో ఈ మార్పుల కోసం మీ అందరి సహకారం కోరుతున్నాను.

వర్చువల్‌గా విదేశీ కోర్సులు

- ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌ను పాఠశాల స్థాయికే పరిమితం చేయకుండా ఉన్నత విద్యలో కూడా ప్రవేశపెట్టాలి. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను చేర్చగలిగితే మంచి ఫలితాలు వస్తాయి. అప్పుడు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే నాటికి మన పిల్లలకు మంచి ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉంటుంది.
- కొన్ని కోర్సుల కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అదే సబ్జెక్ట్‌లను వర్చువల్‌గా బోధించడం ద్వారా మన దేశంలో అందుబాటులోకి తీసుకురావాలి. వర్చువల్ టీచింగ్, వర్చువల్ కంటెంట్ అందుబాటులోకి తేవాలి. ఇంజనీరింగ్, మెడిసిన్‌లోని సంప్రదాయ విధానాల్లో కూడా మార్పులు రావాలి. వాటిని పునర్‌నిర్వచించాల్సిన అవసరం ఉంది. రోబోటిక్స్ ఉండేలా రూపొందించాల్సిన అవసరం ఉంది. వీటిమీద దృష్టి పెట్టాలి. ఈ మార్పులన్నింటినీ దృష్టిలో ఉంచుకుని వచ్చే సమావేశం నాటికి స్కూల్ ఎడ్యుకేషన్‌తో పాటు హయ్యర్ ఎడ్యుకేషన్‌లో కూడా ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి.



ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై హైపవర్ వర్కింగ్ గ్రూపుతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత

- ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనలో వచ్చిన మార్పులను కూడా మీరు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీ ఏర్పాటు చేశాం. 6వ తరగతి నుంచి ప్రతి తరగతిగదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేశాం.
- పిల్లల గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే వరకు భరోసా అందించాలన్నదే మా ప్రయత్నం. ఇందులో భాగంగా తల్లులు తమ పిల్లలను స్కూల్‌కు పంపించేలా ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే నూటికి నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలవుతోంది. రూ.20 వేల వరకు పిల్లలకు బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చులు చెల్లిస్తున్నాం. మా ప్రభుత్వం మానవ వనరుల మీద పెట్టుబడి పెడుతోంది. విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.


సమావేశంలో పాల్గొన్న వారు..

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ అండ్ స్కిల్స్ లీడ్ డాక్టర్ విన్నీ జౌహరి, ఇంటెల్ సీనియర్ డైరెక్టర్ (ఆసియా పసిఫిక్ అండ్ జపాన్) శ్వేత ఖురానా, నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సంధ్య చింతాల, ప్రైమస్ పార్ట్‌నర్స్ ఇండియా కో ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ చారు మల్హోత్ర, ప్రైమస్ పార్ట్‌నర్స్ ఇండియా ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ పూజ క్వాత్రా, సెంటర్ ఫర్ డిజిటల్ ఎకానమీ పాలసీ రీసెర్చ్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ జైజిత్ భట్టాచార్య, అమెజాన్ వెబ్ సర్వీసెస్ హెడ్ ఆఫ్ స్కిల్స్ టు జాబ్స్ (ఇండియా అండ్ సౌత్ ఆసియా) డిపి సింగ్, గూగుల్ లీడ్ ఎడ్యుకేషన్ శ్రీనివాస్ గరిమెళ్ల, మైక్రోసాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రామ్ మేనేజర్ కిషోర్ గార్గ్, డేటావివ్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ వేదాంత్ అహ్లువాలియా, డేటావివ్ బోర్డు మెంబర్ అతుల్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, సమగ్రశిక్షా అభియాన్ ఎస్‌పీడీ బి శ్రీనివాసరావు, మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధి మీనా, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ (మౌలిక వసతుల కల్పన) కాటమనేని భాస్కర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సి ఎస్ దీవాన్ రెడ్డి, పలువురు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

సీఎంతో సమావేశమైన ప్రముఖులు..

డాక్టర్ విన్నీ జౌహరి

మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ అండ్ స్కిల్స్ లీడ్



మైక్రోసాఫ్ట్‌లో డైరెక్టర్, ఎడ్యుకేషన్ అడ్వొకసీగా విన్నీ జౌహరి పని చేస్తున్నారు. దీనికి ముందు గుర్గావ్‌లోని ఐఐఎంటీలో డైరెక్టర్, స్ట్రాటజీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. హెచ్‌పీ ల్యాబ్స్ ఓపెన్ ఇన్నోవేషన్ ఆఫీస్‌కు రీజియన్ లీడ్‌గా సేవందించారు. హెచ్‌పీ ల్యాబ్స్‌లో పనికి, విద్యా విషయాల్లో విజయాలకు అవార్డులు అందుకున్నారు. జౌహరి జర్నల్ ఆఫ్ సర్వీసెస్ రీసెర్చ్, జర్నల్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఫర్ గ్రోయింగ్ ఎకానమీస్‌కు వ్యవస్థాపక సంపాదకురాలుగా ఉన్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి పీహెచ్‌డీ పొందారు.

శ్వేత ఖురానా

ఇంటెల్ సీనియర్ డైరెక్టర్ (ఆసియా పసిఫిక్ అండ్ జపాన్)



ఆసియా పసిఫిక్, జపాన్ ప్రభుత్వాలతో వ్యూహాత్మక కార్యక్రమాలు నడిపించే బాధ్యత శ్వేత ఖురానా నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, డెవలప్‌మెంట్ ఏజెన్సీలు, విద్యాసంస్థలు, కమ్యూనిటీలతో సంబంధాలు కొనసాగించడంలో 23 ఏళ్ల అనుభవం ఉంది. 2010లో ఇంటెల్‌లో చేరారు. ఇండోనేసియాలో ఇంటెల్ కోసం కార్పొరేట్ అఫైర్స్, టెక్–ఎనేబుల్డ్ ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించడం, ఇండియాలో కే12 ఎడ్యుకేషన్‌ను నిర్వహించడం వంటి అంశాల్లో నాయకత్వం వహించారు.

చారు మల్హోత్ర

ఎండీ, కో ఫౌండర్, ప్రైమస్ పార్ట్‌నర్స్ ఇండియా



విద్యావేత్త, లెర్నింగ్, డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్, పబ్లిక్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్‌లో 20 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం చారు మల్హోత్రకు ఉంది. విద్య, సాంకేతికత, సీఎస్ఆర్ కార్యక్రమాలలో ప్రాజెక్టులపై 15 కంటే ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పనిచేశారు. భారతదేశంలోని ప్రభుత్వాల్లో ముఖ్యమైన ప్యానెళ్లు, కమిటీల్లో పనిచేశారు.

శ్రీనివాస్ గరిమెళ్ల

గూగుల్ లీడ్ ఎడ్యుకేషన్



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఎంటర్‌ప్రైజ్, ప్రభుత్వ, విద్యాపరమైన పాత్రలను కలిగి ఉన్న బహుముఖ విధుల్లో 20 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం శ్రీనివాస్‌కు ఉంది. కార్పొరేట్, ప్రభుత్వ, విద్యాసంస్థల పనితీరులో సమర్థత, ప్రభావాన్ని తీసుకురావడానికి ఐసీటీ జోక్యాలపై దృష్టి సారించి అనేక ఇ–గవర్నెన్స్ ప్రాజెక్ట్‌లు, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్‌లకు నాయకత్వం వహించారు. భారతదేశంలో మైక్రోసాఫ్ట్ కోసం స్మార్ట్ సిటీ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ ప్రాక్టీస్‌ను నిర్మించడానికి బాధ్యత వహిస్తున్నారు.

జైజిత్ భట్టాచార్య

సెంటర్ ఫర్ డిజిటల్ ఎకానమీ పాలసీ రీసెర్చ్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్



ఐఐఎం కలకత్తా ఇన్నోవేషన్ పార్క్ డైరెక్టర్ల బోర్డులో జైజిత్ భట్టాచార్య ఉన్నారు. డిజిటల్ విజన్ 2035 రూపొందిస్తున్నారు. షేకత్కర్ కమిటీ నివేదిక ఆధారంగా భారత వైమానిక దళ పునర్నిర్మాణం వంటి జాతీయ కార్యక్రమాలకు సహకరించారు. ఓపెన్ స్టాండర్డ్స్‌పై జాతీయ విధానానికి సహకరించారు. పెట్టుబడిదారుల దృక్కోణం నుంచి ప్రభుత్వ కార్యక్రమాలను సంకలనం చేసిన 'ఇండియా సోర్స్ హై' నివేదిక ముఖ్య రచయిత ఆయన. మేక్ ఇన్ ఇండియా ప్రోగ్రాం లాంచ్‌లో భాగంగా ప్రధాని మోదీ దీనిని ప్రారంభించారు. ఇ–గవర్నెన్స్ వ్యూహాలపై ప్రభుత్వాలకు సలహాలు ఇస్తున్నారు.

ఏపీకి యానిమల్ హెల్త్ లీడర్‌షిప్ అవార్డు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి వరుసగా రెండోసారి ప్రతిష్టాత్మకమైన 'ఇండియా యానిమల్ హెల్త్ లీడర్‌షిప్ అవార్డు–2023' వరించింది. పశువైద్య నిర్వహణలో అత్యుత్తమ రాష్ట్రంగా నిలిచిన ఏపీకి ఈ అవార్డు దక్కింది. వివిధ రంగాల్లో అద్భుత పనితీరును ప్రదర్శించిన రాష్ట్రాలు, శాఖలకు అగ్రికల్చర్ టుడే గ్రూప్ రెండో ఎడిషన్‌లో ప్రకటించిన జాతీయ అవార్డుల్లో రాష్ట్రానికి ఈ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో ఈనెల 26న జరగనున్న ఇండియా యానిమల్ హెల్త్ సమ్మిట్–23లో రాష్ట్రానికి ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.

పశువైద్యానికి పెద్దపీట..

గతంలో ఎన్నడూలేని విధంగా పశువైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నాలుగేళ్లలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

- ఆర్బీకేల ద్వారా పాడి రైతులకు సర్టిఫై చేసిన పశుగ్రాసం, సంపూర్ణ మిశ్రమ దాణా, చాఫ్ కట్టర్స్ అందించడమే కాక.. గ్రామస్థాయిలో రాజన్న పశువైద్యం పేరిట నాణ్యమైన పశువైద్య సేవలందిస్తోంది.
- నియోజకవర్గానికి రెండుచొప్పున వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలను తీసుకొచ్చింది. 104, 108 తరహాలో ఫోన్‌చేసిన 20 నిమిషాల్లో మారుమూల పల్లెలకు ఈ రథాలు చేరుకుని రైతుల ముంగిట పశువైద్య సేవలందిస్తున్నాయి.
- దేశంలోనే తొలిసారి రూ.7 కోట్లతో ఏర్పాటు చేసిన టెలిమెడిసిన్ కాల్‌సెంటర్ ద్వారా శాస్త్రవేత్తలు, పశు వైద్యాధికారుల ద్వారా పాడి రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నారు.
- నియోజకవర్గ స్థాయిలో 154 వైఎస్సార్ వెటర్నరీ ల్యాబ్స్ ద్వారా సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయడం ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నారు.

ఏపీ బాటలో అడుగులు..

మరోవైపు.. పశుపోషణ కోసం అవసరమైన బ్రాండెడ్ మందులను చౌకగా అందించేందుకు దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటుచేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మరో 300 ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏపీ తరహాలోనే.. వెటర్నరీ అంబులెన్స్‌తో పాటు ల్యాబ్స్, కాల్ సెంటర్, గో పుష్టి కేంద్రాలను తమ రాష్ట్రాల్లో కూడా ఏర్పాటుచేసేందుకు పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు అడుగులు వేస్తున్నాయి. ఏపీ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా జనరిక్ పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటుచేయబోతున్నట్టు కేంద్రం కూడా ఇటీవలే ప్రకటించింది.

అవార్డులే అవార్డులు..

ఇలా.. పాడి పరిశ్రమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు గతంలో ఎన్నడూలేని విధంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కుతోంది. ఫలితంగా పెద్దఎత్తున అవార్డులు, రివార్డులు లభిస్తున్నాయి. అవి..

- పశు సంవర్ధక సేవలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే సంకల్పంతో అభివృద్ధి చేసిన 'పశుసంరక్షక్ యాప్'కు 2021–22లో సిల్వర్ స్కోచ్ అవార్డు దక్కింది.
- కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి 2020లో అవార్డు ఆఫ్ ఎక్స్‌లెన్స్ దక్కింది.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో స్కోచ్ సంస్థ ప్రకటించిన అవార్డుల్లో నాలుగు రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు వరించాయి.
- వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలకు సిల్వర్ స్కోచ్ దక్కగా.. వెటర్నరీ టెలీమెడిసిన్ కాల్ సెంటర్, పశువుల వ్యాధి నిర్ధారణ ల్యాబ్స్‌తో పాటు ఆంధ్ర గోపుష్టి కేంద్రానికి స్కోచ్ మెరిట్ అవార్డులు వరించాయి.
- అగ్రికల్చర్ టు డే గ్రూప్ 2022లో ప్రకటించిన మొదటి ఎడిషన్‌లో కూడా బెస్ట్ స్టేట్ ఇన్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ కేటగిరీలో ఇండియా యానిమల్ హెల్త్ లీడర్‌షిప్ అవార్డ్–2022 రాష్ట్రానికి దక్కింది.

వరుసగా రెండో ఏడాది..

సీఎం జగన్ ఆలోచనల మేరకు నాలుగేళ్లలో పశుసంవర్థక శాఖలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు జాతీయస్థాయిలో గుర్తింపు దక్కించుకున్నాయి. వరుసగా రెండో ఏడాదీ అవార్డు దక్కడం గర్వంగా ఉంది.

– డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశుసంవర్థక శాఖ

క్లుప్తంగా...

కులవాదులకు రాజకీయ చరమగీతం

1,026వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: చట్టాలను చుట్టాలుగా చేసుకుని అమరావతిని, అందులో ఉన్న పేదలను నిలువునా దోచుకున్న కులవాదులకు రాజకీయంగా చరమగీతం పాడక తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం 1,026వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ పేదల లంక, అసైన్డ్ భూములను బెదిరించి కొనుగోలు చేసి తప్పుడు జీవో ద్వారా చట్టబద్ధం చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కారుమూరి పుష్పరాజ్, మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పాల్గొన్నారు.

ఏ రాష్ట్రం అప్పలెంతో పురందేశ్వరి తెలుసుకోవాలి

వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పురందేశ్వరికి ఏమీ గుర్తుండటం లేదేమోనని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శలు చేస్తున్న పురందేశ్వరి.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణాల గురించి తెలుసుకొని, ఏ రాష్ట్రం ఎక్కువ అప్పులు చేస్తోందో ప్రజలకు చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ ముగ్గురం కలసి వస్తామంటూ వ్యాఖ్యానిస్తున్నారని, అసలు ఈ ముగ్గురి పొత్తు గురించి బీజేపీ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ముగ్గురు వచ్చినా ఇద్దరు వచ్చినా.. ఎంత మంది వచ్చినా.. వైఎస్ జగన్ పాలన ముందు నిలబడలేరని స్పష్టం చేశారు.

చంద్రబాబు సింగపూర్ కనెక్షన్‌పై దర్యాప్తు చేయాలి

ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం



ఆమదాలవలస: గత ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సింగపూర్ కంపెనీలతో కాంట్రాక్టులు పెట్టుకుని రాష్ట్రాన్ని తాకట్టుపెట్టేందుకు ప్రయత్నించారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన గురువారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాబు సింగపూర్ కాంట్రాక్టులపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తానన్నారు. రాష్ట్రంలోని నిష్పక్షపాత పాలనపై దేశవిదేశాల్లో అధ్యయనాలు జరుగుతుంటే ఇక్కడి ప్రతిపక్షాలు మాత్రం బురద చల్లాలని చూడడం సరికాదన్నారు.

రామాంజనేయ చౌదరిని వెంటనే అరెస్టు చేయాలి

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



నవీన్‌తో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

ఒంగోలు టౌన్: అగ్రకుల దురహంకారంతో గిరిజన యువకుడిపై అత్యంత క్రూరంగా దాడి చేయడమే కాకుండా అతనిపై మూత్రం పోయడం, కులం పేరుతో దూషించడం వంటి హేయమైన చర్యలకు పాల్పడిన మన్నెం రామాంజనేయ చౌదరితో పాటు ఇతర నిందితులను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పోలీసులకు సూచించారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన.. బాధిత యువకుడిని పరామర్శించారు. ప్రజాసంఘాలు, గిరిజన పెద్దల సమక్షంలో బాధితుడు మోటా నవీన్‌తో మాట్లాడి ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం అగ్రకుల దురహంకారంతోనే రామాంజనేయ చౌదరి అమానవీయంగా ప్రవర్తించాడన్నారు. ఈ ఘటన విషయంలో సీఎం వైఎస్ జగన్ సీరియస్‌గా ఉన్నారని, నిందితులను శిక్షించాలని ఆదేశించారని తెలిపారు.

నన్ను అడ్డుకునే దమ్ముందా!

నారా లోకేశ్

కనిగిరి రూరల్: 'నన్ను అడ్డుకోమని సీఎం జగన్ పోలీసుల్ని పంపారు. నన్ను అడ్డుకునే దమ్ము ఎవరికైనా ఉందా' అని టీడీపీ నేత నారా లోకేశ్ ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం రాత్రి ప్రకాశం జిల్లా కనిగిరి చర్చి సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో సుమారు 100 సంక్షేమ పథకాలు రద్దు చేశారని లోకేశ్ ఆరోపించారు.

నీటి ఎద్దడి నివారణపై 80 దేశాల సదస్సు

విశాఖలో నవంబర్ 1 నుంచి 8 వరకు నిర్వహణ

- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి ఆహ్వానం
- 80 దేశాల నుంచి 500 మంది హాజరయ్యే అవకాశం
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వెల్లడి
- ఐసీఐడీ 25వ కాంగ్రెస్, 74వ ఐఈసీ సమావేశం బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, అధికారులు

సాక్షి, అమరావతి: రానున్న రోజుల్లో వ్యవసాయ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలనే అజెండాతో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకూ విశాఖపట్నంలో ఐసీఐడీ (ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రెయినేజీ) 25వ అంతర్జాతీయ సదస్సు (ఇంటర్నేషనల్ కాంగ్రెస్) నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, ఐసీఐడీ ఉపాధ్యక్షుడు, 25వ కాంగ్రెస్ నిర్వాహక కార్యదర్శి కె.యల్లారెడ్డితో కలిసి మంత్రి అంబటి రాంబాబు ఐసీఐడీ 25వ కాంగ్రెస్, ఆ సంస్థ 74వ ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సమావేశం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఈ ప్రతిష్టాత్మక సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రిని సదస్సుకు ప్రత్యేకంగా ఆహ్వానించామని తెలిపారు. ఐసీఐడీలో సభ్యత్వం ఉన్న 80 దేశాలకు చెందిన సుమారు 400 నుంచి 500 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారన్నారు. దేశంలో ప్రతిష్టాత్మక సంస్థల నుంచి సుమారు 500 నుంచి 600 మంది సాంకేతిక నిపుణులు సైతం సదస్సులో పాల్గొంటారన్నారు.

నీటి ఎద్దడిపైనే ఫోకస్

ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో నీటి ఎద్దడిని యాజమాన్య పద్ధతుల ద్వారా సమర్థవంతంగా ఎదుర్కోవడమే అజెండాగా 1951లో భారత్ ప్రోద్బలంతో ఐసీఐడీ ఏర్పాటైందని మంత్రి రాంబాబు చెప్పారు. తొలుత 11 సభ్య దేశాలతో ప్రారంభమైన ఐసీఐడీ ఇప్పుడు ప్రపంచంలో నీటిపారుదల, డ్రెయినేజీ వ్యవస్థలున్న 80 దేశాలు సభ్యులుగా ఉన్నాయన్నారు. ప్రతి మూడేళ్లకు ఓసారి ఐసీఐడీ సమావేశమై నీటి యాజమాన్య పద్ధతులపై మేథోమథనం చేసి నీటిఎద్దడిని ఎదుర్కోవడంపై ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తుందన్నారు. ఐసీఐడీ 6వ కాంగ్రెస్ 1966లో మన దేశంలో జరిగిందని, 57 ఏళ్ల తర్వాత ఆ సంస్థ 25వ కాంగ్రెస్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తుండటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సదస్సును విజయవంతం చేయడానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు

పులిచింతలలో నిల్వ చేసిన నీటితో ఇన్నాళ్లూ కృష్ణా డెల్టాకు నీళ్లందించామని మంత్రి రాంబాబు చెప్పారు. ప్రస్తుతం పులిచింతలలో నీటి నిల్వ 17.41 టీఎంసీలకు చేరుకుందని, కృష్ణాలో వరద ప్రవాహం రావడంలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో పట్టిసీమ ఎత్తిపోతల పంపులను రీస్టార్ట్ చేసి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. నాలుగేళ్లలో ఇప్పటిదాకా కేవలం ఒకే ఒక్కసారి మాత్రమే పట్టిసీమ ఎత్తిపోతలను వాడుకున్నామని గుర్తు చేశారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువకు 5 టీఎంసీలను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాత దానితో అనుసంధానించాలా? లేదంటే కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? అనే అంశంపై అధికారులు చర్చిస్తున్నారని తెలిపారు. త్వరలోనే పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ, కేంద్ర జల సంఘానికి నివేదిక ఇస్తారని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర జల్ శక్తి శాఖ డయా ఫ్రమ్ వాల్‌పై తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. వీలైనంత త్వరగా పోలవరాన్ని పూర్తి చేయాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి చెప్పారు. ఐసీఐడీ 25వ కాంగ్రెస్ కార్య నిర్వాహక కార్యదర్శి కె.యల్లారెడ్డి మాట్లాడుతూ నీటి యాజమాన్యంలో మెరుగైన పద్ధతులు పాటించిన దేశాలకు ప్రోత్సాహకంగా అవార్డులు అందచేస్తామని తెలిపారు.

ఇద్దరు టీచర్లకు నకిలీ బదిలీ ఉత్తర్వులు

ఒంగోలు: ఇద్దరు ఉపాధ్యాయులకు నకిలీ బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన వ్యవహారం ప్రకాశం జిల్లాలో వెలుగుచూసింది. జిల్లా విద్యా శాఖ కార్యాలయం వేదికగా ఈ బదిలీ ఉత్తర్వులు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో పి.రమేశ్‌ను హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఆఫ్‌లైన్‌లో నకిలీ ఉత్తర్వుల జారీ

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వారి అర్హతలను బట్టి బదిలీ స్థానాలు కేటాయించారు. కానీ కంభం, బల్లికురవ మండలాల్లోని ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు మాత్రం ఆఫ్‌లైన్ ఉత్తర్వులు అందుకున్నారు. వాటి ఆధారంగా పాఠశాలల్లో చేరారు. అనంతరం వారికి పదోన్నతులు లభించి హెడ్మాస్టర్లుగా కూడా వేర్వేరు పాఠశాలలకు వెళ్లిపోయారు. ఆన్‌లైన్‌లో బదిలీ ఉత్తర్వులు అందుకున్నవారి సంఖ్యకు, నూతన స్థానాల్లో చేరిన వారి సంఖ్యకు మధ్య ఇద్దరు అధికంగా ఉండటం ఆర్జేడీ దృష్టికి వచ్చింది. దీంతో వాటన్నింటినీ పరిశీలించి కంభం, బల్లికురవ మండలాల్లో ఇద్దరికి పోస్టింగ్‌లు ఎలా వచ్చాయనేది అర్థంగాక సంబంధిత కాపీలను తెప్పించుకుని పరిశీలించారు. దీంతో అవి ఆఫ్‌లైన్‌లో జారీ అయిన నకిలీ ఉత్తర్వులని తేలింది. అందుకు బాధ్యులైన డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉదయభాస్కర్, సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.సురేశ్, స్కూల్ అసిస్టెంట్ గిరిలను సస్పెండ్ చేశారు.

సత్తాను బట్టే సీఎం ఎవరనేది నిర్ణయం

- రూ.5వేలు తీసుకునే వలంటీర్‌లు స్వచ్ఛంద సేవకులు ఎలా అవుతారు?
- రాష్ట్ర బంగారు భవిష్యత్ కోసం బలమైన నిర్ణయం ఉంటుందని అమిత్ షా చెప్పారు
- జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: 'ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పనిచేసిన తర్వాత వచ్చిన స్థానాలు, సత్తాను బట్టి ముఖ్యమంత్రి ఎవరనే నిర్ణయం ఉంటుంది. నేను పరివర్తన తీసుకొచ్చే రాజకీయాలు చేస్తాను. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే నిర్ణయాలే ఉంటాయి. రాబోయే ప్రభుత్వంలో కచ్చితంగా జనసేన పార్టీ ముద్ర బలంగా ఉంటుంది' అని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రభుత్వం శ్వేతపత్రం ఇవ్వాలి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా వలంటీర్ల ద్వారా ప్రజల వ్యక్తిగత డేటాను సేకరించి మూడు ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిందని పవన్ మరోసారి ఆరోపించారు. దీని వెనకున్న ప్రజాప్రతినిధులు ఎవరనేదానిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్‌ను ఇంటికి పంపించే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ప్రతీ నెలా రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటున్న వలంటీర్లు స్వచ్ఛంద సేవకులు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. ఇక తాను ఢిల్లీ వెళ్లింది కేసుల మాఫీ కోసమో, అప్పుల కోసమో కాదని.. ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం బలమైన నిర్ణయం ఉంటుందని ఢిల్లీ పర్యటనలో అమిత్ షా తనతో చెప్పారన్నారు. అంతకుముందు.. మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పవన్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

జేపీ నడ్డాతో పవన్ భేటీ

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పవన్‌కళ్యాణ్ భేటీ అయ్యారు. ఎన్డీఏ పక్షాల భేటీలో పాల్గొనేందుకు మూడు రోజుల కిందట ఢిల్లీ వచ్చిన పవన్ గురువారం నడ్డాతో సమావేశమై ఏపీలో రాజకీయ పరిస్థితులు, ఎన్నికలకు సమాయత్తం, టీడీపీతో పొత్తు గురించి చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. అనంతరం ఆయన ఢిల్లీ నుంచి బయలుదేరి విజయవాడ వెళ్లారు.

ప్రభుత్వంపై ప్రజలు దండయాత్ర చేయాలి

- మద్యం ధరలు పెరిగి మందుబాబులు ఇబ్బంది పడుతున్నారు
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు



సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల రేట్లు పెరిగి రైతులు, కరెంట్ చార్జీలు, గ్యాస్ ధరలు, నిత్యావసరాలు పెరిగి మహిళలు, మద్యం ధరలు పెరిగి మందు బాబులు నానా ఇబ్బంది పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో బాధ, ఆవేదన, కసి ఉన్నాయి. గ్రామాలకు గ్రామాలు తిరగబడాలి. ఈ ప్రభుత్వంపై దండయాత్ర చేయాలి' అని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు గురువారం టీడీపీలో చేరారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ జైలులో ఉండాల్సిన వాళ్లు రాజకీయాల్లో ఉండడం వల్లే రాష్ట్రానికి సమస్యలు, కష్టాలు వచ్చాయన్నారు. ప్రజలు అవకాశం ఇస్తే మంచి పరిపాలనతో ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావాలని, కానీ నేడు రాష్ట్రంలో ప్రజల జీవితాలు చీకటిమయం అయ్యాయన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఉంటే కరెంట్ చార్జీలు పెరిగేవి కావని, భవిష్యత్‌లో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పినా 2019లో ప్రజలు తన మాట వినలేదని, ఇప్పుడు ఫలితం చూస్తున్నారని అన్నారు. 2020 నాటికి పూర్తికావాల్సిన పోలవరాన్ని నాశనం చేశారని ఆరోపించారు. పోలవరం విషయంలో ఈ ప్రభుత్వం తప్పులు చేసి మళ్లీ టీడీపీపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఇరిగేషన్ మంత్రి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని, ఇప్పటికీ డయాఫ్రమ్ వాల్ ఏమయ్యిందో, ఎంత నష్టం జరిగిందో చెప్పలేకపోతున్నారని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, ఉంగుటూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ గన్ని వీరాంజనేయులు, నాయకులు నిమ్మకాయల చినరాజప్ప, పితాని సత్యనారాయణ, మాగంటి బాబు పాల్గొన్నారు.

టీడీపీ రాజానగరం ఇన్‌చార్జిగా వెంకటరమణ చౌదరి

తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తెలిపారు.

వలంటీర్లకు పవన్ క్షమాపణలు చెప్పాలి

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



ప్రొద్దుటూరు: నిరాధార ఆరోపణలు చేసినందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో రూ.150 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించిన ఆమె మీడియాతో మాట్లాడారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిందన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ప్రతి ఇంటికి వెళ్లి అందించిన సేవలు మరువలేనివన్నారు. అలాంటి వలంటీర్లను పవన్ విమర్శించడం తగదన్నారు. ఏ హోదాలో ఉన్నారని ఆయనకు కేంద్ర నిఘా వర్గాలు సమాచారం అందిస్తాయని ప్రశ్నించారు. పవన్‌పై కేసు నమోదు చేయాలని పలు స్టేషన్లలో ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారని, ఆయనపై కేసు నమోదు చేస్తే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందనడం తగదన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

బాబు, పవన్‌పై బీజేపీకి నమ్మకం లేదు

వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు లేదని, అందుకే వాళ్లిద్దరూ తరచూ బీజేపీ నేతలతో మాట్లాడుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కానీ వీళ్లిద్దరిపై బీజేపీకి నమ్మకం లేదన్నారు. గురువారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 'బీమా కుంభకోణం' అని పచ్చ పత్రికలు రాస్తున్నాయని, జిల్లాకు రూ.79 లక్షల బీమా మొత్తం మంజూరైతే రూ. 1.30 కోట్ల కుంభకోణం జరిగినట్లు రాయడం బుద్ధిలేని వారుచేసే పని అన్నారు. ఈ–కేవైసీ వేరే వారికి చేయడం వల్ల రూ. 17.75 లక్షలు పొరపాటున వేరేవారి ఖాతాలో జమ అయిందని చెప్పారు. ఇలా చేసిన వారిపై కూడా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

అర్చకులకు అండగా ప్రభుత్వం

మంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: అర్చకుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తమ ప్రభుత్వం ధర్మానికి కట్టుబడి ఉందని, సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు నిరంతరం కృషిచేస్తున్న అర్చకులకు అండగా కూడా నిలుస్తోందన్నారు. సచివాలయంలో గురువారం అర్చక సంఘం రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రతినిధులతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి ప్రభుత్వపరంగా అమలుచేస్తున్న పథకాలను వివరించారు. మంత్రి మాట్లాడుతూ దేవదాయ భూముల పరిరక్షణకు, అర్చకుల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎన్నికలకు ముందు అర్చకులకు ఇచ్చిన హామీ ప్రకారం జీతాలు పెంచామనిచెప్పారు. అర్చకుల గృహ నిర్మాణాల కోసం సీజీఎఫ్ లేదా అర్చక సంక్షేమ నిధులను అందజేస్తామన్నారు.

పవన్.. దేనికైనా సై

- మాజీమంత్రి పేర్ని నాని సవాల్
- ఆయనకు మాటలెక్కువ.. చేతలు తక్కువ
- డేటా చౌర్యం అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు
- చంద్రబాబు హయాంలో డేటా చోరీ చేసినప్పుడు ఏం చేశావు?
- చంద్రబాబుతో కలిసి పవన్ చేతనైనది చేసుకోవచ్చు



సాక్షి, అమరావతి: 'సై అంటే సై.. డేటా చౌర్యం ఆరోపణలపై దేనికైనా సిద్ధమే..' అని పవన్‌కళ్యాణ్‌కు మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని సవాల్ విసిరారు. వలంటీర్ల ద్వారా మేం డేటా చౌర్యం చేసినట్లు ఆయన వద్ద ఏమైనా ఆధారాలుంటే బయటపెట్టొచ్చన్నారు. చంద్రబాబు, బీజేపీతో కలిసి పవన్ చేతనైనది చేసుకోవచ్చని చెప్పారు. పవన్ గురువారం మాట్లాడిన తీరును పేర్ని నాని తీవ్రంగా తప్పుబట్టారు. ఆయనకు మాటలెక్కువ.. చేతలు తక్కువ అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు, పవన్, బీజేపీ కలిసి తలకిందులుగా తపస్సు చేసినా సీఎం జగన్‌ను ఇంటికి పంపించలేరని.. మీకు చేతనైతే, దమ్ముంటే 2024లో సీఎం జగన్‌ను గెలవకుండా ఆపాలని పేర్ని సవాల్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

నీకు చేతనైంది చేసుకో..

నిన్ను కొట్టాలంటే చంద్రబాబు, అమిత్ షా, మోదీ వద్ద చేతులు కట్టుకుని కూర్చో.. చెప్పిన పని సరిగ్గా చేయడంలేదని వాళ్లే కొడతారు. అంతేగానీ, పవన్‌ను కొట్టాల్సిన అవసరం మాకేముంటుంది. ఇలాంటి సొల్లు కబుర్లు పవన్ మానుకోవాలి. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా వైఎస్ జగన్ ప్రజల్లో నమ్మకాన్ని రుజువు చేసుకున్నారన్న భయం చంద్రబాబు, పవన్‌లో మొదలైంది. అందుకే డేటా చౌర్యం అంటూ మాట్లాడుతున్నారు. పవన్.. నువ్వు చెప్పిన కంపెనీల దగ్గర డేటా ఉందనుకుంటే నీకు చేతనైంది చేసుకో.. మాకెలాంటి భయంలేదు. అసలు.. ప్రజాసాధికారత సర్వే పేరుతో చంద్రబాబు, పవన్ జంటగా నడిపిన ప్రభుత్వం ఆ డేటాను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీకి సిగ్గూశరం లేకుండా పంపించింది. తెలంగాణ ప్రభుత్వం ఆ డేటా చౌర్యం చేసిన వారిని అరెస్టుచేస్తే అప్పుడు పవన్ నోరు పెగల్లేదు. ఇవాళ ఊగుతూ రంకెలు వేస్తూ మాట్లాడుతున్న ఆయన.. 2018, 2019లో రాష్ట్ర ప్రజల డేటా చౌర్యం జరిగితే పవన్ నోటికి ఏమైంది? నిజంగా మీకు దమ్ముంటే మాపై చేసిన ఆరోపణలు రుజువు చేయండి.. నీ పిచ్చి కూతలు నిజమైతే నువ్వు, చంద్రబాబు, బీజేపీ కలిసి మీకు చేతనైంది చేసుకోండి. సై అంటే సై.. ఇది యుద్ధం.. రాజకీయాల్లోకి వస్తే బరితెగించి మాట్లాడొచ్చన్నది పవన్ ఆలోచన.

జనసేన సభ్యత్వం డేటా ఎవరికిస్తున్నారు?

జనసేన సభ్యత్వం కావాలంటే పేరు, చదువు, ఆడ లేక మగ, ఫోన్ నంబరు, ఈ–మెయిల్, ఓటరు ఐడీ కావాలంటున్నారు. ఫోన్ నంబర్‌కు ఆధార్ లింక్ అవదా? ఆ డేటా అంతా ఎవరికిస్తున్నారు. ఇది డేటా చౌర్యం కాదా? అలాగే, నేను మోదీ, అమిత్ షా బాగా క్లోజ్ అని సొల్లు కబుర్లు చెబుతున్నాడు. కేంద్రం సెన్సెస్ తీస్తుంది కదా? నీ కేంద్ర ప్రభుత్వం, నీ మోదీ ప్రభుత్వం జనాభా లెక్కల్లో ఏం అడుగుతుందో తెలుసా? పేరు, కుటుంబ పెద్ద, ఆడ, మగ, డేట్ ఆఫ్ బర్త్, ఏ వయసులో పెళ్లయ్యింది.. మతం ఏంటి? మాతృభాష ఏంటి.. చదువు, ఎక్కడ పనిచేస్తున్నారు. ఆర్థికంగా చేసే వృత్తి, వ్యాపారం, ఎంతమంది పనిచేస్తున్నారు అనే వివరాలు కేంద్రం సేకరిస్తోంది. మరి అది డేటా చౌర్యం కాదా పవన్? ఈ వివరాలను కేంద్రం ఎందుకు తీసుకుంటుందో చెప్పాలి.

జనసేన ఎన్ని సీట్లలో పోటీ చేస్తుంది?

అఖండ ప్రజలు కోరుకుంటే ఎన్డీఏ వస్తుందని పవన్ అంటున్నారు? ఈ అఖండ ప్రజలెవరు? ఇదేమైనా అఖండ సినిమానా పవన్? హాలీడే ట్రిప్పుకు వచ్చి ఈ మాటలేంటి? అసలు.. 175 సీట్లలో ఎన్ని సీట్లలో జనసేన పోటీచేస్తుంది? జనాలను నమ్మించడానికి పెట్టుకున్న పొత్తా? అమిత్ షా, మోదీతో మాట్లాడానంటూ చెప్తుంటారు. ఇక.. నేషనల్ యూత్ వలంటీర్ పేరుతో కేంద్రం కూడా మన వలంటీర్ వ్యవస్థను ప్రారంభిస్తోంది. 2014 నుంచి 2023 జూలై వరకు పవన్ వలన ఈ రాష్ట్రానికి పైసా లాభం జరిగిందా? ప్రత్యేక హోదా, లోటు బడ్జెట్‌లను తేలేకపోయారు. సీఎం జగన్ లోటు బడ్జెట్ నిధులను తెచ్చారు. దీనికి పవన్, చంద్రబాబు సిగ్గుపడాలి. శత్రువుల నోటితోనే సీఎం జగన్ పాలన భేష్ అని సర్టిఫికెట్ ఇప్పించుకున్నాం. అదీ మా గొప్పతన. గోబెల్స్ ప్రచారం చేయటమే తప్ప పవన్ చేస్తున్నదేమిటి?

తీరంలో కరెంట్ తీగలుండవ్!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ జె.పద్మాజనార్దన రెడ్డి తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల ద్వారా తీరం వెంబడి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు 'సాక్షి ప్రతినిధి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు. భూగర్భ లైన్లు సాధారణంగా దెబ్బతినవని, విద్యుత్ పునరుద్ధరణ కూడా వేగంగా జరుగుతుందని వివరించారు. జాతీయ రోజువారీ విద్యుత్ సరఫరా సగటులో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, 24 గంటల్లో 23.56 గంటలకు తగ్గకుండా విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు, అభివృద్ధిపై ఆయన అందించిన వివరాలు ఆయన మాటల్లోనే..

తీర ప్రాంతంలో ప్రత్యేక గ్రిడ్

తుపాన్లు, గాలుల వల్ల విద్యుత్ వ్యవస్థకు కలిగే నష్టాన్ని తగ్గించడానికి తీర ప్రాంతంలో గ్రిడ్‌కు రూపకల్పన చేస్తున్నాం. అంటే దగ్గర్లో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్లను డబుల్ సర్క్యూట్ ద్వారా అనుసంధానం చేస్తాం. దీనినే రింగ్ మెయిన్ అంటారు. దీనివల్ల ఒక సబ్ స్టేషన్ దెబ్బతింటే మరో సబ్ స్టేషన్ నుంచి సంబంధిత ప్రాంతాలకు వెంటనే విద్యుత్ అందించొచ్చు.

రైతులకు ఉచితంగా స్మార్ట్ మీటర్లు, రక్షణ పరికరాలు

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లతో పాటు రక్షణ పరికరాలు కూడా ఉచితంగా అందజేస్తాం. డిసెంబర్ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలనుకుంటున్నాం. ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది. రైతులు ఒక్క పైసా కూడా చెల్లించనవసరం లేదు. ఈ మీటర్లకు విదేశాల్లో స్థిరపడ్డవారు కొందరు మినహా మిగతా రైతులంతా రాతపూర్వకంగా అంగీకారం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూస్తున్నాం. గతంలో వ్యవసాయానికి రాత్రి వేళ విద్యుత్ సరఫరా వల్ల పొలాల్లో రైతులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడేవారు. దీనిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పగటి పూటే 9 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తోంది. పైగా, స్మార్ట్ మీటర్లు, రక్షణ పరికరాల ఏర్పాటు వల్ల రైతులకు ఎటువంటి ప్రమాదాలు జరగవు. ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు కొత్త వ్యవసాయ సర్వీసులను దరఖాస్తు చేసిన నెల లోపే ఇస్తున్నాం. ఇప్పటివరకు 80 వేల కొత్త సర్వీసులు ఇచ్చాం.

ప్రజల చేతిలో బిల్లు నియంత్రణ

విద్యుత్ బిల్లుల విషయంలో విద్యుత్ శాఖ పొరపాట్లు లేవు. విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతించిన టారిఫ్ ప్రకారమే చార్జీలు ఉన్నాయి. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడుతున్నారు. ఈ వేసవిలో గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రవ్యాప్తంగా రోజుకి 263 మిలియన్ యూనిట్లు సరఫరా చేశాం. ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే విద్యుత్ బిల్లు తగ్గించొచ్చు. కెపాసిటర్లు, బ్రేకర్లు నాణ్యమైనవి అమర్చుకోవాలి. ఇంటి లోపల, బయట వాడే బ్రేకర్లు వేర్వేరుగా ఉంటాయి. మాగ్నెటిక్ బ్రేకర్లు వేగంగా, ఖచ్చితత్వంతో పనిచేస్తాయి. ప్రీపెయిడ్ మీటర్లతో ఎవరికి వారు బిల్లును నియంత్రించుకోవచ్చు. అవసరాన్నిబట్టి రీచార్జ్ చేసుకోవచ్చు. వారం వారం విద్యుత్ వినియోగం తెలుసుకోవచ్చు. ముందుగా ప్రభుత్వ, హెచ్‌టీ సర్వీసులకు ప్రీపెయిడ్ మీటర్లు అందిస్తాం.

సరికొత్త సబ్‌స్టేషన్లు

విద్యుత్ సబ్ స్టేషన్లకు స్థలాలు దొరకడంలేదు. దీంతో కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కంటైనర్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే రెండింటిని అందుబాటులోకి తెచ్చాం. మరో రెండు విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని పెడుతున్న పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో, కనకదుర్గ గుడి దగ్గర ఏర్పాటు చేస్తున్నాం. వీటిని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (పీటీఆర్)లు ఒక్కటి కూడా పాడవకుండా, ఒక్క రోజు కూడా లోడ్ రిలీఫ్ ఇవ్వకుండా ఈ వేసవిని సమర్థంగా ఎదుర్కొన్నాం. 30 ఏళ్ల పైబడిన లైన్లు, కండక్టర్లు, బ్రేకర్లను మారుస్తున్నాం. దీనివల్ల సాంకేతిక నష్టాలు తగ్గుతాయి.

అనంత కరుణామయుడు (అల్లాహ్)!
ఆయనే ఖగోళాన్ని పైకెత్తి ఉంచాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 21 జూలై 2023

ఈసారైనా జనవాణి వింటారా?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడిగా, వేడిగా సాగుతాయని ఊహించినదే. అయితే మొదటి రోజే రానున్న నెల రోజులు ఎలా ఉండనున్నాయో అర్థమైపోయింది. అల్లరిమూకలు మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన పార్లమెంట్ ఉభయ సభలను తొలి రోజే కుదిపేసింది. పాలకులు సిగ్గుపడాల్సిన ఈ మణిపూర్ ఘటనపై పూర్తి స్థాయి చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభ, రాజ్యసభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. రెండున్నర నెలల పైగా మణిపూర్ అగ్నికీలల్లో దగ్ధమవుతున్నా మూగనోము వీడని పాలకులు సుప్రీమ్ కోర్ట్‌కో, ఓటర్లలో వెల్లువెత్తే నిరసనకో వెరచి ఎట్టకేలకు పార్లమెంట్ తొలి రోజున పెదవి విప్పారు. సభ సమావేశంలో ఉన్నా అక్కడ కాకుండా, మీడియా ఎదుట మాత్రం విచారం వ్యక్తం చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పగలిగారు. ప్రధాని సైతం సభలో మణిపూర్‌పై చర్చలో పాల్గొని జవాబివ్వాలని ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే, హోమ్ మంత్రి మాట్లాడతారని అధికారపక్షం ఆశ్వాసిస్తోంది. మొత్తానికి ఒక్క మణిపురే కాదు... ఢిల్లీలో ఎన్నికైన 'ఆప్' ప్రభుత్వాన్ని కాదని అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు దఖలు పరిచే ఆర్డినెన్స్, డేటా రక్షణ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) – ఇలా అనేక అంశాలు ఈ సమావేశాల్ని విమర్శల జడివానగా మార్చనున్నాయి.

ఆగస్ట్ 17 వరకు జరిగే వర్షాకాల సమావేశాల్లో అంతా సజావుగా సాగితే 17 రోజులు పార్లమెంట్ పని చేయాలి. ఈసారి శాసన నిర్మాణ అజెండాలో భాగంగా ఇప్పటికే పార్లమెంటరీ సంఘాలు పరిశీలించిన అటవీ, జీవావరణ వైవిధ్య చట్టసవరణ సహా 8 పెండింగ్ బిల్లులకు ఆమోదం పొందాలని ప్రభుత్వ ఆలోచన. అలాగే, వ్యక్తిగత డేటా భద్రత బిల్లు సహా కొత్తగా మరో 21 బిల్లులకు ఆమోదముద్ర వేయించాలనీ భావిస్తోంది. ముందుగా ప్రకటించిన వీటికి తోడు జాబితాలో లేనివాటినీ ప్రభుత్వం సభ ముందుకు తేవచ్చు. ముందుగా చెప్పకుండానే 2019 ఆగస్ట్ 5న రాజ్యసభలో జమ్ము–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును పాలకపక్షం ప్రవేశపెట్టిన అనుభవం ఉంది. కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయనగా పార్లమెంట్ కీలక చట్టాలు చేయడం కొంత కాలంగా జరుగుతున్నదే. 2019 ఎన్నికలకు ముందు 2018 వర్షాకాల సమావేశాల్లో ఆర్థిక నేరగాళ్ళ ఆస్తుల స్వాధీనం చట్టాన్నీ, 2014 ఎన్నికలకు ముందు 2013 వర్షాకాల సమావేశాల్లో జాతీయ ఆహార భద్రత చట్టాన్నీ నాటి పాలకపక్షాలు చేశాయి. ఈసారి అలాగే యూసీసీ ప్రస్తావనకు రావచ్చు.

వరదలు, అధిక ధరలు, రైళ్ళ భద్రత సహా అనేక అంశాలున్నాయి. కానీ, పరస్పరం పైచేయి కోసం ప్రయత్నిస్తున్న అధికార, ప్రతిపక్షాల మధ్య పార్లమెంట్‌లో ప్రజాసమస్యల ప్రస్తావన, వాటిపై సరైన చర్చ ఎంత వరకు ఉంటాయనే అనుమానం కలుగుతోంది. మహిళలపై అమానుష ఘటనలో 48 రోజుల తర్వాత కానీ మణిపుర్‌లో పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదంటే, సామూహిక అత్యాచార నిందితులు పాతికమందిలో ఒక్కరి అరెస్టుకే 77 రోజులు పట్టిందంటే ఏమనాలి? మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార పార్టీ ఎంపీ నిష్పూచీగా, నిర్లజ్జగా తిరుగుతుంటే ఏం చేయాలి? పాలకుల ఈ నిర్లిప్తతనూ, నిష్క్రియాపరత్వాన్నీ కచ్చితంగా నిలదీయాలి. మణిపుర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చేయాలంటూ ప్రభుత్వాన్ని వంచి, ఒప్పించాలి. కానీ, అందుకోసం షరా మామూలుగా సభ కార్యకలాపాల్ని అడ్డుకొంటే లాభం లేదు. వేర్వేరు మార్గాల ద్వారా సభలోనే పాలకవర్గాన్ని నిలదీసి, జవాబివ్వక తప్పనిస్థితిలోకి నెట్టవచ్చు. కార్యాచరణకు దిగేలా చూడవచ్చు. దీనికి ప్రతి పక్షాల మధ్య ఐక్యత, ఎప్పటికప్పుడు ముందస్తు వ్యూహరచన తప్పనిసరి. పరస్పర వైరుధ్యాల మధ్య కూడా అనివార్యతతో ఇటీవలే 'ఇండియా' పేరిట ఎన్నికల కూటమి కట్టిన 26 ప్రతిపక్షాల్లో అలాంటి సభా సమన్వయం ఏ మేరకు ఉంటుందో చూడాలి.

అర్థవంతమైన చర్చలకూ, ప్రజాసమస్యల పరిష్కారాలకూ వేదిక కావాల్సిన ప్రజాస్వామ్య దేవాలయం కొన్నేళ్ళుగా పలు దుస్సంప్రదాయాలకు మౌనసాక్షిగా మిగలాల్సి వస్తోంది. ప్రస్తుత లోక్‌సభ అయిదేళ్ళ కాలపరిమితి 2024 ప్రథమార్ధంలో ముగిసిపోనుంది. రాజ్యాంగ విహితమైన డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండానే ఇంతకాలంగా అధికారపక్షం చక్రం తిప్పుతోంది. ఇది మన పార్లమెంటరీ చరిత్రలోనే కనీవిని ఎరుగనిది. మరి ఈ సమావేశాల్లోనైనా ఉప సభాపతి ఎన్నికకు పాలకపార్టీ ఊ కొడుతుందా అంటే చెప్పలేం. సంఖ్యాబలం ఉందని అధికార పక్షం, ప్రభుత్వానికి ముందరి కాళ్ళకు బంధం వేయాలని ప్రతిపక్షాలు ప్రదర్శిస్తున్న మంకుపట్టు కారణంగా చర్చలు, సంప్రతింపులు అటకెక్కాయి. పెద్దగా చర్చలేమీ లేకుండానే అనేక బిల్లులు మూజువాణీ ఓటుతో చట్టాలైపోతున్న శోచనీయమైన పరిస్థితులు చూస్తున్నాం. వాకౌట్లు, సస్పెన్షన్లతోనే సమావేశాలు తూతూ మంత్రంగా నడిచి, మమ అనిపిస్తున్నాయి. ఇది దేశానికి మంచిది కాదు. ప్రజాస్వామ్యానికి తల్లి లాంటివాళ్ళమని జబ్బలు చరుచుకొనేవారు ఇకనైనా కళ్ళు తెరవాలి. అలాగే, పార్లమెంట్ సజావుగా సాగడం అధికార, ప్రతిపక్షాల సమష్టి బాధ్యత. నిమిషానికి రూ. 2.5 లక్షల వంతున వెచ్చిస్తున్న ప్రజాధనం వృథా కానివ్వరాదని ప్రజాప్రతినిధులు స్ఫురణలో ఉంచుకోవాలి. వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మరొక్కసారి శీతకాలంలో మాత్రమే పూర్తిస్థాయి పార్లమెంట్ సమావేశాలకు వీలుంటుంది. కాబట్టి, ఈసారైనా మన పార్లమెంట్ అంకగణితపు లెక్కల కన్నా అత్యవసర అంశాలపై కనీసపాటి చర్చకు వేదిక కావాలి. ప్రజాస్వామ్యానికి అదే అసలైన ధన్యత.

కొంచెం నెమ్మదిస్తేనే... నిలవగలం!

విశ్లేషణ



డా॥ శ్రీనాథ్ శ్రీధరన్

గడచిన శతాబ్దాల్లో మనిషి అనూహ్యమైన ప్రగతి సాధించాడు. బొగ్గు, వంటగ్యాస్, సహజ వాయువుల శక్తిని ఒడిసిపట్టి, ఇంధన విప్లవం సాధించడంతో సమాజం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టింది. ఆర్థిక అభివృద్ధి అనేది సామాజిక ఆకాంక్షలు పెరిగేందుకు దోహదపడింది. అదే సమయంలో మానవజాతి భవిష్యత్తు కూడలికి చేరింది. అభివృద్ధి వెంట పరుగులు పెట్టడాన్ని సమీక్షించుకోవాల్సిన సమయం వచ్చింది. మానవజాతి మరిన్ని కాలాలు మనుగడ సాగించాలంటే ఈ ఆలోచన, సమీక్ష అత్యవసరం. అభివృద్ధితో వచ్చిన ఆధునిక జీవనశైలి పర్యావరణాన్ని మాత్రమే ప్రభావితం చేయడం లేదు. మన మానసిక ఆరోగ్యాన్ని, వ్యక్తిగత సంక్షేమాన్ని... మొత్తమ్మీద మన జీవితపు నాణ్యతను దెబ్బతీస్తోంది.

ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కేన్స్ చెప్పినట్లు, మనిషి జీవన ప్రమాణం కొన్ని వేల ఏళ్లపాటు స్తబ్దుగానే ఉండింది. శిలాజ ఇంధనాల వాడకం మొదలుకావడం అంటే 18, 19వ శతాబ్దం నుంచే దీంట్లో పెను పురోగతి మొదలైంది. బొగ్గు, వంటగ్యాస్, ముడిచమురు అందుబాటులోకి రావడం మన జీవితాలను సమూలంగా మార్చేసిందనడంలో అతిశయోక్తి లేదు. దశాబ్దాల్లోనే సగటు ఆయుష్షు రెట్టింపు అయ్యింది. వేల కిలోమీటర్ల దూరాన్ని గంటల్లో దాటేయగలుగుతున్నాం. ప్రపంచం మూలమూలల్లోని వారితోనూ సమాచార వినిమయం చిటికెలో జరిగిపోతోంది. వృద్ధి చెందుతున్న టెక్నాలజీ, దాని విపరిణామాలూ ప్రపంచ రూపురేఖలను మార్చేశాయి అనడంలో సందేహం లేదు. కానీ ఈ అనూహ్య వేగానికి మనం మూల్యం కచ్చితంగా చెల్లిస్తున్నాం.

మరింత ఎక్కువ ఉత్పత్తి చేయాలి... అది కూడా సమర్థంగా జరగాలన్న ఆదుర్దా మనల్ని మనం సమీక్షించుకునే, విమర్శించుకునే... ప్రకృతితో మనకున్న సంబంధాన్ని మదింపు చేసుకునే సమయమూ ఇవ్వడంలేదు. పైగా... వలసలు, మనిషి చలనశీలతలకు ముడిపడి ఉన్న రాజకీయ సవాళ్లు కూడా కాలంతోపాటు సంక్లిష్టమవుతూ పోయాయి. ఇప్పుడు ప్రయాణమూ సులువే, పెద్ద ఎత్తున వలస వెళ్లిపోవడమూ సులభమే. వీటి ప్రభావం వనరులపై పడుతోంది. వలస వెళ్లిన ప్రాంతాల సంస్కృతులతో ఘర్షణలకు కారణమవుతున్నాయి. సామాజిక సమన్వయమూ దెబ్బతింటోంది. సరిహద్దులు పలుచనైపోయి ప్రపంచం కుంచించుకుపోతున్న కొద్దీ పరిస్థితులు మరింత ముదురుతున్నాయి. అందుకే ఒక క్షణం ఆగి ఈ సవాళ్లను దీర్ఘాలోచనలతో, సమతుల దృష్టితో పరిష్కరించాల్సి ఉంటుంది.

సుస్థిరత–అభివృద్ధి

మనిషి శతాబ్దాలుగా ఇంధన వినియోగమనే వ్యసనానికి బానిస. శిలాజ ఇంధనాలు మనల్ని ముందుకు పోయేలా చేసినా ప్రపంచాన్ని వాతావరణ మార్పుల అంచున నిలబెట్టింది కూడా ఇవే. సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో పర్యావరణ అనుకూల టెక్నాలజీలకు పెద్దపీట వేయాల్సిన సమయం ఇదే. అయితే ఈ మార్పు జరగాలంటే గనుల తవ్వకాలు, నిర్మాణాల అవసరం చాలా ఎక్కువగా ఉంటుందన్నది విమర్శకుల ఆలోచన. పర్యావరణ అనుకూల టెక్నాలజీల కోసం అవసరమైన రాగి, నికెల్, కోబాల్ట్, ఇతర ఖనిజాలు మన అవసరాలకు తగినన్ని ఉన్నాయా? అని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యల్లో కొంత నిజం లేకపోలేదు. కానీ.. మనిషి తన సృజనాత్మకతతో వీటిని అధిగమించడం పెద్ద కష్టమూ కాదు. భూమిలో ఈ అత్యవసరమైన లోహాలు తగినన్ని ఉన్నాయని ఇటీవలి అధ్యయనాలు స్పష్టం చేసిన విషయాన్ని ఇక్కడ చెప్పుకోవాలి. కాకపోతే వీటి శుద్ధీకరణ పద్ధతులు మాత్రం సమస్యాత్మకమైనవి. వీటిని అధిగమించడమూ కష్టమేమీ కాదు. డిమాండుకు తగ్గట్టు సరఫరాలను పెంచగలిగే పెట్టుబడిదారీ వ్యవస్థను దృష్టిలో పెట్టుకుంటే ఈ సవాళ్లను ఎదుర్కోవడం కష్టమేమీ కాకపోవచ్చు. ఈ క్రమంలో పర్యావరణ, సామాజిక సమస్యలను విస్మరించడం సరికాదు. 'రేర్ ఎర్త్‌మెటల్స్' ఉత్పత్తిలో, గ్రీన్ టెక్నాలజీల్లో ముందువరసలో ఉన్న చైనాలో పర్యావరణ పరిస్థితి దిగజారిపోవడం, కాలుష్యం, కొన్ని వర్గాల సామాజిక బహిష్కరణ, ఆరోగ్య అంశాలు మనకు హెచ్చరికలుగా నిలవాలి.



ఇంకో కీలకమైన విషయం... పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటే మన ఆలోచనా ధోరణుల్లోనూ మార్పులు రావాలి. సుస్థిరత అనేది అభివృద్ధికి అడ్డంకి కాదనీ, మెరుగైన భవిష్యత్తుకు మార్గమనీ గుర్తించాలి. పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధులకు పొంతన కుదరదన్న ద్వైదీభావం సరికాదని తెలుసుకోవాలి. నిజానికి పర్యావరణ అనుకూల విధానాలు ఆర్థిక వృద్ధిని పెంచుతాయనీ, నూతన ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందనీ అర్థం చేసుకోవడం ముఖ్యం. పునరుత్పాదక ఇంధన వనరులపైనే ఆధారపడి పనిచేసే కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఇదో మేలి అవకాశం.

జీవన విధానంలో నిదానం

పర్యావరణ అనుకూల టెక్నాలజీలకు కాస్త నెమ్మదైన జీవన విధానమూ తోడైతే శిలాజ ఇంధనాల దుష్పరిణామాలను తగ్గించడం వీలవుతుంది. ప్రపంచంపై, సమాజంపై సరైన అవగాహన కలిగి ఉంటూ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి ఫలాలను అనుభవించడం అవసరం. అభివృద్ధి సాధించే ప్రయాసలో మన చర్యల పర్యవసానాలను గుర్తించి తదనుగుణంగా మనల్ని మనం మార్చుకోవడం కూడా అవసరం. ఆధునిక జీవితంపై మోజు తాత్కాలికంగా కొన్ని ప్రయోజనాలు కల్పించవచ్చునేమోగానీ... దీర్ఘకాలంలో భూమ్మీద మనిషి మనుగడ ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదముంది.

అభివృద్ధిని సాధించాలన్న వ్యామోహంలో ప్రస్తుతం 800 కోట్లు దాటిన మానవ జనాభాకు ఆహారం అందివ్వడం ఎలా అన్నది మరవకూడదు. మానవ మనుగడ కోసం మన వేగాన్ని తగ్గించుకోవాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ, అందరికీ ఆహార కల్పన అన్న అంశాల మధ్య సమతౌల్యత సాధించాలి. ప్రస్తుతం ఆహారాన్ని పండించడం అనేది ఒక పరిశ్రమలా సాగుతోంది. అయితే ఇందుకు పర్యావరణం మూల్యం చెల్లిస్తోంది. విచ్చలవిడి రసాయన ఎరువుల వాడకం, అడవుల నరికివేతవంటివన్నీ పర్యావరణ వ్యవస్థలు, జీవవైవిధ్యతలు, భూమి సారాల విషయంలో చెడు ప్రభావం చూపాయి. సుస్థిరాభివృద్ధి కావాలంటే ఇదే పద్ధతిని కొనసాగించడం మంచిది కాదు.

నిదానమే ప్రధానము

అందరికీ ఆహారమన్న సవాలును ఎదుర్కొనేందుకు బహుముఖ వ్యూహం అవసరం. ఆయా దేశాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గాలను వెతకాల్సి ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం కల్పిస్తూ... వ్యవసాయ రంగంలో పరిశోధనలకు పెద్దపీట వేయాలి. వనరులు అందరికీ అందుబాటులో ఉండేలా అవకాశాలను కల్పించాలి. కాకపోతే ఇదో సంక్లిష్టమైన సవాలే. ఎన్నో సౌకర్యాలు కల్పించిన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలోనూ కొంచెం జాగరూకతతో వ్యవహరించాలి.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్లు భవిష్యత్తులో ఉద్యోగాలను తగ్గిస్తాయన్న ఆందోళన కూడా ఒకవైపు ఏర్పడుతోంది. ఈ విషయంలోనూ ఆచితూచి వ్యవహరించాలి. విద్యపై పెట్టే పెట్టుబడులు పెరగాలి. అదే సమయంలో కొత్త టెక్నాలజీల గురించి అందరికీ శిక్షణ ఇచ్చేందుకూ ఏర్పాట్లు కావాలి. విధానాల ద్వారా సామాజిక అసమతుల్యతలను రూపుమాపే ప్రయత్నం జరగాలి. విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆధునిక జీవనశైలి పర్యావరణాన్ని మాత్రమే ప్రభావితం చేయడం లేదు. మన మానసిక ఆరోగ్యాన్ని, వ్యక్తిగత సంక్షేమాన్ని... మొత్తమ్మీద మన జీవితపు నాణ్యతను దెబ్బతీస్తోంది. ఈ ఉరుకుల జీవితాన్ని కాస్త మందగింపజేస్తే ఆత్మవిమర్శకు అవకాశం ఏర్పడుతుంది. మానసిక, భావోద్వేగ సంక్షేమాలను మన ప్రాథమ్యాలుగా ఉంచుకుని పనిచేసేందుకు పనికొస్తుంది. ఆందోళన సంబంధిత ఆరోగ్య సమస్యలు తగ్గించేందుకు వీలేర్పడుతుంది. ప్రాపంచిక సౌఖ్యాల వెంబడి పరుగులో సామాజిక బంధాలను దాదాపుగా విస్మరించాం. బంధుత్వాలు, సహానుభూతి, మానవ సంబంధాలను మరోసారి ఆచరించేందుకు, కొనసాగించేందుకు అవకాశం కల్పిస్తుంది.

వ్యాసకర్త కార్పొరేట్ సలహాదారు, 'టైమ్ ఫర్ భారత్' రచయిత
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇంత ఘోరమా?



మణిపుర్‌లో మహిళల పట్ల జరిగింది అత్యంత అసహ్యకరమైనది. ఇంకా దిగ్భ్రాంతికరమైనది, ఈ 2023లో కూడా పూర్తి వార్త ఘటన జరిగిన రెండున్నర నెలల తర్వాత తెలియడం! వార్తలు కవర్ చేయడానికి మీడియా భూమ్మీద ఎక్కడికైనా వెళ్తుంది, ఈశాన్య భారతానికి తప్ప!

– సాగర్, రచయిత

మనుషులు కాదా?



నిజం చెప్పాలంటే, ఇంకొకరి మీద ఆధిపత్యం సాధించడానికి మహిళలను ఉపకరణాలుగా వాడటం ఇంకా కొనసాగుతూనే ఉంది. అది కశ్మీర్‌లో చూశాను, రాజస్థాన్, బెంగాల్‌లలో చూశాను. ఇప్పుడు మణిపుర్. ఇది ఎప్పుడు ఆగుతుంది?

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

ఒకటే పరిష్కారం



ఏకైక ఆచరణీయ చర్య: మణిపుర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలి, రాష్ట్రపతి పాలన విధించాలి, కనబడితే కాల్చివేత ఆదేశాలతో ఇంఫాల్‌కు సైన్యాన్ని పంపాలి.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి


వ్యతిరేక ఫలితం



కృత్రిమ మేధ(ఏఐ)కు వ్యతిరేకంగా చేస్తున్న హాలీవుడ్ సమ్మె, ఆ కృత్రిమ మేధను హాలీవుడ్‌లో మరింత వేగంగా వాడేలా చేస్తుంది. చరిత్రలో ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఎప్పుడూ ఆపలేకపోయారు. కృత్రిమ మేధతో పోరాడే ఏకైక మార్గం... నిరోధించకుండా దాన్ని వాడటమే!

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

అరుదైన నటుడు




యాభై ఏళ్ల క్రితం ఈ రోజున (జూలై 20) చనిపోయిన బ్రూస్ లీని తలుచుకుంటున్నాను. అప్పుడాయనకు కేవలం 32 ఏళ్లు. చిట్టచివరి విశ్రాంత స్థలానికి ఆయన శవపేటికను మోసుకెళ్లిన వాళ్లలో (హాలీవుడ్ దిగ్గజ నటులు) స్టీవ్ మెక్‌క్వీన్, జేమ్ కోబమ్ లాంటి వాళ్లున్నారు.

– మైకేల్ వార్‌బర్టన్, నటుడు

మానవత్వం మంటగలుస్తోంది...

సందర్భం



ఎమ్.డి. మునీర్

కేంద్రం మీద దేశం కోపంగా ఉంది. 79 రోజులుగా మణిపుర్ మండి పోతున్న నేపథ్యంలో మే 3 నుంచి వరుసగా హింసాత్మక ఘటనలు జరుగుతున్నప్పటికీ పీఎం నరేంద్ర మోదీ నోరు తెరవలేదు, కనీసం శాంతి సందేశం కూడా ఇవ్వలేదు. అటు కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికలు జరగాల్సి ఉన్న రాష్ట్రాల్లో పర్యటించారు. అమెరికా, ఫ్రాన్స్ వెళ్లి వచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్యం ఉన్న పార్టీ నేతల మీటింగ్‌లలో పాల్గొన్నారు. అయినా ఎక్కడా మణిపుర్ ముచ్చట ఎత్తలేదు. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ మణిపుర్ వెళ్లి బాధితులను పరామర్శించి వచ్చారు. వారి సమస్యలు విన్నారు.

ఈ నేపథ్యంలో మే నెలలో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన సంఘటన జరిగిందని తెలిపే వీడియో ఇప్పుడు బయటకు వచ్చింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం, వారిపై అత్యాచారం చేసినట్లు ఈ వీడియో చెబుతోంది. ఇదంతా జరిగే సమయంలో పోలీస్‌లు అక్కడ ఉన్నట్లు కూడా కనిపిస్తున్నది. ఈ సంఘటనను సుప్రీం కోర్ట్ సుమోటోగా స్వీకరించింది. వచ్చే శుక్రవారం లోపు కేంద్ర, మణిపుర్ ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలనీ, అలా తీసుకోని పక్షంలో తానే రంగంలోకి దిగవలసి వస్తుందనీ తీవ్రంగా హెచ్చరించింది. పీఎం నరేంద్ర మోదీ మొదటిసారి మణిపుర్ పరిస్థితులపై ఈ సంఘటనను ఖండిస్తూ చివరకు నోరు విప్పారు. 79 రోజుల తర్వాత మణిపుర్ గురించిన ఈ ఒక్క సంఘటన మీద మాట్లాడుతూ నిందితుల మీద చర్యలు ఉంటాయి అన్నారు. తాను ఆ వీడియో చూసి తీవ్ర ఆక్రోశానికీ, ఆందోళనకూ గురి అయ్యానని పేర్కొంటూనే, మణిపుర్ అయినా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అయినా... ఎక్కడ అయినా మహిళల మీద అకృత్యాలను సహించేది లేదని పేర్కొన్నారు. ఇంతే మాట్లాడారు. అసలు మణిపుర్‌లో చోటు చేసుకున్న సంఘటనల పరంపర మీద మాట్లాడలేదు. సుప్రీం కోర్ట్ భయంతో ఆమాత్రం పీఎం మాట్లాడినట్లు కనిపించింది. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ 'మహిళా కుస్తీ' బిడ్డలపై పాల్పడిన లైంగిక వేధింపుల పైనా ఏమీ మాట్లాడలేదనేదీ గమనార్హమే. రాజ్యసభలో విపక్షాలు మణిపుర్ విషయంగా ప్రభుత్వాన్ని తూర్పారబట్టాయి. పీఎం మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ఇతర విపక్షాలు పార్లమెంట్ బయట ఆందోళనకు దిగాయి.



ఇద్దరు మహిళలపై జరిగిన అవమానకర లైంగిక దాడికి సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీస్‌లు పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ జారీ అయ్యిందన్నారు. రెండు నెలలుగా మణిపుర్‌లో ఇంటర్నెట్ బంద్ ఉన్న కారణంగా ఈ సంఘటన బయటకు రావడానికి ఇంతకాలం పట్టింది. ఇన్ని రోజుల నుంచి మణిపుర్ మండి పోతుంటే శాంతి, భద్రతల కోసం కేంద్రం కానీ, రాష్ట్రం కానీ పక్కాగా ఏమీ చేయలేకపోయాయి.

'బేటీ బచావో, బేటీ బడావో, బేటీ పడావో' అంటూ మాట్లాడే బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో ఆదివాసీ ఆడపడుచులపై ఇటువంటి అకృత్యాలు ఎలా జరుగుతున్నాయి? ప్రధాని మోదీ అన్ని పార్టీల ప్రతినిధి వర్గాన్ని వెంట తీసుకొని ఇప్పటికైనా మణిపుర్ వెళ్లాలి. ఓట్ల కోసం కుల, మతాలకు అతీతంగా జీవిస్తున్న ప్రజలను విడదీయడం, వారి మధ్య వైరుధ్యాలు సృష్టించడం సరికాదు. ప్రపంచం అంతా ఇటువైపే చూస్తున్నదనే సంగతిని గమనంలో ఉంచుకోవాలి. ఇప్పటికే మణిపుర్‌లోని పరిస్థితులపై యూరోప్‌లో చర్చ జరుగుతోంది.

విద్వేష రాజకీయాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయో ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం గుర్తించాలి. దేశంలో ఇప్పుడు అత్యంత క్లిష్టమైన సమస్య మణిపుర్‌లో పరిస్థితులను చక్కదిద్దడమే. ఆ దిశగా వెంటనే ప్రధాని దృష్టి సారించాలి. కులాలు, మతాలు, జాతుల మధ్య విద్వేషాలు రేగితే ఎంతటి విపరిణామాలు సంభవిస్తాయో చెప్పడానికి ప్రస్తుత మణిపుర్ పరిస్థితి ఒక ఉదాహరణ. ముందు ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించి అక్కడి ప్రజలకు భరోసా కలిగించాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
మొబైల్: 99518 65223

సంక్షేమ పథంలో సాహసోపేత అడుగులు

సందర్భం



డా॥ మేరుగు నాగార్జున

ముఖ్యమంత్రి జగన్ ఇప్పటి వరకూ తీసుకున్న నిర్ణయాలన్నీ ఒక ఎత్తు, దళితుల భూముల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం మరోఎత్తు. ఒకవైపు పేదలకు కొత్తగా ప్రభుత్వ భూముల్ని అసైన్ చేస్తూ, మరోవైపు అందని ద్రాక్షలా ఉన్న భూములపై దళితులకు పూర్తి స్థాయి యాజమాన్య హక్కులను కల్పిస్తున్నారు. పేదలకు పోటే లేదన్న అమరావతి రాజధాని భూముల్లో నిరుపేదలకు ఇళ్లను నిర్మిస్తూ జగన్ తీసుకున్న నిర్ణయాలు చరిత్రాత్మకం.

మహానేత డా॥ వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు భూమిలేని నిరుపేదలకు భూములను ఇచ్చారు. ఆ తర్వాత ఇంతకాలానికి మళ్లీ ఆయన తనయుడు సీఎం జగన్ పేదలకు భూ పంపిణీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,935 మంది భూమిలేని నిరుపేదలకు 54,129.45 ఎకరాలను అసైన్ చేయాలని జగన్ ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. అలాగే 3 కేటగిరీల్లో 9,062 ఎకరాల లంక భూముల విషయంలోనూ రైతులకు అనుకూలంగా అసైన్‌మెంట్ పట్టాలు, 5 ఏళ్ల లీజు ఇవ్వడానికి తీసుకున్న నిర్ణయానికి కూడా కేబినెట్‌లో ఆమోద ముద్ర వేశారు.

'ల్యాండ్ పర్చేజ్' స్కీమ్ కింద దళిత రైతులకు కొని ఇచ్చిన భూములపై వారికి పూర్తి స్థాయి యాజమాన్యపు హక్కులు కల్పించాలన్న చరిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకోవడంతో దాదాపు రూ. 2 వేల కోట్ల విలువైన భూములపై దళిత రైతులకు పూర్తి హక్కులు లభించనున్నాయి. 14,223 మంది దళిత రైతులు గతంలో వారు పొందిన భూములకు సంబంధించి వారు కట్టాల్సిన రుణాలను కూడా మాఫీ చేశారు. అలాగే దళిత రైతులకు వారి భూములపై యాజమాన్య హక్కులను కల్పించడానికి అవసరమైన రిజిస్ట్రేషన్ ఛార్జీలు కూడా మాఫీ చేస్తూ, ప్రభుత్వమే ఖర్చులు భరించి వారి భూములు రిజిష్టర్ చేసి ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన హక్కు పత్రాల పంపిణీకి ఆగస్టు మొదటి వారంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములు అసైన్ చేసిన పేద రైతుల పరిస్థితి కూడా ల్యాండ్ పర్చేజ్ స్కీమ్‌లో భూములు పొందిన పేద దళిత రైతుల్లాగే ఉంది. తాము తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు 'డీకేటీ' పట్టాలు పొందిన రైతులకు కూడా వాటిపై పూర్తి హక్కులు ఉండవు. ఈ భూమలన్నీ నిషేధిత జాబితాలో ఉన్న కారణంగా ఇవి రిజిష్టర్ అయ్యే అవకాశం లేదు. ఈ నేపథ్యంలోనే అసైన్డ్ భూములపై కూడా పేద రైతులకు పూర్తి స్థాయి యాజమాన్యపు హక్కులు కల్పించి ఇతర రైతుల తరహాలోనే వారు కూడా తమ భూములను అవసరమైనప్పుడు క్రయ, విక్రయాలు చేసుకోవడానికి వీలుగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద సాహసోపేతమైన నిర్ణయం. ఆయా భూములను అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత పూర్తి హక్కులు అనుభవించేలా ఆమోదముద్ర వేశారు.



ఇది మాత్రమే కాదు, గ్రామాల్లోని కుల వృత్తులు చేసుకునేవారికి ఇచ్చిన ఇనాం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కూడా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. దీంతో రజక, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ వంటి ఇతర కులవృత్తులకు సంబంధించిన వారి భూముల విలువలు పెరగనున్నాయి. వారి కష్టాలు శాశ్వతంగా తీరిపోనున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత వాడలలో చాలా వాటికి ఇప్పటి వరకూ శ్మశానాలు లేని కారణంగా దళితులు మరణించినప్పుడు వారికి అంత్యక్రియలు చేయడం కూడా ఇబ్బంది కరంగా ఉండేది. వారి కష్టాన్ని గుర్తించి గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికల కోసం భూములు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ విధంగా ఎస్సీల శ్మశాన వాటికల కోసం ప్రత్యేకంగా ఒకేసారి భూములను కేటాయించడం ఇదే తొలిసారి. ఒక గ్రామానికి ఒక ఎకరా వరకూ శ్మశానం కోసం ఇవ్వనున్న ప్రభుత్వం ఈ భూమి కేటాయింపు అధికారం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. రాష్ట్రంలోని 1,966 రెవిన్యూ గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికలు లేవని సర్వే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

రాజధాని ప్రాంతమైన అమరావతి కేవలం ఒక సామాజిక వర్గానికే చెందిన ధనిక రాజధాని ప్రాంతంగా మిగిలిపోకూడదని సీఎం జగన్ భావించారు. ఈ కారణంగానే అత్యంత ఖరీదైన రాజధాని భూముల్లోనూ పేదలకు భాగస్వామ్యం ఉండాలని వారికి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలను ఇచ్చారు. అత్యంత నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారితో పాటుగా అగ్రకులాల్లోనూ ఆర్థికంగా వెనుకబడిన పేదలకు పట్టాలు ఇవ్వాలని సీఎం సంకల్పించినప్పుడు ప్రతిపక్షాలవారు రాజధాని రైతులతో సుప్రీం కోర్టులోనూ కేసులు వేయించారు. వీటినేమీ పట్టించుకోకుండా ఏపీ ఆర్–5 జోన్‌లో 50 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 24న సీఆర్డీఏ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం అవ్వబోతున్నాయి. ఈ పనులను ప్రారంభిస్తూ సీఎం స్వయంగా శంకుస్థాపన కూడా చేయనున్నారు.

సీఎం జగన్ చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకం కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రకులాల్లోని పేద వర్గాల కోసమేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ కారణంగానే రాష్ట్రంలోని పేద వర్గాలకు చెందిన వారందరూ కుల, మతాలకు అతీతంగా మరోసారి జగనన్నకు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారు.

వ్యాసకర్త ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.చవితి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** మఖ ప.12.13 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.9.05 నుండి 10.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ఉ.12.32 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.350 నుండి 11.21 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.33.

'డిప్'లో సేవా టికెట్లు పొందినవారికి 'పే లింక్'

తిరుమలలో కౌంటర్ వద్దకు వెళ్లకుండానే సొమ్మును చెల్లించి టికెట్లను పొందే వెసులుబాటు

తిరుమల: తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనం పొందిన భక్తులకు టికెట్లు పొందే ప్రక్రియను సులభతరం చేసేందుకు టీటీడీ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. 'పే లింక్' ఎస్‌ఎంఎస్ ద్వారా భక్తులు కౌంటర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో సొమ్ము చెల్లించి సేవా టికెట్లను ప్రింట్ తీసుకునే వెసులుబాటును కల్పించింది. సీఆర్‌వోలో లక్కీడిప్ ద్వారా ఆర్జిత సేవా టికెట్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఈ విధానంలో టికెట్లు పొందిన వారు కౌంటర్‌లో సొమ్ము చెల్లించి టికెట్లు పొందుతున్నారు. కొత్త విధానాన్ని అనుసరించి ఎస్‌ఎంఎస్ ద్వారా భక్తులకు పే లింక్‌ను టీటీడీ పంపుతోంది. భక్తులు ఆ లింక్ పైన క్లిక్ చేసి యూపీఐ లేదా క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో సొమ్ము చెల్లించి టికెట్లను ప్రింట్ తీసుకోవచ్చు. ఈ విధానాన్ని సీఆర్వోలోని లక్కీడిప్ కౌంటర్ల వద్ద ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. త్వరలో ఎంబీసీ–34 కౌంటర్ వద్ద విచక్షణ కోటాలో కేటాయించే ఆర్జిత సేవా టికెట్లు, బ్రేక్ దర్శన టికెట్లకూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

నిప్పుకు ఇక చెక్

అగ్నిమాపక శాఖకు డ్రోన్లు.. రోబోలు

- అగ్నిమాపక వ్యవస్థ ఆధునికీకరణకు రూ.295 కోట్లతో ప్రణాళిక
- 16 రకాల అధునాతన పరికరాల కొనుగోలుకు నిర్ణయం

సాక్షి, అమరావతి: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఆకాశం నుంచి ఎగురుకుంటూ డ్రోన్లు వచ్చేస్తాయ్. మంటలు చెలరేగిన భవనాల్లోకి చకచకా వెళ్లి మంటల్ని అదుపుచేసే రోబోలు సైతం రాబోతున్నాయ్. త్వరలో రాష్ట్ర అగ్నిమాపక శాఖ అధునాతన సాధనా సంపత్తిని సంతరించుకోనుంది. అగ్ని ప్రమాదాలకు తక్షణం చెక్ పెట్టే లక్ష్యంతో రాష్ట్ర అగ్నిమాపక వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కార్యాచరణకు ఉపక్రమిస్తోంది. అందుకోసం రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక వ్యవస్థలకు ఆధునిక పరికరాలను సమకూర్చేందుకు ప్రణాళికను ఆమోదించింది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులు రూ.295 కోట్లతో కార్యాచరణ చేపట్టింది.

ఇరుకైన ప్రదేశాలు.. ఎత్తైన భవనాల్లోకీ వెళ్లేలా..

రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న కొద్దీ నగరాలు, పట్టణాల జనాభా అధికంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా నగర, పట్టణ ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. పెద్దపెద్ద ఆకాశ హర్మ్యాలు, పలు కంపెనీలు నిర్మాణం సర్వసాధారణంగా మారింది. అటువంటి ఎత్తైన భవనాలు, కంపెనీల కార్యాలయాలతోపాటు నగరాలు, పట్టణాల్లో ఇరుకైన ప్రదేశాల్లో పొరపాటున అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలను అదుపు చేయడం సవాల్‌గా మారింది. ఫైర్ ఇంజిన్లు, ఇతర అగ్నిమాపక వాహనాలు, పరికరాలను ప్రమాదం సంభవించిన ప్రదేశానికి తీసుకువెళ్లి మంటలను అదుపు చేయడం అంత సులభం కాదు. అటువంటి పరిస్థితుల్లో కూడా కనిష్ట సమయంలో మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక శాఖను ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి మొత్తం రూ.295 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇందులో 50 శాతం నిధులతో ఆధునిక అగ్నిమాపక పరికరాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వాటిలో అగ్నిమాపక డ్రోన్లు, రోబోలతోపాటు ఎత్తైన భవనాల్లో చెలరేగే మంటలను అదుపు చేసేందుకు ఉపయోగించే హైడ్రాలిక్ ప్లాట్‌ఫారాలతోపాటు 16 రకాల ఆధునిక పరికరాలు ఉండటం విశేషం. మరో 30 శాతం నిధులతో కొత్త అగ్నిమాపక కేంద్రాల నిర్మాణం, 20 శాతం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలుగా గుర్తించి వాటిని వినియోగించనుంది.



కొనుగోలు చేయనున్న పరికరాలు

- అగ్ని మాపక డ్రోన్లు, అగ్నిమాపక రోబోలు
- హైడ్రాలిక్ ప్లాట్‌ఫారాలు, టర్న్ టేబుల్ ల్యాడర్లు
- ఇరుకు ప్రదేశాల్లోకి వెళ్లగలిగే అగ్నిమాపక మోటారు సైకిళ్లతో కూడిన మిస్ట్ ఫైటింగ్ యూనిట్లు
- హజ్‌మత్ వ్యాన్లు, అత్యవసర వైద్య సహాయం అందించే మెడికల్ కంటైనర్లు
- లైట్ రెస్క్యూ టెండర్లు, మినీ వాటర్ టెండర్లు
- క్విక్ రెస్పాన్స్ మల్టీ పర్పస్ వాహనాలు, రెస్క్యూ బోట్లు
- వాటర్ బ్రౌజర్లు, హై ప్రెజర్ పంపులతో కూడిన రెస్క్యూ వాహనాలు
- ఫైర్ ఫైటింగ్ ఫిటింగ్స్, సిబ్బందికి రక్షణ కల్పించే పరికరాలు

మూడు రోజులు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతం, ఒడిశా తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడి.. ఒడిశా సరిహద్దు తీర ప్రాంతాల్లో విస్తరించింది. అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కి.మీ. ఎత్తులో విస్తరించింది. మరోవైపు రుతుపవన ద్రోణి ప్రస్తుతం ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 23న అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి.

ముక్కంటి సేవలో క్రికెటర్ జితేష్ శర్మ



ఆలయ ధ్వజస్తంభం వద్ద యువ క్రికెటర్ జితేష్‌శర్మ

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని గురువారం భారత యువ క్రికెటర్ జితేష్‌శర్మ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనమిచ్చారు. అధికారులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ఎఫ్‌సీఆర్-15 (సీటీఆర్ఐ శ్రేష్ఠ)



ఎఫ్‌సీజే-11 (సీటీఆర్ఐ నవీన)



వైటీ-22 (విజేత)

3 కొత్త పొగాకు వంగడాల విడుదల

శ్రేష్ఠ, నవీన, విజేత పేరుతో లభ్యం • సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ వెల్లడి

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–సీటీఆర్ఐ) ద్వారా దక్షిణ, ఉత్తర ప్రాంత తేలిక నేలలు, బర్లీ ప్రాంతాలకు అనువైన 3 అధిక దిగుబడులను ఇచ్చే పొగాకు వంగడాలు విడుదలయ్యాయి. ఈ విషయాన్ని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీటీఆర్ఐ డైరెక్టర్ డా.మాగంటి శేషుమాధవ్ గురువారం తెలిపారు. ఎఫ్‌సీఆర్–15 (సీటీఆర్ఐ శ్రేష్ఠ) వంగడం దక్షిణ తేలిక నేలలకు అనువైనదన్నారు. ఇది అధిక దిగుబడిని (హెక్టార్‌కు 3,000 కిలోలు) ఇస్తుందన్నారు. ఇది శీతాఫల తెగులు తట్టుకునే బ్యారన్ పొగాకు రకమన్నారు. ఎఫ్‌సీజే–11 (సీటీఆర్ఐ నవీన) వంగడం ఉత్తర తేలిక నేలలకు అనువైనదన్నారు. ఇది కూడా ఎక్కువ దిగుబడినిచ్చే (హెక్టార్‌కు 3,300 కిలోలు) వంగడమని పేర్కొన్నారు. తక్కువ నత్రజనితో సాగు సామర్థ్యం కలిగిన బ్యారన్ పొగాకు రకమన్నారు. వైటీ–22 (విజేత) వంగడం అధిక దిగుబడినిచ్చే (హెక్టార్‌కు 2,900 కిలోలు), శీతాఫల తెగులు తట్టుకునే బర్లీ పొగాకు రకమన్నారు. ఈ 3 వంగడాలను స్టేట్ వెరైటీ రిలీజ్ కమిటీ (ఎస్‌వీఆర్‌సీ) విడుదల చేసిందన్నారు. ఈ వంగడాల విత్తనాలు ప్రస్తుత సీజన్‌లో సీటీఆర్ఐలో లభ్యమవుతున్నాయని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు-నేడు

రూ.500 కోట్లతో సమగ్ర అభివృద్ధి పనులు



గుంటూరు జిల్లా వెనిగండ్ల గ్రామంలోని మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌లో సదుపాయాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు అమలు చేస్తున్న 'మనబడి నాడు–నేడు' పథకాన్ని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు విస్తరించింది. సుమారు రూ.500 కోట్లతో ఆయా కేంద్రాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన విద్య, క్రీడా పరికరాలను అందజేయనుంది. ప్రధాన మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, భవనాలకు రంగులు, కిచెన్ షెడ్లు, ఫర్నిచర్, పిల్లలకు ఆటవస్తువులను అందుబాటులోకి తీసుకొస్తారు. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల్లో 50,600 కేంద్రాలను నాడు–నేడులోకి తీసుకున్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఉన్నవాటిలో 600 కేంద్రాల్లో ఇప్పటికే నాడు–నేడు పనులు పూర్తిచేశారు. మరో 1,778 కేంద్రాల్లో సదుపాయాలు కల్పించారు. కొత్తగా 1,625 భవనాలను నిర్మించనున్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని దేశంలో అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. అందులో భాగంగా విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.


లాభాల వలవేసి.. డబ్బు లాగేసి..

- 'కెనడియన్ సోలార్' పేరిట మోసం
- ప్లేస్టోర్‌లో పుట్టుకొచ్చిన ఆన్‌లైన్ కంపెనీ
- వాట్సాప్ వేదికగా విస్తరణ
- ఖాతాదారులను నమ్మిస్తూ సరికొత్త స్కీమ్‌లు
- లింకు రెఫర్ చేస్తే బోనస్‌ల వల
- ఐదు నెలల్లోనే ముగిసిన బాగోతం

కర్నూలు: ముచ్చటైన ఆఫర్లు.. కళ్లెదుటే లాభాలు.. చుట్టుపక్కల వాళ్లను జతచేస్తే బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు. అకౌంట్‌లోకి తేరగా వచ్చి పడుతున్న డబ్బును చూసి అందరికీ ఆశ కలిగింది. ఒకరిని చూసి మరొకరుగా చేరుతుండటంతో కొత్త స్కీమ్‌లు తెరపైకి వచ్చాయి. రూ.100 కడితే రూ.2 వేల ఆదాయం వస్తుండటంతో కంపెనీకి విస్తృత ప్రచారం లభించింది. కొత్త అకౌంట్ల సంఖ్య పెరగడంతోపాటు వ్యాపారం రూ.కోట్లకు చేరింది. అంతా సజావుగా సాగుతున్నట్టు అనిపించినా ఒకానొక రాత్రి ఆ కంపెనీ చీకట్లో కలిసిపోయింది. లబోదిబోమంటున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

ప్లేస్టోర్‌లో పుట్టుకొచ్చి..

ప్లేస్టోర్ వేదికగా పుట్టుకొచ్చిన కెనడియన్ సోలార్ కంపెనీ ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి ఆన్‌లైన్ కార్యకలాపాలను ప్రారంభించింది. ఐదు నెలల కాలంలో అందమైన ఆఫర్లతో వేలాది మందిని బుట్టలో వేసుకుంది. కాఫీ తాగుతున్న విదేశీ యువతి ఫొటోను డీపీగా పెట్టుకుని 97904 01505, 44 7467 135 221 నంబర్లతో వాట్సాప్ చాటింగ్ ద్వారా ఖాతాదారులకు కంపెనీ దగ్గరైంది. స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లతో ఒకరి తర్వాత ఒకరు లాభాలకు ఆకర్షితులయ్యారు. మొదట్లో డబ్బు చెల్లించడమే తరువాయి.. వెంటవెంటనే డబ్బు వస్తుండటంతో నమ్మకంతో పాటు ఖాతాదారుల సంఖ్య కూడా పెరిగిపోయింది.



వాట్సాప్ చాటింగ్ జరిపిన ఐడీ



సర్వర్ కాలిపోయిందని తిరిగి అమ్మకానికి పెట్టిన సర్వర్ల ప్రాజెక్టు

కొత్త స్కీమ్‌లతో విస్తరణ

మొదట 45 రోజుల స్కీమ్‌తో ఈ కంపెనీ ప్రారంభమైంది. ఆ తర్వాత నెల రోజులు.. 15 రోజులు.. 10 రోజులు.. 3 రోజులు.. చివరగా ఒక్క రోజు కాల వ్యవధితోనూ స్కీమ్‌లు నడిపించింది. 45 రోజుల స్కీమ్‌లో డబ్బు డిపాజిట్ చేసిన వాళ్లకు వెనువెంటనే ఖాతాల్లోకి డబ్బు చేరుతుండటం.. ఆ వివరాలను చూసి మరికొందరు ఆ స్కీమ్‌లలో చేరడం జరిగిపోయింది. పది రోజుల స్కీమ్‌లో ఒకసారి రూ.47 వేలు కడితే.. 10 రోజుల వరకు రోజూ రూ.21,374 చొప్పున అకౌంట్లలో జమ చేస్తారు. ఒక్క రోజు స్కీమ్ (ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్)లో రూ.13,500 చెల్లిస్తే అదే రోజు రాత్రి 12 గంటలు దాటిన తర్వాత రూ.29,700 చెల్లిస్తామని కంపెనీ నమ్మబలికింది.

'స్పందన'లో ఫిర్యాదు

కెనడియన్ సోలార్ యాప్‌లో డబ్బులు డిపాజిట్ చేస్తే రెట్టింపు మొత్తం తిరిగి ఇస్తామని చెప్పి మోసం చేశారని కర్నూలు నగరం బుధవారపుపేటకు చెందిన అర్షత్ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు ఈ నెల 17న స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. రూ.2.85 లక్షలు ఆన్‌లైన్‌లో డిపాజిట్ చేస్తే రూ.13 లక్షలు చెల్లిస్తామని నమ్మించి మోసం చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రెఫర్ చేస్తే బోనస్


ఖాతాదారులను ఆకట్టుకునేందుకు చైన్ లింకును తెరపైకి తెచ్చింది. ఒకరికి లింకు పంపిస్తే బోనస్‌ను నిర్ణయించింది. ఆ లింకు డౌన్‌లోడ్ చేసుకున్న వ్యక్తి రూ.13,500 చెల్లిస్తే.. చేర్పించిన వ్యక్తికి రూ.1,800 బోనస్, 700 పాయింట్లు, అదనంగా రూ.600 సబ్సిడీ బోనస్ కలిపి రూ.3,500 చెల్లిస్తుంది. ఇలా జాయిన్ చేసిన వారి వివరాలను వాట్సాప్ చాట్‌లో నమోదు చేస్తే ఒక ప్రోమో కోడ్ వస్తుంది. ఆ కోడ్‌ను తమ వద్దనున్న యాప్‌లో రివార్డు కాలమ్‌లో ఎంటర్ చేయగానే బోనస్ మొత్తం అకౌంట్‌లో జమ అవుతుంది.

చీకట్లో కలిసిపోయింది

నమ్మకమే పెట్టుబడిగా ఏర్పాటైన ఈ కంపెనీ చీకట్లో కలిసిపోయింది. ఎంతగా అంటే.. ప్లే స్టోర్‌లో కూడా సమాచారం లేకుండాపోయింది. చివరకు సెల్‌ఫోన్ల నుంచి కూడా యాప్ దానంతటదే డిలీట్ అయ్యిందంటే కంపెనీ నిర్వాహకుల తెలివితేటలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది.

మా అమ్మ ముందే ఒళ్లంతా వాతలు పెట్టాడు..

- ఉపాధ్యాయురాలికి ఆరేళ్ల బాలిక మొర
- బెడ్ మీద మూత్రం పోసిందని బాలికపై మారుతండ్రి పైశాచికత్వం
- కూర్చోలేని స్థితిలో ఉన్న చిన్నారిని గమనించిన స్కూల్ టీచర్
- విషయం ఆరా తీసి అధికారులకు ఫిర్యాదు
- హిందూపురంలో ఓ వ్యక్తి ఘాతుకం




చిన్నారి చంద్రిక

హిందూపురం అర్బన్: 'మా అమ్మ ముందే అతను ఇనుప కడ్డీలతో నాకు ఒళ్లంతా వాతలు పెట్టాడు టీచర్... చాలా నొప్పిగా ఉంది. కూర్చోలేక పోతున్నా...' అంటూ ఆరేళ్ల చిన్నారి ఏడుస్తూ చెప్పిన మాటలు విని ఆ ఉపాధ్యాయురాలు చలించిపోయారు. చిన్నారిని బుజ్జగించి వివరాలు ఆరా తీయగా... ఓ మారుతండ్రి పైశాచికత్వం వెలుగు చూసింది. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని బసవేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న అమృతకు చంద్రిక (6) అనే కుమార్తె ఉంది. కొంతకాలంగా అమృతకు భర్త దూరంగా ఉంటుండగా, ఆమె మణికంఠ అనే ఆటోడ్రైవర్‌తో సహజీవనం చేస్తోంది. బుధవారం రాత్రి చిన్నారి చంద్రిక పరుపుపై మూత్రం పోసిందన్న కారణంతో మారుతండ్రి మణికంఠ ఇనుప చువ్వలు కాల్చి తల్లి అమృత చూస్తుండగానే బాలిక మూతి, తొడ, ఇతర సున్నిత ప్రాంతాల్లో వాతలు పెట్టాడు. బాలిక రాత్రంతా ఏడుస్తూ ఉండిపోయింది. ఆ చిన్నారి గాయాలతోనే గురువారం ఉదయం బసవేశ్వర కాలనీలోని పాఠశాలకు వచ్చింది. పాఠశాలలో సరిగా కూర్చోలేక ఇబ్బంది పడుతున్న చంద్రికను గుర్తించిన ఉపాధ్యాయురాలు శిల్ప దగ్గరికి తీసుకుని పరిశీలించగా... శరీరమంతా వాతలు కనిపించాయి. టీచర్ వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హిందూపురం రూరల్ ఏఎస్ఐ జయరామిరెడ్డి పాఠశాల వద్దకు చేరుకుని చిన్నారి పరిస్థితిని గమనించి స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి వెంటనే హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మణికంఠ తనకు వాతలు పెట్టినట్లు చిన్నారి పోలీసులకు తెలిపింది. దీంతో మణికంఠపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త దీపిక పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. బాలికకు వాతలు పెట్టిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు.

కొనసాగిన ధార్మిక పరిషత్ కమిటీ విచారణ

రెండో రోజూ అర్జున్‌దాస్ గైర్హాజరు



రికార్డులను పరిశీలిస్తూ అక్కడి సిబ్బందిని ప్రశ్నిస్తున్న విచారణ కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: హథీరాంజీ మఠాధిపతిగా ఉన్న సమయంలో అర్జున్‌దాస్ పలు అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధార్మిక పరిషత్ కమిటీ సభ్యులు ఏబీ కృష్ణారెడ్డి, జోలా చైతన్య, శ్రీరామమూర్తి, విజయరాజు, రామకృష్ణారెడ్డి రెండో రోజు కూడా విచారణ నిర్వహించారు. అర్జున్‌దాస్ గురువారం కూడా విచారణకు హాజరవ్వలేదు. అయితే విచారణ కమిటీ సభ్యులు మఠంలోని రికార్డులను నిశితంగా పరిశీలించారు. రికార్డుల్లోని లావాదేవీలపై సిబ్బందిని ప్రశ్నించారు. అలాగే పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, మాజీ పూజారులు అర్జున్‌దాస్ వల్ల తాము పడిన ఇబ్బందులను విచారణ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో మఠం భూముల విషయంలో అర్జున్‌దాస్ చేసిన అక్రమాలను పలువురు కమిటీకి విన్నవించారు. అనంతరం విచారణ కమిటీ సభ్యుడు ఏబీ కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ విచారణకు అర్జున్‌దాస్ సహకరించట్లేదని చెప్పారు. అర్జున్‌దాస్‌పై పలువురు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అనంతరం నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

క్లుప్తంగా...

కొండచరియల కింద 16 మంది సజీవ సమాధి



ముంబై: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖలాపూర్ తహశీల్‌లోని ఇర్షల్‌వాడి గ్రామంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాలతో రాళ్లు, బురద మట్టి గ్రామాన్ని కప్పేశాయని గురువారం ఘటనాస్థలిని సందర్శించిన సీఎం ఏక్‌నాథ్ షిండే తెలిపారు. గ్రామంలో 48 గిరిజన కుటుంబాలకు చెందిన మొత్తం 103 మంది నివసిస్తుండగా కొందరు పొలం పనులకు, వారి పిల్లలు రెసిడెన్షియల్ స్కూళ్లకు వెళ్లారని తెలిసిందన్నారు. సుమారు 20 అడుగుల మేర పేరుకుపోయిన రాళ్లు, బురదలో 17 ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇప్పటి వరకు 16 మృతదేహాలను వెలికితీశారని, మరో 21 మందిని సహాయక సిబ్బంది కాపాడారని చెప్పారు. రోడ్డు సౌకర్యం కూడా లేని ఆ కొండప్రాంతంలో భారీ వర్షం కొనసాగుతున్నందున సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని చెప్పారు. 2014లో పుణే జిల్లా మాలిన్ గ్రామంపై కొండచరియలు విరిగిపడిన ఘటనలో 50 గిరిజన కుటుంబాలకు చెందిన 153 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఢిల్లీ ఆర్డినెన్స్ పిటిషన్ రాజ్యాంగ బెంచ్‌కు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అధికార యంత్రాంగంపై నియంత్రణ తన పరిధిలోకి తీసుకుంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. అయిదుగురు న్యాయమూర్తులున్న రాజ్యాంగ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించాలంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాల డివిజన్ బెంచ్ సిఫారసు చేసింది. ఢిల్లీలో అధికారుల నియమకాలు, బదిలీలను తన అధీనంలోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ కేంద్రం, ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం మధ్య కొత్త వివాదాన్ని రేపిన విషయం తెలిసిందే. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దుని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన తర్వాత దీనిపై విచారణ చేపడుతుందని సుప్రీం బెంచ్ స్పష్టం చేసింది.



మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్‌లో గురువారం గిరిజన సంఘాల నిరసన

దోషులను వదిలిపెట్టం

- మణిపూర్ సంఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ హామీ
- దేశం యావత్తు తలదించుకునేలా చేసిన ఘటన ఇది అని ఆవేదన



న్యూఢిల్లీ: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. దోషులను వదిలిపెట్టేదిలేదని ప్రకటించారు. మే 4వ తేదీన జరిగిన ఈ దారుణ ఉదంతం 140 కోట్ల మంది భారతీయులను తలదించుకునేలా చేసిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు జరిగిన అవమానం గురించి తెలిశాక తన హృదయం బాధతో, ఆవేదనతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా మోదీ గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల్లో శాంతి భద్రతలను కాపాడే యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళలకు తగిన భద్రత కల్పించాలని సూచించారు. శాంతిభద్రతలను పరిరక్షించే విషయంలో రాజీపడొద్దని, కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అమానవీయ ఘటన క్షమించరానిదని, దోషులను వదిలిపెట్టబోమని ప్రజలకు హామీ ఇస్తున్నానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, బిల్లులపై చర్చల కోసం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఎంపీలంతా పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కోరారు.

ఆరా తీసిన అమిత్ షా

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గురువారం మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్‌తో మాట్లాడారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ఆరా తీశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆ వీడియోను తొలగించండి: కేంద్రం ఆదేశం

మణిపూర్‌లో చోటుచేసుకున్న దారుణ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. ఇద్దరు మహిళల పట్ల దుండుగులు రాక్షసంగా ప్రవర్తించిన వీడియో సోషల్ మీడియా వేదికల్లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోను వెంటనే తొలగించాలని ట్విట్టర్ సహా ఇతర సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. వీడియోను తొలగించాలంటూ ట్విట్టర్‌ను జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది. దోషులు మరణ శిక్షకు అర్హులని మణిపూర్ సీఎం బీరేన్ పేర్కొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగుల గుంపులో ఉన్న ఒక కీలకమైన వ్యక్తితోపాటు మరొక నిందితుడిని అరెస్టు చేసినట్లు మణిపూర్ పోలీసులు చెప్పారు. ఈ దారుణ సంఘటనకు సంబంధించిన వీడియోను సుమోటోగా దర్యాప్తునకు స్వీకరించారు. గుర్తుతెలియని సాయుధ దుండగులపై బుధవారం థౌబాల్ జిల్లాలోని నాంగ్‌పాక్ సెక్మాయ్ పోలీసు స్టేషన్‌లో అపహరణ, సామూహిక అత్యాచారం, హత్య కేసు నమోదు చేశారు. మరోవైపు నిందితుడు హెరాదేశ్ సింగ్ ఇంటిని గ్రామస్థులు దహనం చేశారు.

అసలేం జరిగింది?


మణిపూర్‌లోని కాంగ్‌పోక్పీ జిల్లాలో మే 3న రెండు తెగల ప్రజల మధ్య హింస జరిగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో మే 4న బి.ఫయనోమ్ గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో దాదాపు 1,000 మందితో కూడిన ఓ గుంపు బి.ఫయనోమ్ గ్రామంలోకి ప్రవేశించింది. దుండగులు గ్రామంలో ఇళ్లకు నిప్పుపెట్టారు. పశువులు, దుస్తులు, టీవీలు, ఫోన్లు.. ఇలా సర్వం దోచుకున్నారు. ఈ మూక ఐదుగురు వ్యక్తులపై దాడికి దిగింది. ఆ సమయంలో పోలీసులు సైతం అక్కడే ఉన్నారు. దాడిలో 56 ఏళ్ల వ్యక్తి, అతడి కుమారుడు మృతిచెందారు. ముష్కరులు అతడి కుమార్తెను(21), మరో మహిళను నగ్నంగా మార్చి, ఊరేగింపుగా పొలాల్లోకి తీసుకెళ్లారు. 21 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మణిపూర్‌లో మే నుంచి కొనసాగుతున్న ఇంటర్నెట్‌పై నిషేధాన్ని తాజాగా ఎత్తివేశారు. అప్పటి సంఘటనకు సంబంధించిన 26 సెకండ్ల వీడియో ఈ నెల 19న సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళలు ప్రస్తుతం చురాచాంద్‌పూర్‌లో శిబిరంలో ఉన్నారు.

మీవల్ల కాకపోతే మేమే రంగంలోకి దిగుతాం: సుప్రీంకోర్టు

మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన అవమానాన్ని చూసి తాము తీవ్రంగా కలత చెందామని సుప్రీంకోర్టు వెల్లడించింది. మణిపూర్ ఘటనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తనంతట తానుగా గురువారం విచారణకు స్వీకరించింది. ప్రసార మాధ్యమాల్లో కనిపించిన వీడియోను చూస్తే మణిపూర్‌లో రాజ్యాంగ ఉల్లంఘన, మానవ హక్కులకు విఘాతం కలిగినట్లు స్పష్టంగా తెలుస్తోందని పేర్కొంది. బాధిత మహిళలకు ఉపశమనం కలిగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మహిళలను అవమానించిన వ్యక్తులను అరెస్టు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తమకు తెలియజేయాలని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే తామే రంగంలోకి దిగాల్సి వస్తుందని, తగిన చర్యలు ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించింది. మొత్తం చర్యలపై అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మణిపూర్‌లో హింసాకాండకు సంబంధించిన ఇతర పెండింగ్ పిటిషన్లపైనా ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణను 28వ తేదీకి వాయిదా వేసింది.

తొలి రోజే గరంగరం

- మణిపూర్ హింసాకాండపై అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు
- చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విపక్షాల వాయిదా తీర్మానం
- ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో వాయిదా పడిన రాజ్యసభ, లోక్‌సభ



రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: వర్షాకాల సమావేశాల్లో తొలిరోజే పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. మణిపూర్‌లో హింసాకాండ, ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన అవమానం సహా ఇతర అంశాలపై చర్చకు పట్టుబడుతూ విపక్షాలు ఆందోళనకు దిగడంతో ఉభయ సభలు అట్టుడికాయి. ఇతర సభా కార్యక్రమాలన్నీ రద్దుచేసి, మొదటి అంశంగా మణిపూర్ హింసపైనే చర్చించాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగింది.

ప్రధాని జవాబు చెప్పాలని డిమాండ్

పార్లమెంట్ సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమైన వెంటనే.. ఇటీవల మరణించిన సభ్యులకు నివాళులర్పించిన కొద్ది నిమిషాలకే రాజ్యసభ మధ్యాహ్నం 12 గంటలకు, లోక్‌సభ 2 గంటలకు వాయిదా పడ్డాయి. అంతకంటే ముందు మణిపూర్ అంశంపై 267 నిబంధన కింద చర్చకు పట్టుబట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించారు. ఈ మేరకు కాంగ్రెస్ తరఫున మాణిక్యం ఠాగూర్, ఆప్ నేత సంజయ్ సింగ్, బీఆర్ఎస్ తరఫున నామా నాగేశ్వరరావు, ఎంఐఎం నుంచి ఒవైసీ, సీపీఐ ఎంపీ బినోయ్ విశ్వం వాయిదా తీర్మానిచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభ పునఃప్రారంభమైన తర్వాత కాంగ్రెస్, టీఎంసీ సహా ఇతర విపక్షాల సభ్యులు మణిపూర్ హింసపై చర్చించాలని కోరారు. చైర్మన్ అంగీకరించకపోవడంతో నిరసనకు దిగారు. అత్యంత సున్నితమైన ఈ అంశాన్ని ప్రాధాన్యతగా చర్చకు చేపట్టాలని, దీనిపై మోదీ సమాధానం చెప్పాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. టీఎంసీ నేత డెరిక్ ఓబ్రియన్ సైతం ఆయనకు మద్దతు పలికారు. చైర్మన్ తిరస్కరించడంతో సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. సభ తిరిగి ఆరంభమైన తర్వాత కూడా ఖర్గే మరోసారి తమ నోటీసులపై చర్చించాలని కోరారు. ఆయన మైక్‌ను కట్ చేయడంతో కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో సభాపతి జగదీప్ ధన్‌ఖడ్ సభను శుక్రవారానికి వాయిదావేశారు. ఇక లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు పునఃప్రారంభమైన తర్వాత మణిపూర్ హింసపై విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించడంతో సభను స్పీకర్ శుక్రవారం ఉదయానికి వాయిదా వేశారు.

చర్చకు సిద్ధమే: పీయూష్ గోయల్

విపక్షాల ఆందోళనపై రాజ్యసభలో సభాపక్ష నేత పీయూష్ గోయల్ స్పందించారు. ''పార్లమెంట్ సక్రమంగా కొనసాగకూడదన్నదే ప్రతిపక్షాల ఉద్దేశంగా కనిపిస్తోంది. మణిపూర్ సంఘటనలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టంచేసినా.. నిబంధనల ప్రకారం చర్చ జరగనివ్వకుండా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి'' అని ఆక్షేపించారు.

సోనియా ఆరోగ్య పరిస్థితిపై మోదీ ఆరా

పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు లోక్‌సభలో ప్రధాని మోదీ విపక్ష నేతలను పలకరించారు. వారి యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీతో కొద్దిసేపు మాట్లాడారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మణిపూర్ హింసాకాండపై లోక్‌సభలో చర్చించాలని ప్రధాని మోదీని సోనియా కోరారని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి చెప్పారు.

ఇండియా కూటమి తొలి భేటీ

ఖర్గే చాంబర్‌లో సమావేశమైన ప్రతిపక్ష నేతలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతల మొట్టమొదటి సమావేశం గురువారం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో వారంతా భేటీ అయి వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మంగళవారం బెంగళూరులో సమావేశమైన ప్రతిపక్ష నేతలు తమ కూటమికి ఇండియా అనే పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. మణిపూర్ అంశంపై ఉభయసభల్లో చర్చించాలని, అనంతరం ప్రధాని మోదీ ఒక ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ..మణిపూర్ సీఎం బిరేన్ సింగ్‌ను వెంటనే తొలగించి, అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఆ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు 80 రోజులుగా కొనసాగుతున్నా ప్రధాని మోదీ అక్కడికి వెళ్లలేదు, అక్కడి పరిస్థితిపై స్పందించలేదని చెప్పారు. 'మహిళా రెజ్లర్లపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ పార్లమెంట్ నాలుగో నంబర్ గేట్ దగ్గర కనిపించగా, అక్కడికి కొన్ని అడుగుల దూరంలో ప్రధాని మోదీ మహిళల భద్రతపై లెక్చరిచ్చారు. ద్వంద్వ ప్రమాణాలు బీజేపీ డీఎన్ఏలోనే ఉన్నాయి'అని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాగూర్ అన్నారు.

ప్రాజెక్టు చీతా అగమ్యగోచరంగా మారింది. ఒక్కొక్కటిగా చీతాలు ప్రాణాలు కోల్పోతూ ఉంటే ఎందుకిలా జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాతావరణ పరిస్థితులు, మేటింగ్‌లో సమస్యలు, సహజ కారణాలతో చీతాలు మృతి చెందుతున్నాయనే ఇన్నాళ్లూ అధికారులు చెబుతూ వచ్చారు. కానీ వాటి భద్రత కోసం అమర్చిన రేడియో కాలరే చీతాల పాలిట మృత్యుపాశమైందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రేడియో కాలర్ల వల్ల చీతాలు ఎలా మరణిస్తున్నాయి ? ఎందుకిలా జరుగుతోంది ?

రేడియో కాలర్ మృత్యుపాశమై!

భద్రత కోసం కట్టిందే చీతాలను బలి తీసుకుంటోందా?
రేడియో కాలర్లతో చీతాలకు వస్తున్న సమస్యలేంటి ?



కేంద్ర ప్రభుత్వం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి విదేశాల నుంచి తీసుకొచ్చిన చీతాలు ఒక్కొక్కటి ప్రాణాలు కోల్పోతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలో ఏకంగా ఎనిమిది చీతాలు మరణించాయి. భారత్‌లో చీతా ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17న ఆయన పుట్టిన రోజు నాడు నమీబియా నుంచి తీసుకువచ్చిన 8 చీతాలను కునో జాతీయ పార్క్‌లో ప్రవేశపెట్టారు. రెండో విడతలో భాగంగా ఈ ఏడాది దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలు తీసుకువచ్చారు. మార్చిలో జ్వాల అనే చీతా నాలుగు కూనలకు జన్మనిచ్చింది. అయితే ఏడాది తిరక్కుండానే ఎనిమిది చీతాలు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల తేజస్, సూరజ్ అనే రెండు చీతాలు మరణించాయి. ఆ చిరుతల రేడియో కాలర్ల కింద గాయాలున్నట్టు వైద్యులు గుర్తించారు. ఆ గాయాల్లో పురుగులు కూడా ఉన్నట్టు వారు నిర్ధారించారు. ఇదే తరహా గాయాలు మరో రెండు చీతాల్లో కూడా ఉండడంతో వాటికి రేడియో కాలర్లు తొలగించి చికిత్స అందిస్తున్నారు. వాటి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో రేడియో కాలర్లే చీతాల మృతికి కారణం కావచ్చునన్న అనుమానాలు బలపడ్డాయి. రేడియో కాలర్లలో ఉండే చిప్ ఉపగ్రహాల ద్వారా జంతువులకు సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తుంది. చీతాల భద్రత, సంరక్షణ కోసం వీటి అవసరం చాలా ఉంది.

నమీబియా నుంచి తెచ్చిన చీతాలు **8**

దక్షిణాఫ్రికా నుంచి తెచ్చిన చీతాలు **12**

మార్చిలో పుట్టిన చీతాలు **4**

మృతి చెందిన చీతాలు: 3 కూనలు సహా 8

మిగిలిన చీతాలు **16**

- సాక్షి, నేషనల్ డెస్క్

అన్నీ ఒక్క చోటే ఎందుకు ? : సుప్రీం



దక్షిణాఫ్రికా, నమీబియా నుంచి తీసుకువచ్చిన చీతాల్లో 40% మృత్యువాత పడడం ఆందోళనకరంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. చీతాల ప్రాజెక్టుని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఒక్కచోటే ఎందుకు ఉంచుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించింది. మధ్యప్రదేశ్ కునో నుంచి వేరే రాష్ట్రాల్లో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలకు చీతాలను తరలించే మార్గాలను అన్వేషించాలని కేంద్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బి.ఆర్.గవాయ్. జె.బి. పర్దివాలా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. ''చీతాలు మరణించడానికి కారణాలేంటి ? అసలు ఏమిటి సమస్య ? వాతావరణం చీతాలకు అనుకూలంగా లేదా ? ఇంకా ఏమైనా కారణాలున్నాయా ? గత వారంలో రెండు చీతాలు మరణించాయి ? అలాంటప్పుడు అన్ని చీతాలను మధ్యప్రదేశ్ కునోలో ఎందుకు ఉంచాలి ? వాటిని వేరే కేంద్రాలకు ఎందుకు తరలించకూడదు ? అంటూ కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించింది. కేంద్రం తరఫున కోర్టుకి హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి త్వరలోనే చీతాల మృతికి గల కారణాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. జులై 29లోగా దీనిపై పూర్తి స్థాయి వివరణ ఇవ్వాలని సుప్రీం ఆదేశించింది.

రేడియో కాలర్స్ ఎలా కబళించాయి?



→ చీతాల కదలికల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం వాటి మెడకి రేడియో కాలర్స్ కట్టారు. వేసవి కాలంలో చెమట, దురద వల్ల చీతాలు తరచుగా మెడపై గీరుకోవడం వల్ల చీతాలకు గాయాలై అది చర్మ సంబంధితమైన ఇన్‌ఫెక్షన్‌కు దారితీసి ప్రాణాలు కోల్పోయి ఉండే అవకాశాలున్నట్టు మధ్యప్రదేశ్ అటవీ సంరక్షణ మాజీ అధికారి అలోక్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

→ వర్షాకాలం వచ్చాక వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో రేడియో కాలర్స్ కట్టిన మెడ చుట్టూ ఒరుసుకొని పోయి చీతాలకు గాయాలయ్యాయి. ఆ గాయాల మీద క్రిమి కీటకాదులు ముసిరి ఇన్‌ఫెక్షన్‌గా మారుతోంది. దీనివల్ల రక్త ప్రసరణకు సంబంధించిన సెప్టిసీమియా అనే పరిస్థితి తలెత్తి చీతాల మరణానికి దారితీసింది.

→ ఏదైనా ఒక వస్తువుని సుదీర్ఘకాలం శరీరంపై ఉంచడం వల్ల బ్యాక్టీరియా సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జర్నల్ ఆఫ్ క్లినికల్ డయాగ్నస్టిక్ రీసెర్చ్‌లో తేలింది. ముఖ్యంగా చీతాల మెడ చుట్టూ ఉండే జుట్టు మృదువుగా ఉండడం వల్ల రేడియో కాలర్‌తో వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

→ జంతువులకి వాడే రేడియో కాలర్ బరువు ఆ జంతువు అసలు బరువులో 3% మాత్రమే ఉండాలి. సాధారణంగా రేడియో కాలర్ల బరువు 400 గ్రాముల వరకు ఉంటుంది. 20 నుంచి 60 కేజీల బరువు ఉండే చీతాలకు ఇది సరిపోతుంది. అయితే చీతా మెడ కంటే తల పెద్దది కాదు. దీని వల్ల రేడియో కాలర్ వాటికి అత్యంత బరువుగా అనిపిస్తాయి. చిన్న జంతువులన్నింటిలోనూ ఈ సమస్య ఉంటుంది. రేడియో కాలర్ కట్టడం వల్ల సమస్యలు ఎక్కువయిపోతాయని లండన్‌లోని రాయల్ వెటర్నరీ కాలేజీ ప్రొఫెసర్ అలన్ విల్సన్ చెప్పారు.

→ చీతాలకు గత కొన్ని నెలలుగా రేడియో కాలర్ కట్టే ఉంచారు. కానీ వేసవిలో ఇలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. వానలు కురవడం ప్రారంభమయ్యాక చర్మం నిరంతరం తడిగా ఉండడం వల్ల రేడియో కాలర్ గాయాలు మరింత పెద్దవై చీతాలు మృత్యువాత పడ్డాయి.

రాజ్యసభ వైస్ చైర్‌పర్సన్లలో సగం మంది మహిళలు

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ వైస్ చైర్‌పర్సన్ల ప్యానెల్‌లో సగం మంది మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇది జూలై 17 నుంచి అమల్లోకి వచ్చిందని ఆయన గురువారం ప్రకటించారు. కొత్తగా ఉపాధ్యక్షులైన రాజ్యసభ సభ్యుల్లో పీటీ ఉష, ఎస్.ఫంగ్‌నొన్ కొన్యాక్, ఫౌజియా ఖాన్, సులాటా దియో, వి.విజయసాయిరెడ్డి, ఘన్‌శ్యామ్ తివారీ, ఎల్.హనుమంతయ్య, సుఖేందు శేఖర్ రే ఉన్నారు. నాగాలాండ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మొట్టమొదటి మహిళ కొన్యాక్ సహా ప్యానెల్‌లోకి తీసుకున్న మహిళా సభ్యులందరూ మొదటిసారిగా పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన వారే. ఎగువసభ చరిత్రలో వైస్ చైర్‌పర్సన్ల ప్యానెల్‌లోకి సగం మందికి ప్రాతినిధ్యం కల్పించడం ఇదే ప్రథమం అని ఉపరాష్ట్రపతి కార్యాలయం తెలిపింది.

ఆ బియ్యం ఎగుమతులపై నిషేధం

న్యూఢిల్లీ: బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతులపై కేంద్రం గురువారం నిషేధం విధించింది. రానున్న పండుగ సీజన్‌కల్లా దేశీయంగా సరఫరాను పెంచడం, రిటైల్ ధరలను నియంత్రణలోకి తేవడమే లక్ష్యమని కేంద్ర ఆహార శాఖ తెలిపింది. బార్ పాయిల్డ్ నాన్ బాస్మతి, బాస్మతి రైస్ ఎగుమతి విధానంలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసింది. దేశం మొత్తం బియ్యం ఎగుమతుల్లో నాన్ బాస్మతి వైట్ రైస్ వాటా 25% వరకు ఉంటుంది.

చంద్రయాన్-3 కక్ష్య పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు గురువారం ఉదయం 6.45 గంటలకు నాలుగోసారి కక్ష్య దూరాన్ని పెంచారు. ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహకనౌక ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, దూరంగా 36,500 కిలోమీటర్ల ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ప్రపొల్షన్ మాడ్యూల్‌లో నింపిన ఇంధనాన్ని మండించి మొదటి, రెండు, మూడు విడతల్లో భూమికి దగ్గరగా 224 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 51,568 కిలోమీటర్ల ఎత్తుకు పెంచిన విషయం తెలిసిందే. నాలుగో విడతలో భూమికి దగ్గరగా 277 కిలోమీటర్లు, దూరంగా 89,772 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు. ఈ నెల 25న అయిదోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపట్టనున్నామని షార్ వర్గాలు తెలిపాయి.

దేశంలోనే సంపన్న ఎమ్మెల్యే డీకే శివకుమార్

బెంగళూరు: దేశంలోనే అత్యంత ధనికుడైన ఎమ్మెల్యేకి రూ.1,400 కోట్ల ఆస్తులుండగా బెంగాల్‌కు చెందిన అత్యంత నిరుపేద ఎమ్మెల్యే పేరిట రూ.2 వేలు కూడా లేవని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తెలిపింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి, కర్ణాటక డిప్యూటీ సీఎం అయిన డీకే శివకుమార్ ఆస్తుల విలువ రూ.1,413 కోట్లు కాగా ఆతర్వాతి రెండు స్థానాల్లో ఉన్నవారూ కర్ణాటకకు చెందిన వారేనని ఏడీఆర్ నివేదిక తెలిపింది. రెండో స్థానంలో ఉన్న స్వతంత్ర ఎమ్మెల్యే కేహెచ్ పుట్టస్వామి గౌడ ఆస్తుల విలువ రూ.1,267 కోట్లు కాగా, రూ.1,156 కోట్లతో మూడో స్థానంలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియా కృష్ణ నిలిచారు.

గగన్‌యాన్ ఎస్‌ఎంపీఎస్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట: గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రపొల్షన్ సిస్టం (ఎస్ఎంపీఎస్)ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయవంతంగా పరీక్షించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఇస్రోకు చెందిన ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్టుగా గురువారం ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పరీక్షలో 440 ఎన్ థ్రస్ట్‌తో ఐదు లిక్విడ్ అపోజి మోటార్ ఇంజిన్లు, 100 ఎన్ థ్రస్ట్‌తో 16 రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లను పరీక్షించారు. గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్‌కు 440 ఎన్ ఇంజిన్లు మిషన్ ఆరోహణ దశలో ప్రధాన చోదకశక్తిని అందిస్తాయి. సుమారు 250 సెకండ్లపాటు నిర్వహించిన పరీక్షలో లిక్విడ్ అపోజి మోటార్ ఇంజిన్లు, రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లను పరీక్షించి సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు.



అయోధ్యలో చురుగ్గా కొనసాగుతున్న శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణ పనులు. జనవరిలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం జరగనుంది. దీంతో భక్తుల రాక నేపథ్యంలో అయోధ్య పట్టణం, చుట్టుపక్కన ప్రాంతాల్లోని హోటళ్లలో గదుల బుకింగ్ విపరీతంగా పెరిగింది.

టాయిలెట్ కోసం వందేభారత్ రైలెక్కితే రూ. 6వేలు గుల్ల

భోపాల్: బాత్‌రూం కోసం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కిన ఓ వ్యక్తి రూ.6 వేలు నష్టపోయాడు. అదెలాగంటే..మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీకి చెందిన అబ్దుల్ ఖదీర్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఖదీర్, భార్య, 8 ఏళ్ల కొడుకుతో కలిసి ఈనెల 15న సాయంత్రం 5.20 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి భోపాల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. 8.55 గంటలకు వారు సింగ్రౌలీ రైలెక్కాల్సి ఉంది. వారు నిల్చున్న ప్లాట్‌ఫాం పక్కనే ఇండోర్ వెళ్లాల్సిన వందేభారత్ రైలుంది. ఖదీర్ అర్జంటుగా మూత్రానికి వెళ్లాల్సి రావడంతో వందేభారత్ టాయిలెట్‌లోకి వెళ్లారు. తిరిగి బయటకు వచ్చే సమయానికి రైలు కదలడం, బోగీ తలుపులు లాక్ కావడం జరిగిపోయాయి. అటుగా వచ్చిన పోలీసులు, టికెట్ కలెక్టర్లను అడిగినా లాభం లేకపోయింది. ట్రెయిన్ డ్రైవర్ మాత్రమే తలుపులు తెరిచే అవకాశం ఉందని వారు బదులిచ్చారు. చివరికి ట్రెయిన్ డ్రైవర్‌ను అడిగాక రైలాగింది. టికెట్ లేకుండా ప్రయాణం చేసినందుకు రూ.1,020 జరిమానాగా చెల్లించుకున్నాడు. అక్కడి నుంచి తిరిగి భోపాల్ చేరుకునేందుకు బస్సుకు మరో రూ.750 ఖర్చయ్యాయి. ఖదీర్ ఎక్కడికెళ్లాడో తెలియక భార్య, కొడుకు భోపాల్ ప్లాట్‌ఫాం మీదనే ఉండిపోయారు. సింగ్రౌలీ రైలు ప్రయాణానికి రూ.4 వేలతో చేయించిన రిజర్వేషన్ కూడా క్యాన్సిలయింది. అలా ఖదీర్ మొత్తంగా రూ.6 వేలు నష్టపోవాల్సి వచ్చింది. ఎమర్జెన్సీ వ్యవస్థ లేకపోవడంతో తన కుటుంబం మానసిక వ్యథకు గురైందంటూ ఖదీర్ చేసిన ఆరోపణలను భోపాల్ రైల్వే డివిజన్ పీఆర్వో సుబేదార్ సింగ్ ఖండించారు. రైలు బయలుదేరడానికి ముందుగానే తెరిచి ఉండే డోర్లు, లాక్ అయ్యే డోర్లపై ప్రకటన చేస్తారని చెప్పారు.

అంతరిక్షంలో శాస్త్రవేత్తలు గుర్తించిన అరుదైన అద్భుతమిది. భూమికి 400 కాంతి సంవత్సరాల దూరంలోని కొత్త సౌర వ్యవస్థ(పీడీఎస్70)లో ఒకే కక్ష్యలో తిరుగుతున్న రెండు గ్రహాలు ఇవి. దీంతో కవల గ్రహాలు ఒకే కక్ష్యలో తిరుగుతాయనే సిద్ధాంతానికి తొలిసారిగా బలమైన రుజువు లభించింది.





దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



34,357 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,838 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 34,357 బస్తాల అమ్మకాలు జరిగాయి.

కలెక్టర్‌ను కలిసిన కేయూ వీసీ



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ పి.రాజాబాబును ఆయన చాంబర్‌లో గురువారం కృష్ణా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ గొల్లా జ్ఞానమణి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు యూనివర్సిటీ అంశాలపై చర్చించారు.

న్యూస్‌రీల్

176 మంది సర్టిఫికెట్ల పరిశీలన



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి నిర్వహించిన ఈసెట్-2023లో ర్యాంకులు పొందిన స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగింది. ఎన్‌సీసీ-93, స్పోర్ట్స్ అండ్ గేమ్స్-46, సీఏపీ-4, విభిన్నప్రతిభావంతులు(వికలాంగులు)-26, స్కౌట్స్ అండ్ గైడ్స్-7 (మొత్తం 176) మంది సర్టిఫికెట్లను పరిశీలించామని కౌన్సెలింగ్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎం.విజయసారథి తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. ముత్యాలంపాడుకు చెందిన పంచాలవరపు కామేశ్వరశర్మ, నాగలక్ష్మి ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,11,116 విరాళంగా ఇచ్చారు. దుర్గమ్మ దర్శనానంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.

హోటల్ రంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో హోటల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్.కె.రోజాకు ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. విజయవాడ పటమటలంకలోని ఆమె నివాసంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి.రమణ, పూర్వ ప్రెసిడెంట్ పి.రవి, కోశాధికారి మల్లికార్జున తదితరులు కలిశారు. తమ విజ్ఞప్తి మేరకు ప్రధాన నగరాల్లో అర్ధరాత్రి వరకూ రెస్టారెంట్లు, హోటళ్లను నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతిస్తూ జీఓ విడుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. హోటల్స్ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడలో స్ట్రీట్ ఫుడ్ కోర్టులు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిల్లో తమకు స్థలాలు కేటాయిస్తే హోటల్ రంగంలో పనిచేసే వారికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తామన్నారు. వారి ప్రతిపాదనలను పరిశీలిస్తామని మంత్రి రోజా హామీ ఇచ్చారు.

విద్యార్థుల భాగస్వామ్యంతో సమాజసేవ

కృష్ణా యూనివర్సిటీ వీసీ జ్ఞానమణి



కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. విద్యార్థులు సమాజహిత కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఎన్‌సీసీ విభాగ అధికారి డాక్టర్ డి. రామశేఖరరెడ్డి మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బాలాజీ, సెక్రటరీ బి.శంకరనాథ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, రసాయన శాస్త్ర అధ్యాపకులు జి, రవి, కె.సీతాలు తదితరులు పాల్గొన్నారు.

కాగితం కప్పు.. క్యాన్సర్ ముప్పు

తస్మాత్ జాగ్రత్త

- పేపర్ గ్లాసుల్లో వేడి ద్రావణాలు తాగడం మంచిది కాదు
- క్యాన్సర్‌తో పాటు అనేక రకాల వ్యాధులు రావచ్చు
- సంప్రదాయ మట్టి, గాజు గ్లాసుల వినియోగం ఎంతో మేలు



వ్యాధులకు మూలమైన పేపర్ గ్లాసుల్లో టీ



ఓ స్టాల్‌లో మట్టి గ్లాసుల్లోనే జ్యూస్ ఇస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): గతంలో టీ, కాఫీ, జ్యూస్‌లను గాజు గాసుల్లో ఇచ్చే వారు. కాలం మారే కొద్దీ వీటి స్థానంలో డిస్పోజబుల్ పేపర్ గ్లాసులు వచ్చాయి. నేడు ఎక్కువ శాతం మంది పేపర్ గ్లాసుల్లో కాఫీ, టీలు తాగడానికి ఇష్టపడుతున్నారు. అయితే వీటిలో వేడి ద్రావణాలు తీసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని నిపుణుల అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. పేపర్ గ్లాసుల వినియోగంతో ఆరోగ్యం ఆవిరవుతోందని చెబుతున్నారు. పేపర్ మీద నీళ్లు పోస్తే అది మెత్తబడి చిరిగిపోతుంది. కానీ పేపర్ గ్లాసుల్లో వేడి టీ పోసినా, జ్యూస్ పోసినా గట్టిగా ఉంటుంది. దీనికి కారణం వాటి తయారీలో సూక్ష్మ ప్లాస్టిక్‌ను వినియోగించడమే. దీని లోపల పాలీథిలిన్ అనే పదార్థంతో లేయర్ వేస్తారు. అది అనేక ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతోందని వైద్యులతో పాటు, పర్యావరణ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. ఒకప్పుడు స్టీల్, పింగాణి, గాజు గ్లాసులు, కప్పులను వినియోగిస్తే, కరోనా తర్వాత డిస్పోజబుల్ పేపర్ గ్లాసుల వినియోగం అధికమైంది. వాటితో వచ్చే ముప్పును మాత్రం గ్రహించలేక పోతున్నారు.

అనేక వ్యాధులకు మూలం

వేడి టీ పోస్తే పేపర్ గ్లాసు లోపల ఉన్న పాలిథిలిన్ లేయర్ కరిగి దానిలో కలిసిపోతుంది. దీన్ని తాగడం ద్వారా మైక్రో ప్లాస్టిక్ సూక్ష్మ కణాలు శరీరంలోకి చేరి ఒక లేయర్‌గా ఏర్పడతాయి. కొంత మందికి విరోచనం ద్వారా బయటకు వచ్చేస్తాయి. ఎక్కువ మంది ప్రజల్లో పొట్టలోనే ఉంటాయి. వాటి కారణంగా గుండె జబ్బులు, రక్తనాళాల జబ్బులు, లివర్ ప్రాబ్లమ్స్, జీర్ణకోశ సమస్యలు, పేగుల్లో అల్సర్లు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని ఇటీవల పరిశోధనల్లో తేలింది. వీటితో పాటు మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు సోకుతాయని పర్యావరణ విశ్లేషకులు చెప్తున్నారు.

ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటితే

పేపర్ గ్లాసుల్లో చల్లటి పదార్థాలు తాగితే అంత దుష్ప్రభావాలు ఉండవని విశ్లేషకులు అంటున్నారు. మంచినీరు, జ్యూస్ వంటివి తాగవచ్చునంటున్నారు. అయితే ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటిన టీ, కాఫీ వంటివి పేపర్ గ్లాసులో తాగితేనే మైక్రో సూక్ష్మకణాలు పొట్టలోకి చేరతాయని చెబుతున్నారు. ఒక గ్లాసులో 10 నిమిషాలకు మించి వేడి టీ, కాఫీలు ఉంచి తాగితే 25 వేల సూక్ష్మకణాలు శరీరంలోకి చేరతాయంటున్నారు. ఎప్పుడైనా ఒకసారి తాగితే పర్వాలేదని, రోజూ తాగే వారిపై ప్రభావం చూపుతుందంటున్నారు. విజయవాడ నగరంలోని హోల్‌సేల్ షాపుల్లో రోజుకు 3 నుంచి 4 లక్షల వరకు పేపర్ గ్లాసులు విక్రయిస్తున్నామని పలు దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు.

పాతతరం వైపు చూపు

పర్యావరణ వేత్తల హెచ్చరికలతో మళ్లీ పాత తరంలో వాడిన వస్తువులపై ప్రజలు చూస్తున్నారు. మట్టి గ్లాసుల్లో తాగడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. నగరంలోని కొన్ని టీ స్టాల్స్, జ్యూస్ స్టాల్స్‌లో మట్టి గ్లాసులను వినియోగిస్తున్నారు. ఒక ప్రముఖ బ్రాండ్ కాఫీ షాప్ వాళ్లు కూడా స్టీల్ గ్లాసులతో కాఫీ ఇస్తున్నారు. ఇలా హానికరమైన వాటిని దూరం చేస్తూ పలు బ్రాండ్‌ల పేరుతో నెట్ వర్క్ కాఫీ, టీ స్టాళ్లలో మట్టి గ్లాసులను వినియోగిస్తున్నారు.

పేపర్ గ్లాసుల వినియోగంతో ప్రమాదం



పేపర్ గ్లాసుల్లో వేడి టీ, కాఫీలు తాగడంతో ముప్పు పొంచి ఉంటుంది. వేడి ద్రావణం పేపర్ గ్లాసులో పోసినప్పుడు దానిలోని పాలిథిలిన్ కరిగి కడుపులోకి వెళ్తుంది. అది లోపల లేయర్‌గా ఏర్పడి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. సంప్రదాయ గాజు, పింగాణి, మట్టి, స్టీల్ గ్లాసుల వినియోగం ఎంతో మంచింది.

– తుమ్మల శ్రీకుమార్, పర్యావరణ నిపుణులు

మట్టి గ్లాసులను వాడుతున్నాం



మా వద్ద టీ, కాఫీలతో పాటు, జ్యూస్‌లకు మట్టి గ్లాసులనే పూర్తిగా వినియోగిస్తున్నాం. కస్టమర్లు మట్టి గ్లాసులను ఆదరిస్తున్నారు. మట్టి గ్లాసులతో పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, ఆరోగ్యానికి కూడా మంచిదని వాటినే వినియోగిస్తున్నాం. పేపర్ గ్లాసులతో పోల్చితే వాటి రేటు ఎక్కువే. అయినా మట్టిగ్లాసుల బ్రాండ్‌తో టీ ఇస్తున్నాం. ప్రజలు కూడా అలవాటు పడుతున్నారు. జ్యూస్, ఫ్లావర్డ్ డ్రింక్స్ కూడా మట్టి గ్లాసులోనే ఇస్తున్నాం.

–వెంకటరెడ్డి, చాయ్–షాయ్ నిర్వాహకుడు

లోపాల్లేని ఓటర్ల జాబితా రూపకల్పన

కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన డీఆర్వో మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా లోపాలు లేని పటిష్టమైన తుది జాబితా రూపొందిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నెలరోజుల పాటు ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఇంటింటి సర్వేపై డీఆర్వో కె.మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 23,46,711 మంది జనాభా ఉన్నారని, వీరిలో 16లక్షల మంది ఓటర్లు అన్నారు. ఎలక్టోరల్ పాప్యులేషన్ రేషియో ప్రకారం 20 నుంచి 50 వేల మంది వరకు ఓటర్ల నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పరిశీలనలో బూత్ లెవల్ అధికారులు బీఎల్వో యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన చేస్తారన్నారు. గుర్తించిన మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన వివరాలను నమోదు చేసి అక్టోబర్ 17 నాటికి సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలను అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు స్వీకరిస్తామని తెలిపారు. దీని కోసం అక్టోబరు 28, 29, నవంబరు 18, 19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. జనవరి 5, 2024న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని ప్రకటించారు. బీఎల్వోలు ఓటర్లను తొలగించడం, చేర్పడం వంటివి చేస్తారనే అపోహలు రాజకీయ పార్టీలకు ఉన్నాయన్నారు. బీఎల్వోలకు ఆ అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక సవరణ పూర్తయ్యేవరకు ప్రతి మంగళ, బుధవారాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది, రాజకీయ నేతలు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలు తొలగిస్తాం

వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి



కాల్వను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడానికే మిషన్ కృష్ణా ప్రక్షాళన అని నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. వీఎంసీ ఆధ్వర్యాన 'మిషన్- కృష్ణానది కాల్వల ప్రక్షాళన'కు గురువారం కృష్ణా కెనాల్‌లో మేయర్ భాగ్యలక్ష్మి మూడు క్లీనింగ్ బోట్లను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని బందర్ కెనాల్, ఏలూరు కెనాల్, రైవస్ కెనాల్ కాల్వల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగిస్తామని చెప్పారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరంలోని మూడు కాలువల పై చెత్త వేయకుండా బందర్ కెనాల్ మొత్తం 8 బ్రిడ్జిలకు, ఏలూరు కెనాల్ మొత్తం 12 బ్రిడ్జిలకు, రైవస్ కెనాల్ మొత్తం 12 బ్రిడ్జిలకు గ్రిల్స్, సి.సి.కెమెరాలు, మైకులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మూడు ప్రధాన కాల్వలను పర్యాటక ప్రాంతాలుగా మార్చనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఎంసీ ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

'పోలీస్' భవన నిర్మాణానికి రూ.6.20 లక్షల విరాళాలు



ఎమ్మెల్యే వంశీమోహన్ నుంచి విరాళం అందిస్తున్న రాధాకృష్ణమూర్తి దంపతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమాజ శ్రేయస్సు కోసం విరాళాలు అందిస్తున్న పారిశ్రామికవేత్తల దాతృత్వం అభినందనీయమని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో నిర్మిస్తున్న పోలీస్ సర్కిల్ కార్యాలయం భవన నిర్మాణానికి పలువురు దాతలు రూ. 6.20 లక్షల విరాళాలను అందించారు. యుఎస్ ఆర్ ఆక్వా ఫీడ్స్ ఫ్యాక్టరీ అధినేత హర్షవర్ధన్‌రెడ్డి రూ.2 లక్షలు, హనుమాన్‌జంక్షన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున రూ. 3 లక్షలు, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సూరపనేని రాధాకృష్ణమూర్తి రూ.1,00,116, నీలిమ ఆక్వా ఫీడ్స్ సంస్థ తరపున రూ.20 వేల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని బాపులపాడు మండలం కాకులపాడులో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీమోహన్ చేతుల మీదుగా భవన నిర్మాణ కమిటీ సభ్యులు, సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తికి అందించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక లోక్‌అదాలత్

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 22వ తేదీ ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని కోర్టుల పరిధిలో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మోటారు వాహన ప్రమాదాల కేసులు, భూసేకరణ అంశాల్లోని కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

డీఆర్ఎంగా నరేంద్ర ఆనందరావు పాటిల్ బాధ్యతల స్వీకరణ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ నూతన డీఆర్ఎంగా నరేంద్ర ఆనందరావు పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం డివిజన్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ప్రస్తుత డీఆర్ఎం శివేంద్ర మోహన్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ 1995 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు పశ్చిమ రైల్వేలో చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించారు. తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రతిభకు 2014లో నేషనల్ రైల్వే అవార్డు, 2007, 2010, 2013లో జీఎం అవార్డులు సాధించారు. లీడర్స్ ఇన్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు ప్లానింగ్ (ఎల్‌యూటీపీ)పై సింగపూర్, హాంకాంగ్‌లో జరిగిన శిక్షణలో కూడా ఆయన పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఉచ్చు

- ఇంట్లో కూర్చొని లక్షలు సంపాదించవచ్చని వినూత్న ప్రచారం
- ప్రముఖ కంపెనీల పేరుతో మభ్యపెడుతున్న ఆన్‌లైన్ ఆర్థిక నేరగాళ్లు
- సైబర్ పోలీస్ స్టేషన్‌లో పెరుగుతున్న ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: ఆన్‌లైన్‌లో వర్క్ చేస్తూ ఇంట్లో కూర్చునే నెలకు లక్షలు సంపాదించవచ్చు అంటూ ఫేస్‌బుక్ పోస్ట్‌కు విజయవాడకు చెందిన ఓ వివాహిత ఆకర్షితురాలైంది. ఆమె భర్త ఓ ప్రవేటు సంస్థ ఉద్యోగి. కుటుంబ అవసరాలకు భర్త సంపాదన చాలడం లేదు. తను డిగ్రీ చదివింది. ఇంట్లోనే నివసిస్తూ, పిల్లలను చూసుకుంటూనే కుటుంబానికి ఆర్థిక తోడ్పాటును అందించాలని నిర్ణయించుకుంది. వెంటనే ఫేస్‌బుక్ పోస్ట్‌కు రిప్లై ఇచ్చింది. పోస్ట్ పెట్టిన వ్యక్తి అడిగిన వివరాలను వాట్సాప్‌లో తెలిపింది. రిజిస్ట్రేషన్, వర్క్ ఆర్డర్, వర్క్ అప్రూవల్ అంటూ మెసేజ్‌లు వచ్చాయి. ఆమె విడతల వారీగా రూ. 35 వేలు సదరు వ్యక్తికి ఫోన్ పే ద్వారా చెల్లించింది. వర్క్ ఏంటో చెప్పకుండానే ఇంకా డబ్బులు కట్టాలని అడుగుతుండటంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త జీతంలో ప్రతి నెలా సేవింగ్స్ చేసుకున్న డబ్బు మొత్తాన్ని నమ్మించి కాజేశారంటూ పోలీసుల వద్ద వాపోయింది. ఆన్‌లైన్ ట్రేడింగ్, వర్క్ ఫ్రం హోం, ఆన్‌లైన్ ట్రెనింగ్ ఇలా పలు రకాలుగా సైబర్ నేరగాళ్లు నిరుద్యోగులపై పంజా విసురుతూనే ఉన్నారు. ఫోన్‌తోనే ఎక్కువగా గడుపుతున్నవారిని టార్గెట్ చేసి ఆన్‌లైన్ ఉద్యోగం/వ్యాపారమంటూ ముగ్గులోకి లాగుతూ పేద, మధ్యతరగతి వారి కష్టాన్ని కొల్లగొడుతున్నారు. రెండు నెలల్లో 36 మంది బాధితులు ఆశ్రయించినట్లు పోలీసులు చెబుతున్నారు.

టెలికం ప్రొవైడర్ల నుంచి నంబర్లు సేకరించి..

టెలికం ప్రొవైడర్ల నుంచి ప్రజల నెంబర్లను సైబర్ నేరగాళ్లు సులువుగా సేకరిస్తున్నారు. ముందుగా వాట్సాప్/ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రాం/టెలిగ్రాం/టెక్స్ట్ మెసేజ్‌ను పంపుతున్నారు.

ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో వర్క్ చేస్తూ నెలకు రూ.లక్షలు సంపాదించవచ్చని ఒక రకంగా, కొన్ని బడా కంపెనీల్లో పెట్టుబడి పెడితే వచ్చిన లాభాలను పంచుతామంటూ మరో రకంగా నిరుద్యోగులను ఆకర్షిస్తున్నారు. ముందుగా రూ.100 పెట్టుబడి పెట్టి పరీక్షించుకోండంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. బాధితులను పలు రకాలైన ఆఫర్లతో ఆకర్షించి బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లు లూటీ చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త తరహాలో జరుగుతున్నాయి. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసి సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నాం. ఈ నేరాలపై చేరువ వాహనం ద్వారా కమిషనరేట్ పరిధిలో రోజూ రెండు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కళాశాలల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నా. మోసపూరిత మెసేజ్‌లను నమ్మవద్దు. అవసరం లేని వెబ్‌లింక్‌ల జోలికి పోకూడదు.

– టి.కె.రాణా, పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

ఎంఈఓల విధులపై ఓరియెంటేషన్ తరగతులు

పెడన: జిల్లాలో ఇటీవల బాధ్యతలను చేపట్టిన మండల విద్యాశాఖాధికారులు-1, 2లతో పాటు సెక్టోరియల్ అధికారులకు గురువారం ఒక రోజు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు. మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం నుంచి జరిగిన క్లాస్‌లో డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ పాఠశాలలను ఏవిధంగా తనిఖీలు చేయాలి, తీసుకోవాల్సిన చర్యలు ఏమిటన్న వాటిపై అవగాహన కల్పించారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన, ఈకేవైసీ వాటిపై ఆరా తీసిన పిమ్మట తయారు చేయాల్సిన నివేదికలను తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వి.పార్వతి, ఏఓ అజీజ్, మచిలీపట్నం డీవైఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూడాలి

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్



పెనమలూరులో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

పెనమలూరు: విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూడాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం ప్రవీణ్‌ప్రకాష్ వచ్చి సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు సకాలంలో అందించడానికి చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. మొబైల్ డిస్ట్రిబ్యూషన్ వాహనంతో పాఠ్యపుస్తకాలు సరఫరా చేయటంతో ప్రధానోపాధ్యాయులకు ఆర్థిక భారం తగ్గుతుందని, అనుకున్న సమయానికి విద్యార్థులకు అందిస్తామని వివరించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠ్యపుస్తకాల డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, విజయవాడ పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, ఎంఈఓ శేషగిరిరావు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ రాజాబాబు

పెనమలూరు: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ఈ నెల 26వ తేదీన గంగూరు గ్రామ పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. ఆయన గురువారం గంగూరులో ఆర్బీకే, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ల సముదాయం వద్దకు వచ్చి కలెక్టర్ రాజాబాబుతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లు సమీక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు పరిశీలిస్తారన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడతారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శేఖర్‌బాబు, ఆర్డీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్, ఏడీ సునీల్, డీఎల్‌డీవోలు నాంచారరావు, సుబ్బారావు, తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



బీఎల్ఎస్ పరికరాలను పరిశీలిస్తున్న వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాణాపాయంలో అందించే తక్షణ ప్రాథమిక చికిత్సే వారి ఊపిరి నిలుపుతుందని, అలాంటి స్కిల్స్‌ను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని రాష్ట్ర వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. సిద్ధార్థ వైద్య కళాశాలలో రూ.2.60 కోట్లతో ఏర్పాటు చేసిన నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ స్కిల్‌ల్యాబ్‌ను గురువారం ఎంటీ కృష్ణబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆరు వైద్య కళాశాలల్లో స్కిల్‌ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, అన్ని వైద్య కళాశాలల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా పల్మనరీ రీ ససిటేషన్(సీపీఆర్)పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య కళాశాలలో ఆడిటోరియం మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ కృత్రిమ శ్వాస ఎలా అందించాలి, ఆగిన గుండెను కొట్టుకునేలా ఎలా చేయాలి, గొంతులో ఏదైనా ఇరుక్కున్నప్పుడు దాన్ని ఎలా బయటకు తీయాలి వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనురాధ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, స్కిల్‌ల్యాబ్ నోడల్ అధికారి డాక్టర్ టి.సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు



మాట్లాడుతున్న కె.రామ్మోహనరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్నార్ హాల్లో విశ్వవిద్యాలయాలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ అప్రెంటీస్ మిళితమైన డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టడం వల్ల వృత్తి నైపుణ్యంతో పాటు స్టైఫండ్ కూడా పొందవచ్చని తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి మయాంక్ భట్నాగర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో యువతలో నైపుణ్యాలను పెంచేందుకు కళాశాలల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం డెప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి సింగ్ మాట్లాడుతూ యువత పరిశ్రమల స్థాపనకు ఈ పథకం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ మాథ్యూ శ్రీరంగం, ఉన్నత విద్యా మండలి అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ సీవీఎస్ భాస్కర్, బి.ఎల్లారెడ్డి, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ రాజేష్ సి.జంపాలతో పాటుగా యూనివర్శిటీలు, స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన విష్ణు, అవినాష్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్‌తో కలిసి వెలంపల్లి మీడియాతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమాలు పెట్టాలనే ఆలోచన కూడా రాలేదన్నారు. సురక్షలో భాగంగా 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో 5 లక్షలకు పైగా ఇళ్లను సర్వే చేసి 2.50 లక్షల పైగా అర్హులను గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేశామని వెల్లడించారు. చంద్రబాబు 14 ఏళ్లగా ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు ఏనాడూ మంచి చేయలేదన్నారు. ఆయన హయాంలో పింఛను తీసుకోవాలంటే క్యూలైన్‌లో రోజుల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో 1 వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్లే నేరుగా ఇంటికి వెళ్లి పింఛను అందిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని చంద్రబాబు, పవన్ గమనించాలని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై బురద జల్లడం సబబు కాదన్నారు. ఈ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

పవన్ వైఖరి సిగ్గుచేటు....

పవన్ ఢిల్లీలో ప్రధాని మోదీ, అమిత్‌షాలను కలిసినపుడు టీడీపీ బీజేపీలను కలపడానికి కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడితే బాగుండేదని వెలంపల్లి అన్నారు. టీడీపీ, బీజేపీని కలపడానికి మాట్లాడడం సిగ్గుచేటని తెలిపారు. జగన్ ఢిల్లీ వెళితే రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడి నిధులు తెచ్చేవారన్నారు. పవన్ టీడీపీ, బీజేపీ మధ్య బ్రోకర్ లా మారాడని ధ్వజమెత్తారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు జగనన్న సురక్షే నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి గోల్ లేదన్న పవన్ కేవలం ప్యాకేజీ కోసమే పనిచేస్తున్నారని మండిపడ్డారు. తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని సేవలు ప్రజల ఇళ్ల వద్దకే అందిస్తున్నామని చెప్పారు. జగన్‌ను ఎదుర్కోలేక టీడీపీ, జనసేన దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దినేష్.. నీ త్యాగం చిర'స్మర'ణీయం !

- అవయవదానం చేసిన యువకుడికి మణిపాల్ యాజమాన్యం నివాళులు
- నలుగురికి జీవితాల్లో వెలుగులు



తాడేపల్లి రూరల్: అవయవదానం చేసి నలుగురికి జీవితాల్లో వెలుగులు నింపిన యువకుడికి మణిపాల్ యాజమాన్యం గురువారం ఘన నివాళులర్పించింది. విజయవాడ విద్యాధరపురానికి చెందిన వుజ్జురి దినేష్(22) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో మణిపాల్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆరోగ్య పరిస్థితిని గమనించిన వైద్యులు క్రేనియోటమీ శస్త్ర చికిత్సను నిర్వహించారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించలేదు. వైద్యపరీక్షల అనంతరం బ్రెయిన్ డెడ్‌గా గుర్తించారు. దినేష్ భార్య వసంత, తండ్రి ఏడుకొండలు, తల్లి సుశీల అంగీకారం మేరకు జీవన్‌ధార్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబు, మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడిల ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. దినేష్ కాలేయం, కిడ్నీని మణిపాల్ ఆసుపత్రిలోని అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా అమర్చినట్లు మణిపాల్ ఆసుపత్రి వర్గాలు తెలిపారు. కళ్లను వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు, లంగ్స్‌ను కిమ్స్ (సికింద్రాబాద్), ఒక కిడ్నీని విజయ హాస్పిటల్(విజయవాడ)కు తరలించామని వివరించారు. అవయవ దానానికి ముందుకు వచ్చిన దినేష్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపింది.

బ్యాడ్మింటన్‌లో క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సిద్ధార్థ మహిళా కళాశాల, సిద్ధార్థ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు సత్తా చాటారు. అండర్-11 బాలుర సింగిల్స్‌లో ఎస్.కార్తీక్, సుఫియాన్, డబుల్స్‌లో ఎస్.కార్తీక్-సుఫియాన్ జోడి, బాలికల సింగిల్స్‌లో ఎస్.కావ్య, కె.ఆధ్య, డబుల్స్‌లో కావ్య-ఆధ్య జోడి, అండర్-13 బాలికల సింగిల్స్‌లో ఐ.తన్వి, ఎస్.కావ్య, డబుల్స్‌లో తన్వి-కావ్య, అండర్-15 బాలుర సింగిల్స్‌లో కె.లోహిత్, టి.హర్షల్, అండర్-15 బాలుర డబుల్స్‌లో కె.లోహిత్-టి.హర్షల్ జోడి, బాలికల సింగిల్స్‌లో డి.తేజస్విని, డబుల్స్‌లో తేజస్విని-యశ్విత జోడి, అండర్-17 బాలికల సింగిల్స్‌లో డి.తేజస్విని, బాలుర సింగిల్స్‌లో కె.యువతేజ, సీనియర్ పురుషుల సింగిల్స్‌లో బి.సాయితేజ పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు కళాశాల డాక్టర్ టి.విజయలక్ష్మీ, కోచ్ భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీ అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు.

వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం: ఏపీ యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు 2023 సంవత్సరానికి సంబంధించి అర్హులైన వారి నుంచి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డ్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వ్యక్తిగతంగా, సాంఘిక కార్యక్రమాలకు (సోషల్ వర్క్) సంబంధించిన అంశాలు, ఇతర జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారు తగిన ఆధారాలతో (వార్తా పత్రికల క్లిప్పింగులు, ఫొటోలు జతపరచి) దరఖాస్తు చేయాలని వివరించారు. గ్రామ/మురికివాడల అభివృద్ధిలో చేసిన కృషి, స్వచ్ఛంద సేవా సంస్థలు, లాభాపేక్ష లేని సంస్థలకు చెందిన వ్యక్తులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తును ఒక పేజీకి మించకుండా తమ వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్, ఇ-మెయిల్ వివరాలను జత చేసి ముఖ్య కార్యనిర్వాహణాధికారి కార్యాలయం, యువజన సర్వీసుల శాఖ, స్టెప్- క్రిషి, సబ్ కలెక్టర్ కార్యాలయంపై అంతస్తులో అందజేయాలని ఆయన సూచించారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

పెనమలూరు: కారు ఢీకొని తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. పోరంకి పద్మానాభపురం కాలనీలో బి.రాజేంద్ర (70) కుటుంబ సభ్యులతో నివశిస్తున్నాడు. ఆయన పోరంకి-నిడమానూరు రోడ్డులో బుధవారం వాకింగ్ చేస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న రాజేంద్ర గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయదారుడిపై పీడీ యాక్ట్

విజయవాడ స్పోర్ట్స్: గంజాయి విక్రయిస్తూ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న మాలపోలు శివనాగమహేష్‌పై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శివనాగమహేష్ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో నివాసం ఉంటూ నగరంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గజాయి విక్రయిస్తూ గతంలో 14 సార్లు పట్టుబడి జైలు జీవితం అనుభవించినా నిందితుడిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజా శాంతిభద్రతల దృష్ట్యా శివనాగమహేష్‌పై పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు. గంజాయి రవాణా, విక్రయదారులు, వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు నగరంలో ఏడుగురు వ్యక్తులపై పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు. గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 112, వాట్సాప్ నెంబర్ 7328909090కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ కోసం దరఖాస్తులు

చిలకలపూడి(మచిలీపట్నం): సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, 2 పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు గురువారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పోటీ పరీక్షల కోసం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దరఖాస్తుదారుని వార్షిక ఆదాయం రూ. 6 లక్షల్లోపు ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యర్థులై ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపికకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగష్టు 5వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ఉయ్యూరు: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పెద ఓగిరాల గ్రామానికి చెందిన పద్మావతి (60) పామర్రులో నివాసం ఉంటున్న మనవరాలు జ్యోతి ఇంటికి వెళ్లేందుకు బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పద్మావతి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని



ఫ్యామిలీ డాక్టర్ వైద్య బృందంతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ డాక్టర్ కార్యక్రమం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. పలు ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించి కుటుంబ డాక్టర్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి 1 విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులకు ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం అమల్లో భాగంగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు సరఫరా, పంపిణీ వంటి అంశాలను సమీక్షించారు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సేవలను పరిశీలించారు.

మందుల విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

డీసీపీ అజిత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ అజిత

విజయవాడ స్పోర్ట్స్: మందుల స్టోరేజీ, విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) వి.అజిత సూచించారు. ఎన్డీపీఎస్ యాక్ట్-1985, డ్రగ్స్-కాస్మోటిక్స్ యాక్ట్-1940లపై హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత మాట్లాడుతూ ఎన్డీపీఎస్ యాక్ట్‌లో పొందుపరిచిన షెడ్యూల్ డ్రగ్స్ స్ట్రిప్స్ పై ఎరుపు రంగు ఎన్ఆర్ఎక్స్ లేబుల్ కలిగి ఉంటుందని చెప్పారు. ప్రత్యేక లాకర్స్‌లో మందుల స్టోరేజ్ చేయాలని తెలిపారు. విక్రయాలను ప్రత్యేక రిజిష్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా వినియోగదారులకు మందులు అందజేయవద్దని స్పష్టం చేశారు. మందులు క్రయవిక్రయాలపై నియమ నిబంధనలు పాటించాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీలు డాక్టర్ కె.హనుమంతరావు, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్‌మూర్తి, సీఐలు ఆర్. సురేష్‌రెడ్డి, అబ్దుల్‌సలాం, వెంకటేశ్వర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి, చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గంజాయి కేసులో ఇద్దరిని, దొంగతనం కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు గవర్నర్‌పేట సీఐ సురేష్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గంజాయి కేసులో ఇద్దరి నుంచి 1390 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దొంగతనం కేసులో 1.04 లక్షల నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. హనుమాన్‌పేట చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్క్‌లో ఇద్దరు వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ సురేష్ తన బృందంతో వెళ్లి చూడగా అక్కడ ఇద్దరు వ్యక్తులు తారసపడ్డారు. వీరిలో తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన మద్దాల వెంకటేశ్వరరావు, పట్నాల అప్పన్నగా గుర్తించారు. వారి వద్ద ఉన్న గంజాయి, స్మోకింగ్ ట్యూబ్ ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ నెల 17వ తేదీ రాత్రి గవర్నర్‌పేట గూడవల్లి వారి వీధిలోని కిరణ్ ట్రేడర్స్‌లో చోరీ జరిగింది. దీనిపై షాపు యజమాని రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన యలమంచిలి హేమంత్ కుమార్ చోరీకి పాల్పడినట్లు తేలింది. బుధవారం ఏలూరు లాకుల వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన సొత్తు రూ. 1.04 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.

24న ఐటీఐ అభ్యర్థులకు జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఐటీఐ పూర్తి చేసిన వారికి వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 24వ తేదిన విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులోని తమ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌ట్రానిక్స్, రమేష్ ఆసుపత్రి, ఎల్వీ ప్రసాద్ హస్పటల్, హయత్ ప్లేస్‌ల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఆయా కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, ఐటీ అండ్ఎస్ఎం, పెయింటర్, వెల్డర్ ట్రేడ్‌ల్లో అప్రెంటీస్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో జరిగే జాబ్‌మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

ఉత్కంఠగా సాగిన వాలీబాల్ పోటీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో 15 రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ జట్టు సభ్యులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలీబాల్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా ఎస్ఎంసీ వైట్స్, ఎస్ఎంసీ గ్రేట్స్ జట్టుల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఎస్ఎంసీ వైట్స్ టీమ్ విజయం సాధించింది. అనంతరం విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ అభినందించారు. పోటీలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రాము ఆధ్వర్యంలో నిర్వహించారు.

సీఎంఏ విజయవాడ చాప్టర్ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ నూతన భవనాన్ని గురువారం ప్రారంభించారు. పటమటలోని కరణం గారి బజారులో నూతనంగా నిర్మాణమైన ఈ భవనాన్ని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ విజేందర్ శర్మ ప్రారంభించారు. అంతకుముందు విజయవాడ చాప్టర్ చైర్మన్ సీతారామస్వామి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విజయవాడ చాప్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రేఖశర్మ, శంకర్‌పాణికర్, పద్మనాభన్, సుంకర పాపారావు, వినయ్ రంజన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కడప జిల్లా కడప నగరంలో యూటీఎఫ్ భవనంలో ఈనెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు, జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో గురువారం శిక్షణ తరగతుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను భ్రష్టు పట్టించిందని, ఫెలోషిప్‌లకు కోత విధించిందని విమర్శించారు. విద్యారంగ సమస్యలు, విధానాలపై శిక్షణ తరగతుల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వైష్ణవ్, దుర్గాప్రసాద్, వేణు, ఉదయ్, విక్రమ్ పాల్గొన్నారు.

వైదిక కమిటీ సభ్యుడికి రూ.10 వేల జరిమానా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని అమ్మవారి నివేదనశాలలోకి సామాన్య భక్తుడిని అనుమతించిన ఘటనపై వైదిక కమిటీ సభ్యుడు బి.శంకర శాండిల్యకు ఆలయ ఈవో భ్రమరాంబ రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ నెల 17న ఓ భక్తుడిని వైదిక కమిటీ సభ్యుడు నివేదనశాలలోకి తీసుకువెళ్లి ప్రసాదం ఇచ్చిన ఘటన దుర్గగుడిలో వివాదస్పదమైంది. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఆలయ ఈవో భ్రమరాంబ సెక్షన్ ఇన్‌చార్జితో పాటు బాధ్యతుల నుంచి వివరణ అడిగి తెలుసుకున్నారు. అర్చకేతరుడిని నివేదనశాలలోకి అనుమతించినట్లు రుజువు కావడంతో సదరు వైదిక కమిటీ సభ్యుడికి రూ.10 వేలు జరిమానా విధించారు. నివేదనశాలను సంప్రోక్షణ చేయడంతో పాటు మరో మారు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని వైదిక కమిటీ సభ్యులు, అర్చకులను ఈవో హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్, విజయ స్టీల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొనకళ్ల వాసుదేవ సూర్యశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భవానీపురం ఐరన్ కాంప్లెక్స్ సొసైటీ భవనంలో నిర్వహించే శిబిరంలో మానస హాస్పిటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని జీర్ణకోశ(గ్యాస్ట్రో), మానసిక సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్కే అయోధ్య, డాక్టర్ మానస కాజ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సూరే పవన్‌కుమార్‌లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందజేస్తారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమమే ధ్యేయం.. సుపరిపాలనే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- విజయవంతంగా జగనన్న సురక్ష కార్యక్రమం
- 13,220 మందికి సర్టిఫికెట్ల అందజేత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, నాయకులు

గుణదల (విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ధ్యేయం, సుపరిపాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందించేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ధ్రువీకరణ పత్రాలు పొందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అందించడంలో అధికారులు నిబద్ధతగా పనిచేశారని కొనియాడారు.

సురక్షకు మంచి స్పందన

తూర్పు నియోజకవర్గం పరిధిలోని వలంటీర్లు సమారు 70,500 గృహాలకు వెళ్లి 13,220 మందికి పలు ధ్రువీకరణ పత్రాలను అందించారని అవినాష్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు, సర్టిఫికెట్లు ప్రజల వద్దకే నేరుగా చేరుతున్నాయని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గద్దే నోరు అదుపులో పెట్టుకో..

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విశేషమైన కృషి చేస్తున్న వలంటీర్లను తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ విమర్శిస్తున్నారని అవినాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబద్ధతగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థను అవహేళన చేయటం సరికాదని హితవు పలికారు. మహిళా వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడటం అత్యంత హేయమన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకులు ఉదయ్, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

● టార్గెట్ క్లీన్ కృష్ణా కెనాల్స్

మిషన్ - కృష్ణానది, కాలువల ప్రక్షాళనకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. నగరంలోని కెనాల్స్‌లో వేసే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు మూడు క్లీనింగ్ బోట్లను ఏర్పాటు చేసింది. ఈ బోట్లను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు గురువారం ప్రారంభించారు. అనంతరం బోట్‌లో పర్యటించి, పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





తల్లిదండ్రుల పోషణ చట్టంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీలునామా, గిఫ్ట్ డీడ్‌లపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ తదనంతరం మాత్రమే పిల్లలకు ఆస్తులు చెందేటట్లు ఏర్పాట్లు చేయాలని, ముందుగానే ఆస్తుల్ని ఇవ్వడం వలన ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. ఆస్తులు రాయించుకుని తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటివేసిన ఘటనలు చూస్తున్నామని చెప్పారు. ముందుగానే ఆస్తులు రాయించుకుని ఇబ్బందులకు గురిచేస్తే వీలునామా రద్దు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఆస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో వేమూరు బాబూరావు, పూడి శ్రీనివాసరావు, సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, న్యాయవాది పి.రాము, సంఘం సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు, నాదెళ్ల సుమతి, ఎస్.బాలాజీ, సైకాలజిస్ట్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న తేజోవతి

గుణదల(విజయవాడతూర్పు): మాదక ద్రవ్యాల వినియోగం వలన జీవితాలు పతనమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.తేజోవతి అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆంధ్రలయోల కళాశాల ఆవరణలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగంతో శారీరక రోగాలతో పాటు మానసిక రుగ్మతలు తలెత్తుతున్నాయన్నారు. విద్యార్థులు కేవలం ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. చెడు స్నేహాలు, ఉద్దేశపూర్వకంగా చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుర్భర పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ అన్నామణి, మానసిక వైద్య నిపుణులు పి.భవాని, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్‌కుమార్, డీన్ డాక్టర్ సుభ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు 'ఆశ్రయం'

వీఎంసీ ఆధ్వర్యంలో రాణిగారితోటలో నిరాశ్రయుల ఆవాస గృహం



రాణిగారితోటలోని నిరాశ్రయుల ఆవాస గృహం

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరానికి వచ్చే నిరాశ్రయులకు నేనున్నానని ఆశ్రయం కల్పిస్తోంది రాణిగారితోటలోని నిరాశ్రయుల ఆవాస గృహం. ఇది పల్లెల నుంచి పొట్ట చేతపట్టుకుని పనుల కోసం నగరానికి వచ్చే అభాగ్యులకు నీడను కల్పిస్తోంది. నగరంలో ఏదో ఒక పని చేసుకుని సరైన గూడు లేక కాలం వెళ్లదీసే దిక్కులేని వారికి ఆవాస గృహం ఒక వరం లాంటిది. గత కొన్నేళ్ల క్రితం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రాణిగారితోటలోని సిమెంట్ గోడౌన్ ప్రాంగణంలో అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తూ నిరాశ్రయుల ఆవాస గృహం ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో సుమారు 30 మంది వరకు ఉచితంగా ఆశ్రయం పొందేవిధంగా ఈ గృహంలో అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు గృహానికి కేర్‌టేకర్‌ను కూడా ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి ఈ ఆవాస గృహం ఎంతోమంది అభాగ్యులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అయితే గత కొన్ని నెలల నుంచి సరైన వసతులు లేకపోడడంతో ఆశ్రయం పొందుతున్న వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఎప్పుడో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో పగలంతా పని చేసుకుని రాత్రి పూట కాస్త విశ్రాంతి తీసుకుందామని వచ్చే అభాగ్యులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన టీవీ కూడా మరమ్మతులకు గురవడంతో ఎంటర్‌టైన్‌మెంట్ చూసే అవకాశం కూడా లేకుండా పోయింది. గృహంలో కొత్త ఫ్యాన్లు, వాషింగ్ మిషన్, టీవీ ఏర్పాటు చేయాలని నిరాశ్రయులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఆవాసం గృహంలో రోజుకు 10 నుంచి 15 మంది ఆశ్రయం పొందుతున్నారని కేర్‌టేకర్ సురేష్ తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కి సీ సర్టిఫికెట్స్ ప్రదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని ఎన్‌సీసీ – 4 ఆంధ్రా బాలికల బెటాలియన్ సుబేదార్ మేజర్ భన్వర్‌రామ్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్‌లో సీ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి గురువారం సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న లెఫ్టినెంట్ భన్వర్‌రామ్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ ఉత్తీర్ణులైన వారికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసులోకి వెళ్లవచ్చని, సర్వీస్ కమిషన్ పరీక్షల్లో కూడా రాత పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కోటాను అమలు చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా 17 మంది కేడెట్లకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ సుబేదార్ లక్ష్మణ్‌సింగ్, కళాశాల ఏఎన్‌ఓ రఫీయాబేగం పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

కంకిపాడు: కంటి వెలుగుతో వృద్ధుల కళ్లకు భద్రత లభిస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. కంకిపాడు సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 44 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్, మోటరు వాహనా చట్టాలపై ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో గురువారం డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులకు, పాదచారులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించి తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాలు, డ్రైవర్ల నిర్లక్ష్యం వలన సంభవిస్తున్నాయని చెప్పారు. వాహన చోదకులు అవగాహనతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే తప్పకుండా ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ జి.శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు డి.వి.రమణ, ఐడీఎస్ రాజు, ఎస్ఐలు, సిబ్బంది, 250 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను అరికట్టాలి

కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాతా శిశు మరణాలను కనీస స్థాయికి తగ్గించి, దశల వారీగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈ ఏడాదిలో జరిగిన మాతా శిశు మరణాలపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. జూన్ నెలలో జరిగిన మాతా శిశు మరణాలపై సంబంధిత సచివాలయ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో పాటు ప్రైవేటు ఆస్పత్రి వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా శిశు మరణాల్లో వైద్యుల నిర్లక్ష్యం లేనప్పటికీ, మరణాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. జరిగిన మరణాలను విశ్లేషిస్తే నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లులు, శిశువులు ఉండడం బాధాకరమన్నారు. గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించాలన్నారు. వైద్యులు అంకిత భావంతో పని చేసి మాతా శిశు మరణాలను నివారించాలన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆరోగ్య కేంద్రాలను తయారు చేసిందన్నారు. దీనితో పాటు వైద్య ఆరోగ్య శాఖలో స్పెషలిస్ట్ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, అత్యాధునిక సౌకర్యాలతో వసతులు కల్పించినప్పటికీ మాతా, శిశు మరణాలు జరగడం దురదృష్టకరమన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. జూన్‌లో జరిగిన ఐదు మాతృ మరణాలు, 24 శిశు మరణాలు సంభవించగా వీటిపై సబ్ కమిటీతో ఆడిట్ నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, డిస్ట్రిక్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ అమృత, వైద్యులు జె.హిందుమతి, పద్మావతి, ప్రభావతి, ఎస్.వినయకుమార్, ఆనందకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శవంతమైనది

ఏపీ పరీక్షల విభాగం కమిషనర్ దేవానందరెడ్డి



ప్రసంగిస్తున్న దేవానందరెడ్డి, వేదికపై నారాయణ రావు, సాంబశివరావు తదితరులు

విజయవాడకల్చరల్: భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శవంతమైనదని ఏపీ పరీక్షల విభాగం కమిషనర్ డి.దేవానందరెడ్డి అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, శ్రీ గొల్ల నారాయణమూర్తి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో జంధ్యాల పరదేశిబాబు రచించిన తెలుగు సాహిత్యంలో కల్యాణాలు గ్రంథ పరిచయ సభను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవానందరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ వివాహ వ్యవస్థలో అనేక మధుమైన ఘట్టాలుంటాయని వాటికి శాస్త్రీయతతో పాటు సమాజానికి సందేశం ఇచ్చే అంశాలతో నిండి ఉంటుందన్నారు. నేడు వివాహ వ్యవస్థలో అనేక మార్పులు చేసుకుంటున్నాయని, చాలా సందర్భాల్లో కేవలం మొక్కుబడిగా సాగుతున్నాయని చెప్పారు. నేటి యవతరానికి వివాహ సంప్రదాయాలను తెలియజెప్పాల్సిన అవసరముందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో గ్రంథాలు రచించారని తెలిపారు. తెలుగు సాహిత్యంపై పుస్తకాలు విస్తృతంగా రావాల్సిన అవసరముందన్నారు. కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గొల్ల నారాయణరావు మాట్లాడుతూ.. పరదేశిబాబు సుదీర్ఘ కాలంగా సాహితీ రంగంలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ చీఫ్ విప్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కల్యాణాలు గ్రంథాన్ని ఇంటర్ ఆపై తరగతులకు పాఠ్యాంశాలుగా చేయాలని సూచించారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, విశ్రాంత ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ తెలగరెడ్డి సత్యానందం, ఉపాధ్యాయుల సంఘం నాయకుడు డాక్టర్ డి.శ్రీను, పరదేశిబాబు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కావూరి సత్యవతి తెలుగు సాహిత్యంలో కల్యాణాల గ్రంథ విశేషాలను వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ



కోట్లు అందజేస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, బ్యాంక్ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన 116 మంది పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని రెయిన్ కోట్లు అందించారు. నగర వాసుల సహకారంతోనే పూర్తిస్థాయిలో పారిశుద్ధ్యాన్ని నిర్వహించగలమన్నారు. బ్యాంక్ ఆధ్వర్యంలో మధురానగర్ నుంచి బీఆర్టీఎస్ రోడ్ ఫుడ్ కోర్ట్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగులు కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా డెప్యూటీ జనరల్ మేనేజర్ – రీజినల్ హెడ్ విజయవాడ చందన్ సాహూ, డెప్యూటీ రీజనల్ మేనేజర్ ఏవీ భాస్కర్, సిటీ బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల అందజేత



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, మేజర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రక్షణ సైన్యం ఇండియా 128వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వన్‌టౌన్ గాంధీహిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విచ్చేసి పేదలకు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 1895వ సంవత్సరంలో కెప్టెన్ అబ్దుల్ అజీజ్ దంపతులు గాంధీహిల్ కేంద్రంగా రక్షణ సైన్యం ఏర్పాటు చేశారన్నారు. ఆనాటి నుంచి సేవా కార్యక్రమాలతో పాటు హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులకు సాయం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రక్షణ సైన్యం ఇండియా మేజర్ టి.పాల్‌కుమార్, మేజర్ ఏరుసలెం, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే గద్దె వ్యాఖ్యలు హాస్యాస్పదం'



బెల్లం దుర్గ, డెప్యూటీ మేయర్

ఆటోనగర్: తూర్పు నియోజవర్గంలో ఓట్ల తొలగింపు, దొంగ ఓట్లు చేర్చుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఎద్దేవా చేశారు. 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్‌లోనీ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గద్దెకు ఓటమి భయం పట్టుకుందన్నారు. గతంలో ఓటర్ లిస్టుల్లో అవకతవకలకు పాల్పడి గెలిచిన గద్దె చరిత్ర నియోజకవర్గం ప్రజలందరికీ తెలుసునన్నారు. 2వ డివిజన్‌లో ఓ మహిళ పట్ల గద్దె వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. ప్రభుత్వ పథకాలకు అనుకూలంగా మాట్లాడితే ప్రజలను దూషిస్తారా? గద్దె అహంకారానికి బుద్ధి చెప్పేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నిరంతరం ప్రజల కోసం పాటుపడుతున్న దేవినేని అవినాష్‌ను గెలిపించుకోవాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన దళిత కార్పొరేటర్‌ను కులం పేరుతో దూషించడం గద్దె అహంకారానికి అద్దంపడుతోందని చెప్పారు. టీడీపీ హయాంలో గద్దె చేసిన అభివద్ధి, తమ పార్టీ హయాంలో చేసిన అభివద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని దుర్గ, ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్ల గురించి గద్దె మాట్లాడటం సిగ్గు చేటన్నారు.

ఉప్పొంగుతున్న గోదావరి

గంట గంటకూ పెరుగుతున్న వరద ప్రవాహం

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ధవళేశ్వరం నుంచి 5.83 లక్షల క్యూసెక్కులు కడలిలోకి
- నేడూ కొనసాగనున్న ఉధృతి

సాక్షి, అమరావతి/చింతూరు/ఎటపాక/పోలవరం రూరల్/ధవళేశ్వరం/పి.గన్నవరం: పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం.. ఉపనదులు పరవళ్లు తొక్కుతుండటంతో గోదావరిలో వరద గంట గంటకు పెరుగుతోంది. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు భద్రాచలం వద్ద నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. రాత్రి ఏడు గంటల సమయంలో అక్కడ నీటి మట్టం 43.8 అడుగులకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రికి భద్రాచలం వద్ద వరద మరింత అధికమవుతుందని, నీటి మట్టం 46.76 అడుగులకు చేరే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ(కేంద్ర జలసంఘం) అంచనా వేసింది. ఆ నీటి మట్టం 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక.. 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఇక గురువారం రాత్రి ఏడు గంటలకు పోలవరం ప్రాజెక్టులోకి 5,99,490 క్యూసెక్కులు చేరుతుండగా.. అధికారులు అదే స్థాయిలో 48 గేట్ల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన వరద ప్రవాహంతో ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 5,96,139 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 12,800 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 5,83,339 క్యూసెక్కులను 175 గేట్ల ద్వారా కడలిలోకి వదిలేస్తున్నారు.

వరద కాస్త పెరిగే అవకాశం..

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావం వల్ల శుక్రవారం కూడా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా.ఈ నేపథ్యంలో గోదావరిలో వరద మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.వరద ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

విలీన మండలాల్లో సహాయక చర్యలు

వరదనీటితో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాలాల్లో భయం నెలకొంది. గోదావరి వరద రహదారులపైకి చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఇక దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ ఆలయం గోదావరి వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలను సహాయ పునరావాస శిబిరాల్లోకి తరలిస్తున్నారు.

ధవళేశ్వరం వద్ద నేడు మొదటి హెచ్చరిక జారీ!

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరదతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గురువారం రాత్రి 11గంటలకు నీటి మట్టం 9.70 అడుగులకు చేరింది. శుక్రవారం ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వశిష్ట నదీపాయలో తాత్కాలికంగా నిర్మించిన రహదారి బుధవారం అర్ధరాత్రి కొట్టుకుపోయింది.


దేవీపట్నం మండలంలో నీట మునిగిన గండిపోశమ్మ ఆలయం

అమరావతి 'అసైన్డ్'పై తుది విచారణ ప్రారంభం

- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : అమరావతి అసైన్డ్ భూముల బదలాయింపు వ్యవహారంలో సీఐడీ తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు, అప్పటి మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టులో తుది విచారణ గురువారం మొదలైంది. మొదటి రోజు చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. సీఆర్‌డీఏ చట్టం కింద తీసుకున్న చర్యల విషయంలో ప్రభుత్వం, అధికారులు, అథారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి కేసులు దాఖలుచేయడం, ప్రాసిక్యూట్ చేయడం చేయరాదన్నారు. ఆ మేరకు సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 146 ద్వారా అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు రక్షణ లభిస్తుందని అన్నారు. రాజధాని భూ సమీకరణలో అసైన్డ్ భూములను చేరుస్తూ జారీ చేసిన జీవో 41 విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అన్నారు. జీవో చట్ట విరుద్ధమైతే ప్రతిపాదనల నుంచి జీవో జారీ అయ్యేంత వరకు బాధ్యులైన అధికారులందరినీ నిందితులుగా చేర్చాల్సి ఉంటుందన్నారు. ఫిర్యాదుదారు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆయనకు సమాచారమిచ్చిన వారెవరూ ఎస్సీ, ఎస్టీలు కాదన్నారు. తదుపరి వాదనలకు సమయం లేకపోవడంతో విచారణ శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పేదలను బెదిరించి భూములు కొన్నారు..

అమరావతే రాజధాని అని ముందే తెలుసుకున్న టీడీపీ ప్రభుత్వ పెద్దలు పేద అసైన్డ్‌దారులను బెదిరించి వారి నుంచి చట్ట విరుద్ధంగా, కారు చౌకగా అసైన్డ్ భూములు కొన్నారు. ముందస్తు వ్యూహం ప్రకారం ఈ భూములను భూ సమీకరణలో చేరుస్తూ జీవో 41 జారీ చేయించుకున్నారు. అనంతరం ఆ భూములను భూ సమీకరణలో ఇచ్చి, అందుకు ప్రతిగా ప్రభుత్వం నుంచి రిటర్నబుల్ ప్లాట్లు పొందారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో వారికి జరిగిన అన్యాయాన్ని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వివరించారు. ఆయన సీఐడీకి ఫిర్యాదు చేశారు. సీఐడీ ప్రాథమిక విచారణ జరిపిన అనంతరం మాజీ సీఎం చంద్రబాబు, నారాయణపై 2021లో కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు, నారాయణ అదే ఏడాది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, నాలుగు వారాలు మాత్రమే తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఆ తర్వాత చంద్రబాబు, నారాయణ ఈ ఉత్తర్వులను పొడిగించుకుంటూ వచ్చారు. మధ్యలో వారి వ్యాజ్యాలు ఓ న్యాయమూర్తి వద్దకు రాగా, ఆయన తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు స్టే కొనసాగుతుందంటూ ఉత్తర్వులిచ్చారు. అప్పటి నుంచి తుది విచారణ జరగకుండా వారు వాయిదాలు తీసుకుంటున్నారు. గతవారం కూడా ఇలాగే వాయిదా కోరడంతో ప్రభుత్వ న్యాయవాదులు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపారు.

క్లుప్తంగా...

కృష్ణా ఉప నదుల్లో వరద ప్రారంభం

- ఆల్మట్టిలో 32.24 టీఎంసీలకు చేరిన నిల్వ

సాక్షి, అమరావతి: పశ్చిమ కనుమల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉండి వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ఉప నదుల్లోనూ వరద ప్రారంభమైంది. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి గురువారం మరింత వరద నీరు చేరింది. ఇక్కడి నీటి నిల్వ 32.24 టీఎంసీలకు చేరుకుంది. కృష్ణా ఉప నదులైన మలప్రభ, ఘటప్రభ ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరుతోంది. ఇక తుంగభద్ర డ్యామ్‌లోకి 9,536 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 12.57 టీఎంసీలకు చేరుకుంది. భీమా నుంచి మహారాష్ట్రలోని ఉజ్జయిని ప్రాజెక్టులోకి 12,925 క్యూసెక్కులు చేరుతోంది. ఎగువన ప్రాజెక్టులు నిండితే శ్రీశైలానికి కృష్ణమ్మ చేరుకోలేదు.

తెలంగాణ

28 నుంచి మావోయిస్టు అమరుల స్మారక వారం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు అమరుల స్మారక వారాన్ని నిర్వహించేందుకు మావోయిస్టులు సిద్ధమవుతున్నారు. గ్రామగ్రామాన అమరుల స్మారక వారాన్ని నిర్వహించాలని చర్ల–శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ ఒక ప్రకటనలో కోరారు. దీంతో పోలీసు శాఖ మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో సిబ్బందిని అప్రమత్తం చేసింది.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో బీసీ బిల్లు

ఖర్గేకు ఎంపీ కృష్ణయ్య వినతి

సాక్షి, న్యూఢిల్లీ : కులగణనలో జనగణన చేపట్టాలని భారత జాతీయ ప్రజాస్వామ్య సమ్మిళిత కూటమి (ఇండియా) తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అభినందించారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టే అంశాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నంద గోపాల్, రాజ్‌కుమార్, బాషయ్య తదితరులు ఖర్గేను కలిశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు , బీసీ ఉద్యోగులకు పదోన్నతుల రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ, బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై క్రీమీలేయర్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేసినట్టు పేర్కొన్నారు.

నమ్మబలికి మోసం చేశారు

- మార్గదర్శి మేనేజరే నాదగ్గరకు వచ్చి చీటీ కట్టాలని కోరారు
- సెకండ్ చార్జ్ తనఖా ద్వారా డబ్బులు ఇస్తామని నమ్మించారు
- 18 నెలలు వాయిదాలు కట్టాను
- మార్చిలో పాట పాడినా నా డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకున్నారు
- మార్గదర్శి మోసాన్ని వివరించిన బాధితుడు ముష్టి శ్రీనివాస్



సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'మార్గదర్శి యాజమాన్యం నన్ను నిలువునా ముంచేసింది. నా నుంచి 18 నెలల పాటు నెలకు రూ. లక్ష వాయిదాలుగా వసూలు చేసి పాట పాడిన డబ్బు ఇవ్వకుండా 4 నెలలు నరకయాతన చూపించారు.' అంటూ ట్యాక్స్ కన్సల్టెంట్, న్యాయవాది, మార్గదర్శి బాధితుడు ముష్టి శ్రీనివాస్ వాపోయారు. ఆయన గురువారం విజయవాడలోని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విలేకరులతో.. «మార్గదర్శి లబ్బీపేట బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ కె.శ్రీనివాసులు 2021 ఆగస్టులో నా దగ్గరకు వచ్చి మార్గదర్శిలో చిట్ వేయాలని కోరారు. అప్పటికే నా ఆస్తిని బ్యాంక్‌లో తనఖా పెట్టానని, చీటీ డబ్బులు ఇవ్వాలంటే సెకండ్ చార్జ్ తనఖా ద్వారా ఇస్తారా అని అడిగాను. ఓటీఎస్ తెచ్చుకుంటే హెడ్ ఆఫీస్‌తో మాట్లాడి చిట్ పాడుకునే అవకాశం కల్పిస్తామని ఇద్దరూ నమ్మబలికారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 18 నెలలు క్రమం తప్పకుండా వాయిదా డబ్బులు కట్టాను. 2022 డిసెంబర్ 29న బ్యాంకుతో ఓటీఎస్ ఒప్పందం చేసుకున్నాను. ఓటీఎస్ వచ్చిన వెంటనే మార్గదర్శి మేనేజర్‌కు తెలియజేసి చీటీ పాడాలని కోరాను. ఓటీఎస్ లెటర్, షూరిటీ, బ్యాంకు రసీదు, టైటిల్ డీడ్ ఫారాలు మార్గదర్శికి అందించాను. ఫిబ్రవరి నెలలో చిట్ పాడతానంటే ఆ నెల వాయిదా కట్టించుకున్నారు. ఫిబ్రవరిలో పాట ఇవ్వకుండా మోసం చేశారు. మార్చిలో పాట ఇస్తామని, పాటలో పాల్గొనే అర్హత కోసం ముందే రూ. లక్ష వాయిదాగా చెల్లించాలని చెప్పారు. ఆ డబ్బుల కోసం మా ఇంటికొచ్చారు. బార్బర్ షాపు వద్ద ఉన్నానని తెలుసుకుని అక్కడకొచ్చి మరీ డబ్బు వసూలు చేశారు. ఆ తరువాత పాట జరిగిందా.. లేదా అని అడిగినా ఎవరూ చెప్పలేదు. అదే రోజు రాత్రి 9.30 గంటలకు బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్ ఫోన్ చేసి మీకే పాట వచ్చిందని, రూ. 11.50 లక్షలకు పాడారని చెప్పారు. పాట ఇంత మొత్తానికి పాడమని వాళ్లకు నేను లెటర్ ఇవ్వలేదు. వాళ్లే పాట నిర్ణయించేశారు. నా డబ్బులు నాకివ్వమని పలుమార్లు కోరినా ఇవ్వలేదు. షూరిటీ ఫారాలు ఇవ్వలేదని ఏప్రిల్ 14న, సెంకడ్ చార్జ్‌పై నా అభిప్రాయం కోసం హెడ్ ఆఫీసుకు పంపామని 24వ తేదీన, సరైన షూరిటీలు సమర్పించ లేదని జూన్ 8న లెటర్లు పంపారు. వాటన్నింటికీ వెంటనే సమాధానం ఇచ్చాను. బ్రాంచి చుట్టూ తిరిగి తిరిగి విసుగెత్తి తుదకు నేను కట్టిన డబ్బులనైనా ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు≤ అని వివరించారు. రిజిస్ట్రార్‌ను మేనేజ్ చేసి 50 మందికి బదులు 30 మందినే గ్రూపులో రిజిస్టర్ చేశారని తెలిపారు.

ఈనాడు వితండవాదం

విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఈనాడు బృందం బాధితుడు ముష్టి శ్రీనివాస్‌తో వితండవాదానికి దిగింది. మార్గదర్శి తప్పేమీ లేదని, తప్పంతా బాధితుడు ముష్టి శ్రీనివాస్‌దేనని చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసింది. ఎన్‌పీఏపై ఈనాడు సంధించిన ప్రశ్నలకు ఏ మాత్రం జంకకుండా బాధితుడు సమాధానమిచ్చారు.. తాను డిఫాల్టర్‌ని అయితే, సరిగా వాయిదాలు కట్టకపోతే నేను పాట పాడేందుకు ఎందుకు అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. సెకండ్ చార్జ్ ద్వారా షూరిటీ తీసుకోకూడదని ఏ చట్టంలో ఉందో చెప్పాలని నిలదీశారు. దాదాపు అరగంట పాటు ప్రశ్నించినా బాధితుడు దీటుగా బదులిచ్చారు. దీంతో చేసేది లేక ఈనాడు బృందం అక్కడి నుంచి నిష్క్రమించింది.

రామోజీరావుపై చీటింగ్ కేసు

- మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్, లబ్బీపేట బ్రాంచి మేనేజర్, మరికొందరిపైనా కేసు
- మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై విజయవాడ న్యాయవాది ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మార్గదర్శి చిట్స్‌లో మోసాలపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ యజమాని చెరుకూరి రామోజీరావు, ఎండీ శైలజ కిరణ్‌తో పాటు విజయవాడ లబ్బీపేట బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్, పలువురు సిబ్బందిపై ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గురువారం చీటింగ్ సహా ఇతర సెక్షన్లతో కేసు నమోదయింది. సక్రమంగా వాయిదాలు చెల్లించినా, చిట్‌లో పాడుకొన్న నగదు ఇవ్వకుండా మార్గదర్శి యాజమాన్యం నాలుగు నెలలుగా ఇబ్బందులు పెడుతోందని బాధితుడు, న్యాయవాది ముష్టి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 409 (క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్), 420 (చీటింగ్), 120బి, సెక్షన్ 5 ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ –1999 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసు వివరాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. 64 ఏళ్ల వయసున్న బాధితుడు ముష్టి శ్రీనివాస్ టాక్స్ కన్సల్టెంట్‌గా, కొన్ని కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా పని చేస్తున్నారు. 2021 సెప్టెంబర్‌లో మార్గదర్శి లబ్బీపేట బ్రాంచ్‌లో చిట్ వేశారు. 50 నెలల పాటు నెలకు రూ. లక్ష చిట్‌లో పాల్గొన్నారు. 19 నెలలు (రూ.19 లక్షలు) చిట్ నగదు సక్రమంగానే చెల్లించారు. ఈ ఏడాది మార్చిలో కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 37.50 లక్షలకు చిట్ పాడారు. అయితే, ఆయన చెల్లించాల్సిన నగదును మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఇప్పటివరకు చెల్లించకపోవడంతో బాధితుడు తమను ఆశ్రయించినట్లు రాణా తెలిపారు. ఒక్కో గ్రూపునకు ఒక్కో బ్యాంక్ ఖాతా ఉండాల్సి ఉండగా, బ్రాంచ్‌లో ఒకే బ్యాంక్ ఖాతాను అన్ని గ్రూపులకు వినియోగిస్తూ, డిపాజిట్లు సేకరిస్తూ మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన ఫిర్యాదు మేరకు రామోజీరావు, ఎండీ శైలజ కిరణ్, లబ్బీపేట బ్రాంచ్ మేనేజర్, పలువురు ఉద్యోగులపై కేసులు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్‌ను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మరికొందరు ఉద్యోగులు, సిబ్బందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు.

జిల్లా వార్తలు

మాదక ద్రవ్యాల రవాణా నిరోధించాలి

- ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- రేంజ్ పరిధిలో ఎస్పీ, డీఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్


మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిరోధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని, నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా శ్రద్ధ చూపాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేస్తూ కేసుల్లో నిందితులకు కచ్చితంగా శిక్షలు విధిస్తేనే భయం వస్తుందని, చట్టాలపై గౌరవం ఏర్పడుతుందనే ప్రభుత్వ ఉద్దేశాన్ని అమలు చేసేలా పోలీస్ అధికారులు కేసులపై చొరవ చూపాలని డీఐజీ చెప్పారు. ఆయా కేసుల్లో తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గతంలో ఎస్‌డీపీఎస్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన క్రాంతి ప్రసాద్, ప్రముఖ న్యాయవాది సూర్యనారాయణతో ప్రస్తుతం మారుతున్న చట్టాలకు అనుగుణంగా నేరస్తులపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, శిక్షలు పడేలా చార్జిషీట్ల దాఖలు వంటి అంశాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డి.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్, అంబేడ్కర్ కోనసీమ ఎస్పీ శ్రీధర్, తూర్పు గోదావరి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి, పశ్చిమ గోదావరి ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, కృష్ణా జిల్లా ఎస్పీ పిల్లి జాషువా, ఏలూరు జిల్లా ఎస్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, న్యాయ సలహాదారు కె.గోపాలకృష్ణ, డీసీఆర్‌బీ సిబ్బంది ఉన్నారు.

వైద్య సీట్లపై దుష్ప్రచారం తగదు

వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని కొత్త వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల విషయంలో దుష్ప్రచారం తగదని వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. అసలు వైద్య రంగంపై ఏ మాత్రం అవగాహన లేని వారు, ప్రతిపక్షాల భజనపరులతో అడ్డగోలుగా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఒక్క కొత్త వైద్య కళాశాల ఏర్పాటు చేయలేదని గ్రహించాలన్నారు. కానీ వైద్య విద్యకు పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టడమే కాకుండా, ఈ ఏడాది నుంచి ఐదు వైద్య కళాశాలల్లో అడ్మిషన్లకు అనుమతి పొందారన్నారు. వైద్యం రంగంలో పురోగతిని ఓర్వలేక విమర్శలు చేస్తున్నట్టుందన్నారు. రాష్ట్రంలో ఎవరు పెత్తందారో, పెత్తందారులకు కొమ్ము కాసేది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. మంచి చేసే వారిపై విషం చిమ్మటమే ప్రతిపక్షాలు, పచ్చ పత్రికలు పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. పారదర్శక పాలన చేస్తూ అన్ని వర్గాలకు విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విమర్శించే వారు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టండి

కలెక్టర్ రాజాబాబు


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు, జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రక్తహీనత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కిశోర బాలికలు, గర్భిణులకు తగిన పోషకాహారం అందించాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, జగనన్న శాశ్వత భూహక్కు, ఉపాధిహామీ పథకం తదితర అంశాలపై సమీక్షించారు. రాజాబాబు మాట్లాడుతూ ఈ అంశాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుని పురోగతి సాధించనున్నట్లు చెప్పారు. అనంతరం సంబంధితశాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. 10 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు కలిగిన 92 మంది కిశోర బాలికలు తీవ్రత రక్తహీనతతో బాధపడుతున్నారని వారికి కావాల్సిన ఐరన్ మాత్రలతో పాటు పోషకాహారాన్ని అందించాలని సూచించారు. రీ–సర్వేకు సంబంధించి ఫైనల్ ఆర్‌వోఆర్‌తో పాటు స్టోన్ ప్లాంటేషన్ ఏకకాలంలో జరుగుతూ ఉండాలని తెలిపారు. రెండోదశలో రీ–సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రాధాన్యత భవనాలను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను మంజూరు చేయాలన్నారు. జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని సూచించారు. జేసీ అపరాజితసింగ్, డీఈవో తాహెరాసుల్తానా, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, కెఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ డి.శివనారాయణరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ


సారె సమర్పిస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ కనకదుర్గమ్మకు గురువారం పలువురు భక్తులు, పాలక మండలి సభ్యులు సారె సమర్పించారు. ఆలయ పాలక మండలి సభ్యులు చింతా సింహచలం, టి.వేదకుమారిలతో పాటు టీటీడీ టెక్నికల్ అడ్వయిజర్ నాగం అమర్, మేనేజర్ సందీప్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. దుర్గగుడి ఛైర్మన్ రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణలంకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వర్గపురి 5వ రోడ్డులో నివాసం ఉంటున్న మహమ్మద్ రియాజ్ (28) సీలింగ్ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య మహ్మమ్మద్ రహీమున్నీసా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రియాజ్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. రోజు మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. మూడు రోజుల క్రితం వారి ఇంట్లో ఫ్యాన్ మరమ్మతుకు గురవడంతో రహీమున్నీసా తన ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని ఆదే రోడ్డులోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం రిజాయ్ మద్యం తాగి భార్య దగ్గరకు వెళ్లడంతో గొడవ జరిగింది. గురువారం మృతుడు పనిచేసే మేస్త్రీ పనికి పిలిచేందుకు అతని ఇంటి వద్దకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే రియాజ్ భార్యకు చెప్పగా అమె వెళ్లి చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాల సేకరించారు. మృతుడి భార్య రహీమున్నీసా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ ఉత్వర్తుల మేరకు ఈ నెల 21వ తేదీన ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో ఉదయం 11 గంటలకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తారు. జిల్లాలోని ఆయాశాఖల ఉద్యోగులు వారి సమస్యలను అధికారులకు తెలియపరిచి పరిష్కరించుకోవాలని సూచించారు.

కోడి పందేల శిబిరంపై సెబ్ దాడి

74 మంది జూదరులు అరెస్ట్

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరం మండలంలోని సూరంపల్లి శివారు మామిడితోటలో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న కోడిపందేల శిబిరంపై గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), గన్నవరం పోలీసులు సంయుక్తంగా దాడిచేసి 74 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నున్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పెద్ద కర్మను పురస్కరించుకుని మామిడి తోటలో భారీగా కోడి పందేలు ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు శిబిరంపై ఆకస్మికంగా దాడి చేశారు. కోడి పందేలు వేస్తున్న 74 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 10.98 లక్షల నగదు, ఎనిమిది కార్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జూదరులను గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన జూదరులు భీమవరం, విజయవాడ, నూజివీడు, గన్నవరం, గుంటూరు ప్రాంతాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కేసులు నమోదు చేసినట్లు సీఐ పి. కనకారావు తెలిపారు.

నా అనే వాళ్లు లేక.. నడి రోడ్డుపై విగత జీవిగా..


రోడ్డుపై మనోజ్‌కుమార్ మృతదేహం వద్ద కన్నీరు మున్నీరవుతున్న అనిత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నా అనే వాళ్లు చుట్టూ నలుగురు ఉండాలని.... కష్టమొచ్చినా... ఆపద వచ్చినా ఆదుకునే వారిని సంపాదించుకోవాలని పెద్దలంటారు.. కానీ కష్టకాలంలో కనీసం ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు సైతం నలుగురు మనుషులు సాయం రాని పరిస్థితి ఆ మహిళకు వచ్చింది. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ హృదయ విదారక ఘటన మనసును చలింపచేస్తుంది.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన బాటుకొల్లు అనిత చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేసింది. అక్కడే ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకోగా ఇద్దరు పిల్లలు కలిగారు. కొంత కాలం కిందట భర్త చనిపోవడంతో విజయవాడ చేరిన అనిత శ్రీనివాసమహల్ కొండ ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉండేది. కాశేశ్వరరావు మార్కెట్ వద్ద పనికి వెళ్లిన సమయంలో అక్కడ మంద మనోజ్‌కుమార్ పరిచయం కావడంతో అతనితో సహజీవనం సాగిస్తోంది. మనోజ్ కుమార్ సైతం చిన్న వయస్సులోనే చిత్తూరు జిల్లా నుంచి వలస వచ్చి ఒక్కడే విజయవాడలో ఉంటున్నాడు. హోటల్స్‌లో పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటాడు. మనోజ్‌కుమార్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన మనోజ్‌కుమార్ అర్ధరాత్రి వరకు మద్యం తాగుతూనే ఉన్నాడు. తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో మనోజ్‌కుమార్ చాతిలో నొప్పిగా ఉందని అనితతో చెప్పి కుప్పకూలిపోయాడు. దీంతో అనిత ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పడింది. వారి ఇంటి పక్కనే ఉండే మల్లికార్జున అనే వ్యక్తిని పిలిచింది. మనోజ్‌కుమార్‌ను చూసిన మల్లికార్జున వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లమని చెప్పి తన ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో ఏం చేయాలో అర్థంకాక నా అనే వాళ్లు లేకపోవడంతో ఉదయం వరకు ఇంట్లో అలాగే ఉండిపోయింది. ఉదయం నలుగురు వ్యక్తులను డబ్బులకు మాట్లాడుకుని మనోజ్‌కుమార్‌ను కొండ కిందకు దింపారు. ఆ తర్వాత వచ్చిన వారిలో ముగ్గురితో కలిసి ఆటోలో ప్రభుత్వాసుపత్రికి బయలుదేరారు. అయితే అప్పటికే మనోజ్‌కుమార్ (45) ప్రాణాలు పోవడంతో ఆటో నడిపే వ్యక్తి ఈ విషయాన్ని గమనించాడు. పంజా సెంటర్ దాటిన తర్వాత బస్టాప్ వద్దకు వచ్చే సరికి ఆటో డ్రైవర్ మనోజ్‌కుమార్‌ను కిందికు దింపేసి వెళ్లిపోయాడు. నడి రోడ్డు, చుట్టూ జనం ఉన్నా నా అనే వారు లేక.. ఏం జరిగిందో... ఎవరికి చెప్పాలో అర్థం కాకపోవడంతో అనిత ఆందోళన చెందింది. మృతదేహం చుట్టూ చేరిన వారు తలా ఓ మాట మాట్లాడటంతో ఘటనపై పోలీసులకు సమాచారం అందింది. బాధితురాలి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్‌పర్సన్‌గా విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయ సాయిరెడ్డి మరోసారి నియమితులయ్యారు. ఈ విషయాన్ని రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ గురువారం రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయ సాయిరెడ్డితోపాటు పీటీ ఉష (నామినేటెడ్), ఫాంగ్నోన్ కొన్యాక్ (బీజేపీ), సులతా దేవ్ (బీజేడీ), ఫౌజియా ఖాన్ (ఎన్‌సీపీ), ఘన శ్యాం తివారి (బీజేపీ), ఎల్.హనుమంతయ్య (కాంగ్రెస్), సుఖేందు శేఖర్‌రాయ్ (టీఎంసీ)లను ప్యానెల్ వైస్ చైర్‌పర్సన్లుగా నియమిస్తున్నట్టు రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గురువారం వెల్లడించారు. ఈ పునర్‌నియామకం జూలై 17 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

'ఏపీ హైకోర్టులో 9 జడ్జి పోస్టులు ఖాళీ'

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఈ నెల 1వ తేదీ నాటికి మంజూరైన 37 మంది న్యాయమూర్తులకుగాను, 28 మంది న్యాయమూర్తులు పని చేస్తున్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో తెలిపారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టులో 9 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. కాగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 8 ప్రతిపాదనలు ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం వద్ద వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని.. ఇంకా, హైకోర్టులో మిగిలిన 1 న్యాయమూర్తి స్థానం భర్తీకి సంబంధించి హైకోర్టు కొలీజియం నుంచి సిఫార్సులు ఇంకా అందలేదని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

27 నుంచి విద్యుత్ ఉద్యోగుల నిరసన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఆందోళన బాట పట్టనున్నారు. పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ) అమలుతో పాటు, పలు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27 నుంచి దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, జెన్‌కో ఎండీ, డిస్కంల సీఎండీలకు ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ గురువారం నోటీసిచ్చింది. పీఆర్‌సీపై నిర్ణయం తీసుకోవడం తదితర 12 డిమాండ్లను నెరవేర్చుకోవడం కోసం ఈ ఆందోళన చేపడుతున్నట్లు జేఏసీ పేర్కొంది. ఆగస్ట్ 10 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వెల్లడించింది.

కొత్త మెడికల్ కాలేజీల్లో సగం సీట్లు మెరిట్‌కే

మంత్రి విడదల రజిని



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం వైద్య విద్యపై ఈనాడు ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ నాయకుడు కనీసం ఆలోచించని విధంగా సీఎం వైఎస్ జగన్ ఒకేసారి 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు నడుం బిగించారని గుర్తు చేశారు. ఐదు మెడికల్ కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుందన్నారు. కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లు కన్వీనర్ కోటా కిందే ఉంటాయని, ఈ సీట్లు మెరిట్ విద్యార్థులకు ఉచితంగానే లభిస్తాయన్నారు. అయినా ఈనాడు దుష్ప్రచారానికి ఒడిగట్టిందని దుయ్యబట్టారు. నూతన వైద్య కళాశాలల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఒక విధానాన్ని నిర్దేశించుకుందని, ఆ ప్రకారమే ఆయా కాలేజీలు పనిచేస్తాయన్నారు.

సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు అవసరమే

రిటైర్డ్ అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ విఠల్‌రావు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో కొన్ని సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఏర్పాటు చేయడం అవసరమేనని రిటైర్డ్ అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు అన్నారు. అప్పుడే కొత్త వైద్య కళాశాలలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఆయన గురువారం విజయవాడలో సాక్షితో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒకేసారి 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం ఒక చరిత్ర అన్నారు. వైద్య కళాశాల ఏర్పాటు చేయడమంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయమని, భవనాలు, మౌలిక సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది నియామకం వంటి వాటికి రూ. వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. కాబట్టి కొత్త వైద్య కళాశాలల్లో కొన్ని సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వాన్ని తప్పుపట్టడం సమంజసం కాదన్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు జరుపుతున్న ఐదు కళాశాలల్లో మంజూరైన 750 సీట్లులో 15 శాతం నేషనల్ పూల్‌కి పోగా, మిగిలిన వాటిలో 50 శాతం జనరల్ కేటగిరీలో భర్తీ చేస్తూ, 35 శాతం బి-కేటగిరి, 15 శాతం ఎన్ఆర్ఐ కోటాకి కేటాయిస్తే తప్పేముందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నష్టపోతారని అనడం సరైంది కాదని, గతేడాది కంటే ఈ ఏడాది కొత్త సీట్లు వచ్చాయన్న విషయం తెలుసుకోవాలన్నారు.

మీ ఓటు ఉందా?.. చెక్ చేసుకోండి

నేటి నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన



సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాలో మీ ఓటు ఉందా? ఒకసారి పరిశీలించుకోండి. ఓటు లేకపోతే తక్షణం నమోదు చేయించుకోండి. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా రూపకల్పనకు శుక్రవారం శ్రీకారం చుడుతోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా శుక్రవారం నుంచి వచ్చే నెల 21 వరకు అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) నెల రోజుల పాటు ఈ కార్యక్రమం చేపడతారు. ఓటర్ల జాబితాను పరిశీలించి సవరణలు చేస్తారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకొని బీఎల్‌వోలతో కలిసి ఓటర్ల పరిశీలనలో పాల్గొంటాయి. ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత ఆగస్టు 22 నుంచి రాజకీయ పార్టీల సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేస్తారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 30కి పూర్తి చేసి అక్టోబరు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. నవంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. శనివారం, ఆదివారం అయిన అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు బూత్ స్థాయిల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. డిసెంబరు 26 కల్లా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 5న తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి

రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో వీటి నమోదుపై ఎన్నికల సంఘం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. రాష్ట్ర జనాభా ప్రకారం 18 నుంచి 19 ఏళ్లు ఉన్న ఓటర్లు కనీసం 12 లక్షలు ఉండాలి. కానీ 3.50 లక్షల ఓటర్లు మాత్రమే నమోదయ్యారు. 2024 జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండే వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉండటంతో వీరి నమోదుపైనా దృష్టి సారిస్తున్నారు. వీరు ఫారం 6ను వినియోగించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. చనిపోయిన వారు, వేరే రాష్ట్రాలకు వెళ్లిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి ఫారం 7ను వినియోగించుకోవాలి. చిరునామా, నియోజకవర్గం మార్చుకోవడానికి ఫారం 8 ఇవ్వాలి. ప్రవాసాంధ్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఫారం 6 ఏను ఇవ్వాలి.

పరిశీలనకు తీసుకొనే అంశాలు

- ఓటరు జాబితాలో ఒకే వ్యక్తి రెండు మూడు చోట్ల ఓటు కలిగి ఉంటే వారి అభీష్టం మేరకు ఒక చోట ఉంచి మిగిలిన ఓట్లను తొలగిస్తారు.
- నకిలీ ఓట్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, వందేళ్ల వయస్సు పైబడిన వారిని గుర్తిస్తారు.
- డోర్ నంబర్లు లేకుండా ఉన్నా, ఒకే డోర్ నంబరుపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లను పరిశీలిస్తారు.
- ఇంటి నంబరు లేనివి, ఒకే ఇంటి నంబరు, వీధి పేరుపై వందలాది ఓట్లు ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరిస్తారు.
- దీర్ఘ కాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఒక్క ప్రాంతంలోనే ఉంచుతారు
- ఒక బూత్‌లో సరాసరి 1,500 ఓట్లకు మించి ఉంటే కొత్త బూత్ సిఫారసు చేస్తారు.

దొంగ ఓట్ల దొంగ బాబే!

2019 ఎన్నికల్లో గెలవడానికి అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఇవ్వని హామీలేదు. అయినా నమ్మకం కుదరక ఇష్టానుసారంగా దొంగ ఓట్లు నమోదు చేయించారు. ఒకే ఇంట్లో 40–50 మొదలు.. ఏకంగా 600–700 ఓట్ల వరకు గంపగుత్తగా ఓట్లు ఉన్నట్లు సృష్టించారు. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రభంజనం ముందు తట్టుకోలేక తల వంచారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో నాటి లీలలు ఒక్కటొక్కటిగా బయట పడుతుంటే ఉలిక్కిపడుతున్నారు. గంపగుత్తగా ఉన్న దొంగ ఓట్లను ప్రభుత్వం గుర్తించి తొలగిస్తుంటే బెంబేలెత్తిపోతున్నారు. విచారించగా ఆ దొంగ ఓట్లన్నీ నాటి బాబు పాలనలో రికార్డుల్లోకి ఎక్కినవేనని స్పష్టమవుతోంది. ఇలాగైతే ప్రజల్లో ఇంకా చులకనవుతానని భావించి ఎల్లో మీడియాను రంగంలోకి దింపారు. తను చేసిన తప్పును ప్రస్తుత ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై వేసి.. తప్పించుకునేందుకు యత్నిస్తున్నారు. రోజుకో రీతిన తప్పుడు కథనాలు వండి వార్చుతూ ప్రజలను తప్పుదోవ పట్టించి, రాజకీయంగా లబ్ధి పొందాలని వ్యూహం పన్నారు. ఇది కూడా బెడిసి కొడుతోంది. బాబు తీరు చూస్తుంటే దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుంది.

ప్రతి వారం రాజకీయ పక్షాలకు ఓటర్ల జాబితా సమాచారం: ముఖేష్ కుమార్ మీనా



ఓటర్ల జాబితా సవరణ సమాచారాన్ని నియోజకవర్గ స్థాయిలో ప్రతి వారం రాజకీయ పక్షాలకు అందిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. గురువారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఓటరు దరఖాస్తుల పరిష్కారం, ఈఆర్‌వోలు, బీఎల్‌వోల పాత్రను వివరించారు. ప్రతి వారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాను నియోజకవర్గ స్థాయిలో ఈఆర్‌వోలు రాజకీయ పార్టీలకు అందిస్తారని, దానినే సీఈవో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. ఇంటింటి సర్వే సమయంలో బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్‌వోలతో కలిసి వెళ్లవచ్చన్నారు. ఇంటింటి సందర్శనల షెడ్యూల్‌ను జిల్లా స్థాయిలో అందిస్తామన్నారు. బీఎల్‌వోలు ఇప్పటివరకు ఉన్న సమాచారాన్ని పార్టీల ప్రతినిధులతో పంచుకుంటారని తెలిపారు. పోలింగ్ స్టేషన్లపై సమస్యలు ఉంటే పార్టీలు జిల్లా ఎన్నికల అధికారికి తెలపాలని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణపై పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. బీఎల్‌వో పరిశీలనలో వలంటీర్లను దూరంగా ఉంచాలని టీడీపీ కోరగా, దీనిపై ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నాయని మీనా తెలిపారు. ఓటర్ల జాబితాను తెలుగులో అందించాలని సీపీఎం కోరింది. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు హేమంత్ కుమార్ (బీజేపీ), వెంకటేశ్వరరావు, జయరాం (సీపీఎం), వి.గురునాథం, వి.శ్రీనివాసరావు (కాంగ్రెస్) వర్ల రామయ్య, కోనేరు సురేష్ (టీడీపీ), ఏఎస్ఎన్ మూర్తి (వైఎస్సార్‌సీపీ) పాల్గొన్నారు.

ఏపీ విద్యా సంస్కరణలపై ఐరాసలో ప్రశంసలు

- మన డిజిటల్ బోధనను కొనియాడిన విదేశీ ప్రతినిధులు
- ఇంగ్లిష్ బోధన అమలుపై విద్యావేత్తల అభినందనలు
- ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ షకిన్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలపై ఐక్యరాజ్యసమితి (యూఎన్‌వో) సదస్సులో విదేశీ ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో సుస్థిరాభివృద్ధిపై ఈ నెల 10 నుంచి జరుగుతున్న ఉన్నత స్థాయి రాజకీయ సదస్సు బుధవారం ముగిసింది. యూఎన్‌వోలో ప్రధాన భాగమైన ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి 140 దేశాలు హాజరయ్యాయి. ఉన్నత విద్యలో ఎదురయ్యే సవాళ్లు, అవకాశాలపై లోతైన అవగాహన కల్పించడమే లక్ష్యంగా చివరి రోజు బుధవారం సదస్సు జరిగింది. ఇందులో కరోనా అనంతరం ప్రపంచ దేశాలు వేగంగా కోలుకుని 2030 నాటికి సాధించాల్సిన అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారని యూఎన్‌వో స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ తెలిపారు. విద్యలో అసమానతలను తొలగించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'నాడు–నేడు' ప్రభావవంతమైన విధానంగా నిలిచిందని ఐరాస దృష్టికి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పలు దేశాల ప్రతినిధులు, విద్యావేత్తలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంస్కరణలు, డిజిటలైజేషన్ విధానాన్ని కొనియాడారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు అమలు చేస్తున్న ఇంగ్లిష్ బోధనపై ప్రశంసలు కురిపించారన్నారు. లింగవివక్ష నిర్మూలన, బాలికా విద్యకు ఇస్తున్న ప్రోత్సాహంపై ఏపీ ప్రభుత్వ సంస్కరణలను గ్లోబల్ ఫోరమ్ ప్రతినిధులు మెచ్చుకున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థికి విజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు సీఎం జగన్ తీసుకున్న చర్యలు ప్రపంచ దేశాల ప్రతినిధులను ఆకట్టుకున్నాయని షకిన్ కుమార్ వివరించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఆంధ్ర తీరంలో బాథిమెట్రిక్ సర్వే

- ప్రకృతి వైపరీత్యాల నిర్వహణలో కీలకం కానున్న సమాచారం
- రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సముద్రతీరంలో లోతు తక్కువ జలాలు ఉన్న ప్రాంతాలను నిర్ధారించేందుకు బాథిమెట్రిక్ సర్వే నిర్వహించినట్లు భూవిజ్ఞానశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం నుంచి ఒడిశా రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న సముద్రతీరంలో అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ సర్వే చేసినట్లు చెప్పారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయ సాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారంతో సముద్రగర్భం స్వరూప, స్వభావాలతోపాటు తీరంలో సంభవించే వరదలు, వరద ముంపు శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఈ సర్వే ద్వారా లభించే డేటా సముద్రతీర ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు నిర్మించేందుకు, సురక్షిత బీచ్ ల్యాండింగ్‌కు అనువైన ప్రదేశాలు గుర్తించేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. బాథిమెట్రిక్ సర్వే డేటాను మత్స్యసంపదను వేటాడటానికి వినియోగించే డేటాతో అనుసంధానించి సముద్రతీరంలో ఇసుకమేటల స్వరూపాన్ని, అవక్షేపం ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చని చెప్పారు. లోతుతక్కువ జలాల్లో సముద్రగర్భం స్వరూపాన్ని అర్థం చేసుకుని సునామీలు, తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కోవడానికి ఈ డేటా ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు.

ఏపీలో మూడేళ్లుగా వన్యప్రాణి ఆవాసాల అభివృద్ధికి నిధులివ్వలేదు



ఏపీలో వన్యప్రాణి ఆవాసాల అభివృద్ధికి మూడేళ్లుగా నిధులివ్వలేదని కేంద్ర అటవీశాఖ సహాయమంత్రి అశ్వినీకుమార్ చౌబే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. డెవలప్‌మెంట్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ హ్యాబిటేట్స్ కింద ఆర్థికసాయం నిమిత్తం తీవ్రంగా అంతరించిపోతున్న 22 జాతుల్ని గుర్తించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తాబేలు, జెర్డాన్స్ కోర్సర్, గ్రేట్ ఇండియన్‌బస్టర్డ్, డాల్ఫిన్లు రిపోర్టు అయినట్లు తెలిపారు. 2020–21 నుంచి 2022–23 వరకు వన్యప్రాణి ఆవాసాల అభివృద్ధికి నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

సింహాచలం ఆలయానికి నిధులు విడుదల చేయలేదు



ప్రసాద్ పథకంలో భాగంగా సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో తీర్థయాత్ర సౌకర్యాల అభివృద్ధి ప్రాజెక్టుకు ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.54.04 కోట్ల వ్యయ అంచనాతో 2022లో ఈ ప్రాజెక్టును అనుమతించామని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

ఏపీలో స్మార్ట్‌సిటీలకు రూ.2,726.43 కోట్ల వ్యయం






ఆంధ్రప్రదేశ్‌లోని స్మార్ట్‌సిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3,538 కోట్లు విడుదల చేయగా రూ.2,726.43 కోట్లు వినియోగించినట్లు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. లోక్‌సభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు పి.వి.మిథున్‌రెడ్డి, గొడ్డేటి మాధవి, మద్దిళ్ల గురుమూర్తి, ఎం.వి.వి.సత్యనారాయణ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా కాకినాడ, విశాఖపట్నం (రౌండ్–1), తిరుపతి (రౌండ్–2), అమరావతి (రౌండ్–3) ఎంపికచేసి అభివృద్ధి చేసినట్లు వివరించారు.

ఎంఆర్‌వో బిడ్లు ఇంకా రాలేదు



తిరుపతి విమానాశ్రయంలో రెండు మెయింటెనెన్స్,, రిపెయిర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) స్టేషన్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించామని కేంద్ర పౌరవిమానయానశాఖ సహాయమంత్రి వి.కె.సింగ్ తెలిపారు. వాటి నిర్మాణానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బిడ్లు ఆహ్వానించగా ఇప్పటివరకు రాలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, మద్దిళ్ల గురుమూర్తి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

విశాఖ నుంచి సీఫుడ్ రవాణా



క్రిషి ఉడాన్ పథకంలో భాగంగా విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సీఫుడ్ రవాణా చేస్తున్నట్లు పౌర విమానయానశాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2020–21లో 905 విమానాల్లో 596 మెట్రిక్ టన్నులు, 2021–22లో 618 విమానాల్లో 352 మెట్రిక్ టన్నుల సీఫుడ్ కోల్‌కతా మీదుగా ఆసియా దేశాలకు రవాణా అయినట్లు చెప్పారు.

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు సెప్టెంబర్ కల్లా పూర్తి



విశాఖపట్నం రిఫైనరీలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఏర్పాటు చేయనున్న 370 టీపీఏ ఎలక్ట్రోలైజర్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు సెప్టెంబర్ కల్లా పూర్తవుతుందని కేంద్ర పెట్రోలియం, సహజవనరులశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి చెప్పారు. దీనికి రూ.33 కోట్లు కేటాయించిన హెచ్‌పీసీఎల్ ఇప్పటివరకు రూ.11 కోట్లు ఖర్చుచేసిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు జవాబిచ్చారు.

పెత్తందారులకు 'ప్రైవేట్' జబ్బు!

వైద్య విద్యను వ్యాపారంగా మార్చిన చంద్రబాబు • కొమ్ము కాసింది.. ఫిలింసిటీ జమీందారే

- చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రైవేట్ మెడికల్ కాలేజీలను ప్రోత్సహించి జేబులు నింపుకొనేందుకే తపించారు. ఒక్కటైనా ప్రభుత్వ వైద్య కళాశాలను నెలకొల్పలేదు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాలికి వదిలేశారు. మన విద్యార్థులు వైద్య విద్య కోసం ఖండాతరాలు దాటి వెళ్తుంటే నాడు రాజ గురివింద నోరెత్తిన పాపాన పోలేదు!!
- ఇప్పుడు వైద్య రంగం బలం పుంజుకుంది. దాదాపు రూ.9 వేల కోట్ల వ్యయంతో కొత్తగా 17 వైద్య కళాశాలలు సమకూరుతున్నాయి. మన విద్యార్థులకు వైద్య విద్య చదివే అవకాశాలు పెరిగాయి. సామాన్యుడికి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు మరింత మెరుగ్గా అన్ని చోట్లా అందుబాటులోకి వస్తాయి. దీంతో గుండెలదిరిన ఫిలింసిటీ పెత్తందారు యథాప్రకారం చంద్రబాబుకు కొమ్ము కాసేందుకు ఆరాటపడ్డారు!!

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీ నిర్వహణ ఆషామాషీ కాదు! వసతులు, సిబ్బంది విషయంలో తేడావస్తే ఆ ప్రభావం సీట్ల సంఖ్యపై పడుతుంది! వాటిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్వహించాలనే సదుద్దేశంతో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల విధానాన్ని తెస్తుంటే వైద్య రంగాన్ని తెగనమ్మేస్తున్నట్లు రామోజీ కన్నీళ్లు కార్చారు! ఈ ఏడాది మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, విజయనగరం, నంద్యాలలో ఐదు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయి. ఒక్కోదానిలో 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా సమకూరాయి. ఒక్కో వైద్య కళాశాలకు బోధన, నర్సింగ్, పారామెడికల్, ఇతర సహాయ సిబ్బందితో కలిపి 1,013 మంది ఉద్యోగులు అవసరం. కళాశాల నిర్వహణకు ఏటా రూ.225 కోట్లు కావాలి. మొత్తంగా 17 మెడికల్ కాలేజీల కోసం ఏడాదికి రూ.3,825 కోట్లు వ్యయం అవుతుంది. ప్రభుత్వం కట్టేవేమీ కామినేని, నారాయణ మెడికల్ కాలేజీలు కావు! కొత్త కాలేజీల్లో యాభై శాతం సీట్లు జనరల్ కేటగిరీలోనే ఉంటాయి. మిగిలినవి మాత్రమే బీ, సీ కేటగిరీల్లోకి వెళ్తాయి. అయినా ఆ డబ్బేమీ ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్లదు. పలు కేటగిరీల ద్వారా వచ్చే డబ్బు ఆయా కాలేజీలకే చెందుతుంది. వాటితో సంబంధిత మెడికల్ కాలేజీ బాగోగులను చూసుకుంటూ సమర్థంగా నిర్వహిస్తారు. అంతిమంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అదనంగా అందుబాటులోకి వస్తాయి.

- ఈ ఏడాది కొత్తగా వచ్చే ఐదు కాలేజీల్లో 113 సీట్లు (15 శాతం) ఆల్ ఇండియా కోటాలో భర్తీ అవుతాయి. మిగిలిన 637 సీట్లలో 319 సీట్లను (50 శాతం) జనరల్ కోటాలో భర్తీ చేస్తారు. 35 శాతం అంటే 223 సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో, 15 శాతం అంటే 95 సీట్లను ఎన్నారై కోటా కింద భర్తీ చేస్తారు. కేవలం కొత్త కళాశాలలకే ఈ విధానాన్ని వర్తింపచేస్తున్నారు.
- ఇప్పటివరకు ఉన్న 12 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 2,360 సీట్లు ఉండగా కొత్తగా ఏర్పాటయ్యే 17 కాలేజీల ద్వారా మరో 2,550 సీట్లు పెరుగుతాయి. అంటే రెట్టింపు దాటి పెరుగుతున్నాయి. ప్రభుత్వ రంగంలో 29 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రావడం ద్వారా ఎంబీబీఎస్ సీట్లు ఏకంగా 4,910కి పెరుగుతాయి. అప్పుడు మన విద్యార్థులకు మంచి జరుగుతున్నట్లే కదా?

వైద్య రంగంలో నాడు–నేడు

కార్యక్రమం	నిధులు (రూ.కోట్లలో)
పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్	50
సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల బలోపేతం	1,223.28
ఏ) కడప క్యాన్సర్ ఆస్పత్రి బి) కడప మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూషన్ సి) కడప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి	272
17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు	8,480
వైద్య కళాశాలలు, ఆస్పత్రుల బలోపేతం	3,820
గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు	246
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	1,692
వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు	374.61
పీహెచ్‌సీల బలోపేతం	664.96
మొత్తం	16,822.85

ప్రభుత్వ వైద్యం బలోపేతం ఇలా

- నాలుగేళ్లలో ఏకంగా దాదాపు 51 వేల వైద్య పోస్టుల భర్తీ. ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసేలా ఆదేశాలు. వైద్య శాఖలో పోస్టుల భర్తీ కోసమే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు.
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే సేవలు.
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు. నెలకు 2 సార్లు గ్రామాలకు పీహెచ్‌సీ వైద్యులు. ఇప్పటివరకూ 1.70 కోట్లమందికి సొంతూళ్లలోనే వైద్యం.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి 3,257కి పెంపు. 40 లక్షల మందికి ఉచిత వైద్యం కోసం రూ.8 వేల కోట్ల వ్యయం. వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి చెల్లింపు. ఇప్పటివరకూ 17.25 లక్షల మందికి రూ.1,074.69 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం.
- 108, 104 అంబులెన్స్‌ల సేవలు బలోపేతం. కొత్తగా 768 అంబులెన్స్‌ల సేవలు అందుబాటులోకి. 2020 జూలై నుంచి 33.35 లక్షలకు పైగా అత్యవసర కేసుల్లో సేవలందించిన అంబులెన్స్‌లు.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీఎంపీ, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు.

ఇసుకలో బురద తవ్వకాలు!

కుట్రపూరిత కథనాలతో నిత్యం విషం చిమ్ముతున్న రామోజీ

సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ.. రాష్ట్రంలో ఇసుక దొరకట్లేదు, పనుల్లేక కార్మికులు అల్లాడుతున్నారంటూ కన్నీళ్లు కార్చిన ఆషాఢభూతి లాంటి ఓ పెత్తందారుడు ఇప్పుడిక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోందంటూ కొత్త రాగం అందుకున్నాడు! వర్షాకాలం బురదతో పోటీపడి మరీ వరుస కథనాలను అచ్చేసి మురిసిపోతున్నాడు!!

డిమాండ్‌కు అనుగుణంగానే..

రాష్ట్రంలో ఇసుక కొరత తలెత్తి నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోవాలి! పెద్ద ఎత్తున జరుగుతున్న పేదల ఇళ్ల నిర్మాణాలు ఆగిపోవాలి. అభివృద్ధి పనులను అడ్డుకుని ప్రభుత్వంపై వ్యతిరేకత సృష్టించాలి!! ఇదీ ఈనాడు ప్రణాళిక! అందులో భాగమే ఇసుక రీచ్‌లపై అబద్ధాలను పోగేసి నిత్యం తప్పుడు కథనాలను ప్రచురిస్తోంది. ఏటా రాష్ట్రంలో 2 కోట్ల టన్నుల ఇసుక వినియోగం నమోదవుతోంది. అందుకు అనుగుణంగానే తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎక్కడా ఇసుక కొరత లేదు. వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగానే డిపోల్లో నిల్వలను అందుబాటులో ఉంచుతున్నారు. పక్క రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా ప్రభుత్వం జీవో 71 జారీ చేయడమే కాకుండా పక్కాగా అమలు చేస్తోంది.

పక్కా పారదర్శక విధానాలు

ఇప్పుడు పారదర్శక ఇసుక విధానంతో ఏటా రూ.760 కోట్ల ఆదాయం లభిస్తోంది. టన్ను ఇసుకను రూ.475కి విక్రయిస్తుండగా రూ.375 ప్రభుత్వానికి రాయల్టీగా వస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ రేటుకు అమ్మేందుకు వీలులేదు. ఇసుక రీచ్‌లు, డిపోల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే రవాణా ఖర్చులు వసూలు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఎంత చెల్లించాలో ప్రభుత్వమే ఈనాడు సహా అన్ని ప్రధాన పత్రికల్లో ప్రకటనల ద్వారా ప్రచారం చేస్తోంది. వినియోగదారుడు సొంతంగా సమకూర్చుకున్న వాహనం ద్వారా కూడా నిర్ణీత రుసుము చెల్లించి ఇసుకను తరలించుకునే వెసులుబాటు కల్పించింది. రాష్ట్రం మొత్తం జేపీ సంస్థ ఆధ్వర్యంలోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రతి నెలా జేపీ సంస్థ సమర్పించే వివరాలను గనులశాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విజిలెన్స్ స్క్వాడ్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)తో తనిఖీలు చేస్తున్నారు. అక్రమ ఇసుక మైనింగ్, రవాణాకు పాల్పడితే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించేలా చట్టం చేశారు.

నాడు ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానా

గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలను ఎన్జీటీ తీవ్రంగా తప్పుబట్టింది. పర్యావరణాన్ని దెబ్బతీసినందుకు ఏకంగా రూ.100 కోట్ల జరిమానా విధించింది. అదే ఎన్జీటీ ఇప్పుడు ఇసుక పాలసీకి సంబంధించి తీసుకున్న చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. టీడీపీ సర్కారు తప్పిదాలకు విధించిన రూ.వంద కోట్ల జరిమానాను కూడా రద్దు చేసింది. ఈ విషయం 'ఈనాడు' పత్రికకు, రామోజీరావుకు తెలియదా? లేక నటిస్తున్నారా? నాడు చంద్రబాబు సర్కారు సహజ వనరులను దోచేసింది. ఐదేళ్ల టీడీపీ పాలనలో ఇసుక మాఫియా రెచ్చిపోయింది. అడ్డొచ్చిన అధికారులను జుత్తు పట్టుకుని ఈడ్చుకెళ్లింది. ప్రభుత్వానికి రావాల్సిన రూ.4 వేల కోట్ల ఇసుక ఆదాయాన్ని మింగేసింది.

అనుమతుల మేరకే తవ్వకాలు

రాష్ట్రంలోని ప్రతి రీచ్‌లో పర్యావరణ అనుమతులు పొందిన తర్వాతే ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తున్నాం. అనుమతించిన మేరకే తవ్వకాలు జరుగుతున్నాయి. 54 డీసిల్టింగ్ పాయింట్లలో సంబంధిత విభాగాల అనుమతితో ఇసుక తవ్వకాలు చేసి స్టాక్ యార్డ్, డిపోల్లో వర్షాకాలం అవసరాల కోసం నిల్వ చేస్తున్నాం. అధికార పార్టీ నేతలు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్న కథనాలు అవాస్తవం. జేపీ సంస్థ మాకు పూర్తి జవాబుదారీగా పని చేస్తోంది. సంబంధిత అధికారులను సంప్రదించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ఊహాజనిత కథనాలు సరికాదు. ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వీజీ వెంకటరెడ్డి, గనులశాఖ డైరెక్టర్

యువర్స్

● సేవాపథం

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నిరాశ్రయులైన ప్రజల కోసం 27 సంవత్సరాల కౌశల్ శెట్టి 'నోస్టోస్ హోమ్స్' పేరుతో స్వచ్ఛందసంస్థను ప్రారంభించి దేశవ్యాప్తంగా సహాయక కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు. నిరాశ్రయుల కోసం ఈ సంస్థ తేలికపాటి, ఈజీ ట్రాన్స్‌పోర్టబుల్ షెల్టర్స్‌ను రూపొందించింది...

పచ్చటి గూడుతో...


కౌశల్ శెట్టి

'అనుభవమైతేగానీ తత్వం బోధపడదు' అంటారు. 'తత్వం' మాట ఎలా ఉన్నా కౌశల్ శెట్టికి 'కర్తవ్యం' బోధపడింది. శెట్టిదీ కర్నాటకలోని ఉడిపికి సమీపంలోని మది అనే గ్రామం. పచ్చదనానికి ఈ గ్రామం పర్‌ఫెక్ట్ అడ్రస్. అలాంటి పచ్చటి ఊరు కాస్తా ఘటప్రభ నది పొంగి పొర్లడంతో అల్లకల్లోలం అయింది. అంతెత్తు చెట్లు నిలువునా కూలి పోయాయి.

పొలాలు మునిగిపోయాయి.

ఇండ్లు ఘోరంగా దెబ్బతిన్నాయి.

ఇంట్లో ఉండలేని పరిస్థితి.

దీంతో ప్రజలు తట్టాబుట్టా సర్దుకొని ఊరు విడిచి తోచిన దిక్కుకు వెళ్లారు. శెట్టి కుటుంబం ముంబైకి వెళ్లింది.

ముంబైకి వెళుతున్నప్పుడు శెట్టి మనసు బాధతో నలిగిపోయింది. దీనికి కారణం...ఎటు పోవాలో తెలియక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ ఊళ్లోనే ఉండిపోయిన ప్రజలు.

సంవత్సరాలు గడుస్తున్నా ఆ బాధ తన నుంచి దూరం కాలేదు.

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదుకునే రోజుల్లో మరోసారి తుఫాను బీభత్సాన్ని, బాధితులు, నిరాశ్రయుల కష్టాలు, కన్నీళ్లను దగ్గర నుంచి చూశాడు.

'ఇలా బాధ పడుతూ కూర్చోవడం తప్ప నేను ఏం చేయలేనా!' అనుకున్నాడు శెట్టి.

ఎన్నో రకాలుగా ఆలోచించిన తరువాత...

తన స్నేహితుడు మాధవ్ దత్‌తో కలిసి 'నోస్టోస్ హోమ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాడు.

'ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రతి సంవత్సరం వందలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. అలాంటి వారికి నిలువ నీడ కల్పించడానికి మా సంస్థ ద్వారా కృషి చేస్తున్నాం' అంటున్నాడు శెట్టి.

తమ సంస్థ ట్రాన్స్‌పోర్టబుల్ హోమ్స్ గురించి చెబుతూ... 'పర్సనల్ డిగ్నిటీ, ప్రైవసీతో కూడిన హోమ్స్ ఇవి' అంటాడు శెట్టి.

'నోస్టోస్ హోమ్' సంస్థ అస్సాం, నాగాలాండ్ రాష్ట్రాలతో పాటు ఆఫ్రిక దేశాలలోనూ సేవలు అందిస్తోంది. కౌశల్ చేపట్టే సేవాకార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయి.

'తక్కువ సమయంలోనే బాధితులకు సహాయం అందించి నిరాశ్రయులకు అండగా నిలబడింది కౌశల్ బృందం. నిపుణుల సహాయంతో సౌకర్యాలు సమకూర్చారు' అంటున్నాడు హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ మలావి నేషనల్ డైరెక్టర్ కపీరా.

ఇక శెట్టి భవిష్యత్ లక్ష్యం విషయానికి వస్తే...

తన సేవాకార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనుకుంటున్నాడు. మారుమూల ప్రాంతాలలో వైద్య సౌకర్యాల మెరుగుదల కోసం కృషి చేయాలనుకుంటున్నాడు.

'నోస్టోస్ హోమ్'తో తొలి అడుగు వేసినప్పుడు 'నిజంగా నేను చేయగలనా?' అనే సందేహం శెట్టికి వచ్చేది. మంచి పని కోసం బయలు దేరినప్పుడు ఎన్నో ద్వారాలు మన కోసం తెరుచుకుంటాయి...అన్నట్లుగా శెట్టికి ఎంతో మంది ఎన్నో రకాలుగా సహాయం అందించారు.

కొన్ని అడుగులు పడిన తరువాత శెట్టికి తనపై తనకు ఎంతో నమ్మకం వచ్చింది. ఆ నమ్మకమే మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యం నిర్దేశించుకోవడానికి కారణం అయింది.

● మ్యూజిక్ వరల్డ్

సందేశ సమ్మోహన గీతం

పాట లక్ష్యం హుషారుగా స్టెప్పులు వేయించడం మాత్రమే కాదు.

పరుగును ఆపి మనలోకి మనం వెళ్లడం.

మంచి ఊహలకు స్వాగతం పలకడం అంటోంది రియ సంగీతం.

సాంగ్ రైటర్, సింగర్ రియ పాటలు హుషారెత్తిస్తూనే స్వీయ క్రమశిక్షణ నుంచి ఆత్మబలం వరకు ఎన్నో మంచి విషయాలను చెబుతాయి...


రియ



దిల్లీలో పుట్టిన రియ రెండు సంవత్సరాల వయసులో తల్లి దండ్రులతో యూకే వెళ్లింది. పాప్-బాలీవుడ్ మ్యూజిక్‌ను వింటూ పెరిగింది. చిన్న వయసులోనే స్టేజీపై ప్రదర్శనలు ఇచ్చింది. రియ 'పర్మిషన్' ట్రాక్ శ్రోతలను అలరించింది. 'పర్మిషన్' కోసం కలం కూడా పట్టింది రియ. ఇద్దరు ప్రేమికుల గురించి కావచ్చు, స్నేహం, కుటుంబ బంధాల గురించి కావచ్చు స్టోరీ-డ్రైవెన్ లిరిక్స్ రాయడం అంటే రియకు ఇష్టం.

క్లాసికల్ సింగింగ్‌లో డిప్లొమా చేసిన రియకు థియేటర్ మ్యూజిక్ అంటే ఇష్టం.

'పర్మిషన్' తరువాత వచ్చిన 'డోన్ట్ హ్యావ్ ది టైమ్'కు మంచి పేరు వచ్చింది.

ఇన్‌స్పిరేషన్ అనేది ఎప్పుడైనా, ఎక్కడైనా రావచ్చు అనే దానికి ఉదాహరణ...డోన్ట్ హ్యావ్ ది టైమ్. ఒక ఫెస్టివల్‌లో లైవ్ పర్‌ఫార్మెన్స్ ఇస్తున్నప్పుడు ఈ పాటకు ఆలోచన తట్టింది. ఆడియెన్స్ కూడా లీనమై తనతో పాటు డ్యాన్స్ చేసే పాట సృష్టించాలనుకుంది రియ. అలా పుట్టిందే... డోన్ట్ హ్యావ్ ది టైమ్.

అయస్కాంతంలా ఆకట్టుకునే పాట ఒకటి సృష్టించాలనుకుంది. అలా అని ఆ పాట అల్లాటప్పాగా ఉండకూడదని దానిలో సందేశం ఉండాలనుకుంది.

మనలో ఎంత టాలెంట్ ఉంటే మాత్రం? టైమ్ లేకపోతే అంతే!

అందుకే టైమ్ విలువను క్షణ, క్షణం గుర్తు చేసుకునేలా 'డోన్ట్ హ్యావ్ ది టైమ్'ను తీర్చిదిద్దింది. ప్రతి ఒక్కరూ రిలేట్ అయ్యేలా ఉండడమే ఈ పాట సక్సెస్ సాధించడానికి కారణం అయింది.

'ప్రతి నిమిషం అపూర్వమైనది. వెల కట్టలేనిది' అని గుర్తు చేసే 'డోంట్ హ్యావ్ ది టైమ్'పై పాప్ బీట్ మాత్రమే కాదు బాలీవుడ్ మ్యూజిక్ ప్రభావం కూడా కనిపిస్తుంది.

ట్రాక్ వీడియోల షూట్ కోసం ఎన్నో సార్లు దిల్లీకి వచ్చిన రియ ప్రతి సారి ఒక కొత్త అనుభవాన్ని సొంతం చేసుకుంది.

'సాంస్కృతిక వైవిధ్యంతో వెలిగిపోయే దిల్లీలో అడుగు తీసి అడుగు వేస్తే ఎన్నో అద్భుతాలు కనిపిస్తాయి' అని దిల్లీ గురించి మురిపెంగా చెబుతుంది రియ.

'ప్రతి నెల ఒక సింగిల్ విడుదల చేయాలనుకుంటున్నాను' అంటున్న రియ తన రచనలు, సంగీతంతో ఎప్పుడూ బిజీబిజీగా ఉంటుంది. ఇండియాలోని ప్రొడ్యూసర్‌లు, మ్యూజిషియన్‌లతో పనిచేయాలని, లైవ్ షోలలో పాల్గొనాలనేది రియ కల.

మరి నెక్ట్స్ ఏమిటి?

'చెప్పుకోతగ్గ అద్భుతమైన ఆనందకరమైన విషయాలు ముస్ముందు ఉన్నాయి. మాంచెస్టర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్, బీబీసీ ది హండ్రెడ్ ప్రోగ్రామ్‌లో ప్రదర్శన ఇవ్వబోతున్నాను' అంటుంది రియ.

● టెక్.. టాక్

రియల్‌మీ ప్యాడ్ 2



డిస్‌ప్లే: 11.5 అంగుళాలు
ఫ్రంట్, బ్యాక్ కెమెరా: 8ఎంపీ
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
స్క్రీన్ రిజల్యూషన్: 2000×1200 పిక్సెల్స్
బ్యాటరీ: 8,360 ఎంఏహెచ్
ఆపరేషన్ సిస్టమ్: ఆండ్రాయిడ్ వి 13
కలర్స్: ఇనిస్పిరేషన్ గ్రీన్, ఇనిస్పిరేషన్ గ్రే
ర్యామ్: 6జీబీ
ఇంటర్నల్ మెమొరీ: 128జీబి

వన్‌ప్లస్ 12



డిస్‌ప్లే: 6.7 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 5,400 ఎంఏహెచ్
● 50 ఎంపీ మెయిన్ సెన్సర్
● 50 ఎంపీ ఆల్ట్రావైడ్ సెన్సర్ ● 64 ఎంపీ టెలిఫొటో కెమెరా
● 32-మెగా పిక్సెల్ కెమెరా ● ఫింగర్ ప్రింట్ స్కానర్

ల్యాప్‌టాప్ స్టాండ్ విత్ మొబైల్ హోల్డర్



బ్రాండ్: ప్రోట్రానిక్స్
కలర్: బ్లాక్
ఫామ్: టేబుల్ స్టాండ్
హైట్: 26 సెం.మీ
విడ్త్: 28.5 సెం.మీ
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 2.7×28.5×26 సెం.మీ
బరువు: 739 గ్రా.

రెడ్‌మీ వాచ్ 3



రెడ్‌మీ వాచ్ 3 యాక్టివ్ ఇండియన్ మార్కెట్‌లో త్వరలో విడుదల కానుంది.
● 1.83 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే
● బ్లూటూత్ 5.3 కనెక్టివిటీ
స్పోర్ట్స్ మోడ్స్: 100 ● వాటర్ రెసిస్టెంట్
● సింగిల్ ఛార్జ్: 12 గంటలు
రిజల్యూషన్: 240×280 పిక్సెల్స్
హెల్త్‌మానిటరింగ్ సెన్సర్‌లు: బ్లడ్ ఆక్సిజన్ సెన్సర్, హార్ట్ రేట్ మానిటర్, స్లీప్ మానిటర్... మొదలైనవి.
కలర్స్: బ్లాక్ అండ్ గ్రే

● గేమింగ్

తిరుగులేని వీరుడు

థర్డ్-పర్సన్ షూటర్ యాక్షన్ రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ రెమ్‌నెంట్2 ఈ నెల 25న విడుదల అవుతుంది. రెమ్‌నెంట్: ఫ్రమ్ ది యాషెస్(2019)కు సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ తమ క్యారెక్టర్‌లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్లేయర్స్ మొత్తం గేమ్‌ను సోలోగా ఆడవచ్చు. 3-ప్లేయర్ కోఆపరేటివ్ మల్టీప్లేయర్ మోడల్‌కు కూడా ఈ గేమ్ సపోర్ట్ చేస్తుంది. గన్‌స్లింగర్, హ్యాండ్లర్, చాలెంజర్, హంటర్, మెడిక్...అనే అయిదు రకాల ఆర్కిటైప్‌లు ఉంటాయి. ప్రతి ఆర్కిటైప్‌కు తనదైన శైలి, నైపుణ్యం ఉంటాయి. మనం ఏ ఆర్కిటైప్‌ను ఎంపిక చేసుకున్నామనేదానిపై విజయం ఆధారపడి ఉంటుంది.



క్వాలిటీ, బ్యాలెన్స్‌డ్, పర్‌ఫార్‌మెన్స్ అనే మూడు రకాల మోడ్స్ ఈ గేమ్‌లో ఉంటాయి.

డెవలపర్స్: గన్‌ఫైర్ గేమ్స్ ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్5
జానర్స్: థర్డ్ పర్సన్ షూటర్, యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: విండో పీసి, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● ఇడియమ్స్



పాస్ ది బక్

ఒక పని లేదా సమస్యకు వేరొకరిపై నింద మోపుతూ తన బాధ్యతల నుంచి తప్పుకోవడానికి ప్రయత్నించే సందర్భంలో ఉపయోగించే మాట ఇది.

ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్. దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

ఏ ఫ్లాష్ ఇన్ ది పాన్

ఒక వ్యక్తి లేదా సంస్థ అనూహ్యంగా విజయం సాధించి, ఆ విజయాన్ని మళ్లీ నిలబెట్టుకోలేని లేదా పునరావృతం చేయలేని సందర్భంలో వాడే ఇడియమ్.

ఉదా: ది బ్యాండ్ వాజ్ జస్ట్ ఏ ఫ్లాష్ ఇన్ ది పాన్ విత్ వన్ హిట్ ఇన్ 2003

సినిమా


● కమల్ హాసన్, ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న టైమ్‌ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా అమెరికాలో జరుగుతున్న 'కామిక్ కాన్-2023' వేడుకల్లో 'ప్రాజెక్ట్ కె' గ్లింప్స్, టైటిల్‌ను జూలై 21న (భారతీయ కాలమానం ప్రకారం) రివీల్ చేయడానికి ప్లాన్ చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్, కమల్‌హాసన్, నాగ్ అశ్విన్‌లతో పాటు 'ప్రాజెక్ట్ కె' టీమ్ అమెరికాలో సందడి చేసింది.

లక్కీ చాన్స్?

'గీత గోవిందం' (2018) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అయితే కథ రీత్యా ఈ సినిమాలో మరో హీరోయిన్‌కు చోటు ఉందని, దీంతో ఈ పాత్రకు దివ్యాంశ కౌశిక్‌ను చిత్రయూనిట్ సెలక్ట్ చేసుకున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇదే నిజమైతే దివ్యాంశకు మరో లక్కీ చాన్స్ దక్కినట్లేనని సినిమా ప్రేమికులు చెప్పుకుంటున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాకు 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.


● దివ్యాంశ కౌశిక్

యాభైలో పడ్డారు!

యాభైలో పడ్డారంటే యాభై ఏళ్ల వయసులో పడ్డారనుకుంటున్నారేమో! ఆ మాటకొస్తే.. ధనుష్, విజయ్ సేతుపతి, అంజలికన్నా సీనియర్ ఆర్టిస్ట్ అయిన సిమ్రానే ఇంకా వయసు పరంగా యాభై టచ్ అవ్వలేదు. ఆమె యాభైలోకి అడుగుపెట్టడానికి ఇంకో రెండు మూడేళ్లు పడుతుంది. ఇక ధనుష్, భరత్ నలభై టచ్ చేస్తే.. ఇంకో అయిదు అదనంగా అంటే... సేతుపతి నలభై అయిదు టచ్ చేశారు. అంజలి నలభై లోపే. ఈ అయిదుగురూ అయిదుపదుల్లో పడింది సినిమాల పరంగా. ఈ అయిదుగురూ చేస్తున్న 50వ సినిమా విశేషాల్లోకి వెళదాం...

రెండు దశాబ్దాల్లో రెండోది

రెండు దశాబ్దాల కెరీర్‌లో నటుడు-నిర్మాత ధనుష్ దర్శకత్వం వహించిన తొలి సినిమా 'పా. పాండి' (2017). ఈ సినిమా తర్వాత మరో సినిమా కోసం దర్శకుడిగా ధనుష్ మెగాఫోన్ పట్టాలనుకున్నారు. 'నాన్ రుద్రన్'గా ప్రచారం జరిగిన ఈ సినిమా ఎందుకో సెట్స్‌పైకి వెళ్లలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ధనుష్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా సెట్స్‌పైకి వెళ్లింది. అయితే ఇది ధనుష్ కెరీర్‌లో 50వ సినిమా కావడం విశేషం. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సినిమా నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా ఉంటుందట. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024లో రిలీజ్ కానుంది.


● ధనుష్

మహారాజా

హీరో.. విలన్.. సపోర్టింగ్ యాక్టర్... ఇలా పాత్రకు తగ్గట్టు ఇమిడిపోతూ విలక్షణ నటుడిగా ప్రేక్షకుల్లో పేరు సంపాదించుకున్నారు విజయ్ సేతుపతి. కెరీర్‌లో విజయ్ సేతుపతి 50 చిత్రాల మైలురాయికి చేరుకున్నారు. ఆయన 50వ సినిమాకు 'మహారాజా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నితిలన్ సామినాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో హీరోయిన్ మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్, బాలీవుడ్ దర్శక-నిర్మాత, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో నటించారు. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా తుది దశకు చేరుకున్నాయి. 'పాషన్ స్టూడియోస్' సుధన్ సుందరం, జగదీష్ పళనీసామి నిర్మించిన ఈ సినిమా విడుదల తేదీపై త్వరలో ఓ స్పష్టత రానుంది.


● విజయ్ సేతుపతి

లా స్టూడెంట్

దక్షిణాదిలో నటిగా అంజలికి మంచి మార్కులే వేశారు ప్రేక్షకులు. హీరోయిన్‌గా, సెకండ్ హీరోయిన్‌గా, కీలక పాత్రల్లో నటిస్తున్న అంజలి కెరీర్‌లో హాఫ్ సెంచరీ కొట్టారు. అదేనండీ.. యాభై సినిమాల మైల్‌స్టోన్‌కు చేరుకున్నారు. అంజలి ప్రధాన పాత్రలో అశోక్ వేలాయుధం దర్శకత్వంలో 'ఈగై' అనే ఓ కోర్టు డ్రామా మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రం అంజలికి 50వది. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. ఈ చిత్రంలో అంజలి లా స్టూడెంట్‌గా నటిస్తున్నారని, సునీల్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారని తెలిసింది. గ్రీన్ అమ్యూస్‌మెంట్ ప్రొడక్షన్స్, డీ3 ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.


● అంజలి

సిమ్రాన్ శబ్దం

సిమ్రాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. దక్షిణాదిలోనే కాదు..ఉత్తరాదిలో కూడా సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు సిమ్రాన్. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. సిమ్రాన్ కీలక పాత్ర చేస్తున్న మూవీల్లో 'శబ్దం' ఒకటి. 'ఈరమ్' (తెలుగులో 'వైశాలి') చిత్రం తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. లక్ష్మీ మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిమ్రాన్, లైలా కీలక పాత్రధారులు. సిమ్రాన్‌కు తమిళంలో ఇది 50వ సినిమా కావడం విశేషం.


● సిమ్రాన్

ప్రేమకోసం...

దాదాపు ఇరవై ఏళ్ల క్రితం వచ్చిన తమిళ చిత్రం 'కాదల్' తెలుగులో 'ప్రేమిస్తే..'గా విడుదలై మంచి విజయం సాధించింది. ఈ చిత్రం తర్వాత తమిళంలో చాలా సినిమాలే చేశారు భరత్. తెలుగులో మహేశ్‌బాబు 'స్పైడర్', సుధీర్‌బాబు 'హంట్' వంటి సినిమాల్లో కీలక పాత్రల్లో నటించారు. కాగా భరత్ కెరీర్‌లో రూపొందిన 50వ సినిమా 'లవ్'. వాణీ భోజన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు ఆర్పీ బాలా దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది.


● భరత్

కెరీర్‌లో 50వ మైల్‌స్టోన్ చేరుకున్న నటీనటులు ఇంకొందరు ఉన్నారు.

రీల్స్

సినిమా బాగుంటే ఎందుకు చూడరు

- అల్లు అర్జున్



"7/జి బృందావన కాలనీ, అర్జున్ రెడ్డి' సినిమాలు ప్రేమలోని బాధను చూపిస్తాయి. అలాంటి సినిమాలు తీయాలంటే చాలా కష్టం. అదే కోవలో వాస్తవ ఘటనల స్ఫూర్తితో 'బేబి' సినిమాని అద్భుతంగా తీశారు సాయిరాజేష్" అని హీరో అల్లు అర్జున్ అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్‌లో సాయి రాజేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 14న రిలీజైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'బేబి అప్రిషియేషన్ మీట్'కి ముఖ్య అతిథిగా హాజరైన అల్లు అర్జున్ మాట్లాడుతూ– "చిన్న సినిమాలను చూడరు అంటుంటారు. కానీ అది అబద్ధం.. సినిమా బాగుంటే ఎందుకు చూడరు? సాయి రాజేష్‌గారు చాలా బాగా తీశారు. ఆయన రాసిన కథ విధానం ఇంకా బాగా నచ్చింది" అన్నారు.

ఏ సినిమానీ చిన్నది అనొద్దు - విశ్వక్ సేన్

"ఏ సినిమానీ చిన్నది అనొద్దు. కొత్త వాళ్ల సినిమా అనాలి. నేను రావడం వల్ల ఓ సినిమాకు మంచి జరుగుతుందంటే ప్రమోషన్‌కు వస్తాను.. అది నాకు తృప్తినిస్తుంది" అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. చైతన్యారావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో'. యష్ రంగినేని నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ–"ఈ మూవీ హిట్ అవుతుందని ట్రైలర్ చూసినప్పుడే అనిపించింది. యూనిట్‌కి మంచి సక్సెస్ రావాలి" అన్నారు..


● చైతన్య, విశ్వక్‌సేన్

సమ్మోహనుడా...

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏయమ్ రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సమ్మోహనుడా పెదవిస్తా నీకే కొంచెం కొరుక్కోవా...' అంటూ సాగే పాటను గురువారం విడుదల చేశారు. రాంబాబు గోసాలతో కలిసి రత్నం కృష్ణ ఈ పాటకి సాహిత్యం అందించగా, శ్రేయా ఘోషల్ పాడగా, శిరీష్ కొరియోగ్రఫీ అందించారు.


● నేహా, కిరణ్

ఫన్‌ఫుల్

ఫుల్లుగా ఫన్ మూడ్‌లో ఉన్నారు విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరి. మరి.. నటిస్తున్న సినిమా ఫన్ ఎంటర్‌టైనర్ అయితే ఆ షూటింగ్ లొకేషన్లో మొత్తం ఫన్నే కదా. విశ్వక్, మీనాక్షీ జంటగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియోలను త్వరలో విడుదల చేస్తామని చిత్ర యూనిట్ పేర్కొంది.


● మీనాక్షీ చౌదరి

సాక్షి బిజినెస్

శుక్రవారం
21-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 474	నిఫ్టీ ▲ 146
67,572	19,979

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,155	▽	206
డోజోన్స్	35,319	▲	257
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,646	▲	58
డాక్స్	16,204	▲	95
షాంఘై	3,170	▲	29
నికాయ్	32,491	▽	406

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్) 59,863	▲	107
బంగారం (22 క్యారట్) 59,623	▲	106
వెండి (కిలో) 75,768	▲	269

60 సెకన్లలోనే వెబ్‌సైట్..

సైట్స్‌60 ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు (ఎస్‌ఎంఈ) డిజిటల్ బాట పట్టడంలో మరింత సహాయం అందించే దిశగా సైట్స్‌60 సంస్థ ఏర్పాటైంది. కేవలం 60 సెకన్లలోనే ఎస్‌ఎంఈలు తమ సొంత వెబ్‌సైట్‌ను రూపొందించుకునేందుకు ఇది తోడ్పాటు అందించనుంది. దీన్ని తెలంగాణ ఐటీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ప్రారంభించారు. స్థానిక భాషల్లో కూడా ఈ సైట్లను రూపొందించుకోవచ్చని సైట్స్‌60 వ్యవస్థాపకుడు రాజీవ్ రావుల పాటి తెలిపారు. సొంత వెబ్‌సైట్ తయారు చేసుకోవడం చిన్న వ్యాపార సంస్థలకు వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారమనే అభిప్రాయం నెలకొన్న నేపథ్యంలో తాము అత్యంత చౌకగా ఈ సర్వీసును అందించనున్నట్లు పేర్కొన్నారు. 2025 ఆఖరు కల్లా 10 లక్షల మంది చిన్న, మధ్యతరహా వ్యాపారులకు సేవలు అందించాలన్నది మా ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో టీహబ్ సీవోవో అనీష్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ అంచనాలు డౌన్

- పూర్తి ఏడాది ఆదాయ వృద్ధి అంచనాల్లో కోత..
- ఆర్థిక అనిశ్చితి ప్రభావం ఉంటుందని వెల్లడి
- క్యూ1 లో నికర లాభం రూ.5,945 కోట్లు; 11 శాతం వృద్ధి
- 10 శాతం పెరిగిన ఆదాయం; రూ.37,933 కోట్లు

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఆదాయ వృద్ధి అంచనాలను భారీగా తగ్గించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 1–3.5 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంది. అంతక్రితం కంపెనీ ఆదాయం 4–7 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా వేసింది. కంపెనీలు తమ ఐటీ వ్యయాల విషయంలో నిర్ణయాలను జాప్యం చేస్తుండటం కూడా దీనికి కారణమని ఇన్ఫీ పేర్కొంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2023–24, క్యూ1)లో ఇన్ఫీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.5,945 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.5,362 కోట్లతో పోలిస్తే 11% వృద్ధి చెందింది. ఇక మొత్తం ఆదాయం 10% పెరుగుదలతో రూ.34,470 కోట్ల నుండి రూ.37,933 కోట్లకు చేరింది. అయితే, క్రితం ఆర్థిక సంవత్సరం జనవరి–మార్చి క్వార్టర్ (క్యూ4)తో పోలిస్తే (సీక్వెన్షియల్‌గా) కంపెనీ నికర లాభం 3 % తగ్గింది. ఆదాయం స్వల్పంగా 1.31% పెరిగింది.



భారీ స్థాయి మెగా డీల్స్‌తో క్యూ1లో మెరుగైన పనితీరు సాధించాం. అయితే, డీల్స్ కుదరడం, ప్రారంభ తేదీల విషయంలో కొంత జాప్యం చోటు చేసుకుంటోంది. కొన్ని ప్రాజెక్టుల విషయంలో కూడా మందగమనం నెలకొంది. 80 యాక్టివ్ ప్రాజెక్టులతో మా జెనరేటివ్ ఏఐ సామర్థ్యాలు పుంజుకుంటున్నాయి. – సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈఓ

ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ1లో 2.3 బిలియన్ డాలర్ల విలువైన భారీ డీల్స్ కుదిరాయి.
- ఆపరేటింగ్ మార్జిన్ 20.8 శాతంగా నమోదైంది.
- జూన్ క్వార్టర్లో ఉద్యోగుల వలసల రేటు 17.8 శాతానికి తగ్గింది. క్రితం క్వార్టర్లో ఇది 20.9 శాతంగా ఉంది.
- క్యూ1లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 6,940 తగ్గింది. జూన్ చివరి నాటికి కంపెనీలో మొత్తం 3,36,294 మంది సిబ్బంది ఉన్నారు. ఇన్ఫీలో ఉద్యోగుల సంఖ్య తగ్గడం వరుసగా ఇది రెండో త్రైమాసికం కావడం గమనార్హం. కాగా, కొత్త నియామకాల ప్రణాళికను కంపెనీ ప్రకటించలేదు.
- జూన్ 28న జరిగిన వార్షిక వాటాదారుల సమావేశంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి షేరుకు రూ.17.5 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం 1.74% క్షీణించి రూ.1,449 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత కంపెనీ ఫలితాలు వెలువడ్డాయి.

జియో ఫైనాన్షియల్ @ రూ. 262

- కంపెనీ విలువ రూ. 1,66,000 కోట్లు
- ప్రత్యేక ప్రీఓపెనింగ్ సెషన్‌లో నిర్ధారణ
- రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడదీత



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) నుంచి విడివడిన ఫైనాన్షియల్ సర్వీసుల కంపెనీ విలువ విశ్లేషకుల అంచనాలను మించుతూ రూ. 1,66,000 కోట్లుగా నమోదైంది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(జేఎఫ్ఎస్ఎల్) పేరుతో విడివడిన కంపెనీ షేరుకి రూ. 262 ధర నిర్ధారణ అయ్యింది. పలువురు మార్కెట్ నిపుణులు రూ. 160–190 మధ్య ధరను అంచనా వేయడం గమనార్హం! ఆర్ఐఎల్ షేరు బుధవారం ముగింపు ధర రూ. 2,842కాగా.. గురువారం ప్రీఓపెన్ ట్రేడింగ్‌లో జేఎఫ్ఎస్ఎల్ బిజినెస్‌ను మినహాయించడంతో రూ. 2,580 వద్ద స్థిరపడింది. వెరసి జేఎఫ్ఎస్ఎల్ షేరుకి దాదాపు రూ. 262 ధర పలికింది. ఈ ధరలో ఫైనాన్షియల్ కంపెనీ మార్కెట్ విలువ 20 బిలియన్ డాలర్లు(రూ. 1,66,000 కోట్లు)కు చేరింది. ఫలితంగా అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, ఇండియన్ ఆయిల్ తదితర దిగ్గజాలకంటే ముందు నిలిచింది. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)రీత్యా దేశీయంగా 32వ ర్యాంకును పొందింది. తద్వారా మార్కెట్ విలువలో అదానీ గ్రీన్, టాటా స్టీల్, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌ను సైతం జేఎఫ్ఎస్ఎల్ వెనక్కి నెట్టింది.

త్వరలో లిస్టింగ్

ఆర్ఐఎల్ నుంచి విడదీసిన జేఎఫ్ఎస్ఎల్ షేరు త్వరలో ఎక్స్చేంజీలలో లిస్ట్ కానుంది. ఆర్ఐఎల్ వాటాదారులు ప్రతీ 1 షేరుకి 1 జేఎఫ్ఎస్ఎల్ షేరుని పొందనున్నారు. జూలై 1 నుంచి విడదీత అమల్లోకిరాగా.. షేర్ల కేటాయింపునకు రికార్డ్ డేట్‌గా ఈ నెల 20ను ప్రకటించిన సంగతి తెలిసిందే. మూలధనం రీత్యా జేఎఫ్ఎస్ఎల్ దేశీయంగా ఐదోపెద్ద ఫైనాన్షియర్‌గా ఆవిర్భవించనుంది. పేటీఎమ్, బజాజ్ ఫైనాన్స్ తదితరాలతో పోటీ పడనుంది. ఆర్ఐఎల్‌కుగల జియో, రిటైల్ కన్జూమర్ బిజినెస్‌లకు తోడ్పాటునందించనుంది. 42.8 కోట్లమంది వినియోగదారులను కలిగిన జియో అతిపెద్ద వైర్‌లెస్ కంపెనీగా నిలుస్తోంది.

హెచ్‌యూఎల్ లాభం అప్

క్యూ1లో రూ. 2,556 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 2,556 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,391 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,757 కోట్ల నుంచి రూ. 15,679 కోట్లకు ఎగసింది.



మొత్తం వ్యయాలు రూ. 11,531 కోట్ల నుంచి రూ. 12,167 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో గృహ పరిరక్షణ(హోమ్‌కేర్) విభాగం మరోసారి పటిష్ట పనితీరు చూపుతూ 10 శాతం వృద్ధి సాధించినట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది. సౌందర్యం, వ్యక్తిగత రక్షణ బిజినెస్ 4 శాతం మెరుగుపడగా.. ఫుడ్, రిఫ్రెష్‌మెంట్ విభాగం 5 శాతం పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 1.2% బలపడి రూ. 2,702 వద్ద ముగిసింది.

తాన్లా లాభం రూ.135 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్లౌడ్ కమ్యూనికేషన్స్ కంపెనీ తాన్లా ప్లాట్‌ఫామ్స్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 34.85 శాతం ఎగసి రూ.135.4 కోట్లు సాధించింది. ఎబిటా రూ.182.2 కోట్లు, ఎబిటా మార్జిన్ 20 శాతంగా ఉంది. టర్నోవర్ 13.9 శాతం అధికమై రూ.916 కోట్లు నమోదు చేసింది. ఈపీఎస్ రూ.7.38 నుంచి రూ.10.07కు చేరింది. క్రితం ముగింపుతో పోలిస్తే తాన్లా షేరు ధర బీఎస్ఈలో గురువారం 0.31 శాతం ఎగసి రూ.1,118.55 వద్ద స్థిరపడింది.

ఆరో రోజూ రికార్డుల పరుగు

- 20 వేల స్థాయి చేరువలో నిఫ్టీ
- 67,500 స్థాయి ఎగువకు సెన్సెక్స్
- బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లకు డిమాండ్
- ఐటీ, కన్జూమర్ షేర్లలో లాభాల స్వీకరణ

ముంబై: బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీల రికార్డుల పరుగు వరుసగా ఆరో రోజూ కొనసాగింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి రికవరీ, విదేశీ నిధుల వెల్లువ అంశాలు కలిసొచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 23 పాయింట్ల స్వల్ప నష్టంతో 67,074 వద్ద, నిఫ్టీ ఒక పాయింటు నష్టంతో 19,832 వద్ద మొదలయ్యాయి. ప్రథమార్థంలో ఐటీ, టెక్, కన్జూమర్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో లాభాల స్వీకరణతో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే ద్వితీయార్థంలో ఎఫ్ఎంసీజీ, బ్యాంకులు, ఫార్మా, ఫైనాన్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 522 పాయింట్లు పెరిగి 67,619 వద్ద, నిఫ్టీ 159 పాయింట్లు బలపడి 19,992 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 474 పాయింట్ల లాభంతో 67,572 వద్ద ముగిసింది. నిఫ్టీ మార్కెట్ ముగిసేసరికి 146 పాయింట్లు బలపడి 19,979 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,370 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.193 కోట్ల షేర్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.93 స్థాయి వద్ద ముగిసింది. అమెరికా రిటైల్ అమ్మకాలు నిరాశపరచడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

''ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయలేకపోయాయి. భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసంతో విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తడం ఇందుకు ప్రధాన కారణం. బ్యాంకుల క్యూ1 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. ముఖ్యంగా వ్యాపార విభజన తర్వాత అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ షేర్ల విలువల అన్‌లాక్ సూచీల కొత్త రికార్డుల ర్యాలీకి మరింత బలాన్నిచ్చింది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



ఐటీసీ @రూ.6 లక్షల కోట్లు

ఐటీ దిగ్గజం ఐటీసీ షేరు రూ.6 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ కలిగిన కంపెనీగా అవతరించింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. 3% పెరిగి రూ.493.50 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. రూ.492 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ ఒక్కరోజులోనే రూ.17,124 కోట్లు పెరిగి రూ.6.12 లక్షల కోట్లకు చేరింది.

అత్యంత విలువైన రెండో కంపెనీగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

దేశంలోనే అత్యంత విలువైన రెండో కంపెనీగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అవతరించింది. ఇటీవల మాతృసంస్థ హెచ్‌డీఎఫ్‌సీని ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు షేరు గురువారం బీఎస్ఈలో 0.22% పెరిగి రూ.1,688.50 వద్ద స్థిరపడింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.12.72 లక్షల కోట్లుగా నమోదైంది. తద్వారా ఐటీ దిగ్గజం టీసీఎస్(రూ.12.66 లక్షల కోట్లు)ను అధిగమించి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. కాగా మార్కెట్ క్యాప్ విలువ ప్రకారం భారతీయ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.17.72 లక్షల కోట్లతో తొలి స్థానంలో కొనసాగుతోంది.

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్–23 క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా భారత 'ఎ' జట్టు నేడు జరిగే సెమీఫైనల్లో బంగ్లాదేశ్ 'ఎ' జట్టుతో తలపడనుంది. యశ్ ధుల్ నాయకత్వంలోని భారత 'ఎ' జట్టు లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. ఈ టోర్నీలో భారత 'ఎ' జట్టు ఆటగాళ్లు యశ్ ధుల్, హర్షిత్ రాణా, సాయి సుదర్శన్, నిశాంత్ సింధు, రాజ్‌వర్ధన్ హంగార్గేకర్, నికిన్ జోస్, మానవ్ సుథర్ తదితరులు ఆకట్టుకున్నారు. మరో సెమీఫైనల్లో శ్రీలంక 'ఎ'తో పాకిస్తాన్ 'ఎ' తలపడుతుంది.

ఓటమితో ముగింపు

ఆసియా క్రీడల సన్నాహాల్లో భాగంగా జర్మనీలో పర్యటించిన భారత మహిళల హాకీ జట్టుకు ఒక్క విజయం కూడా దక్కలేదు. గురువారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో భారత జట్టు 0–2 గోల్స్ తేడాతో జర్మనీ చేతిలో ఓడిపోయింది.

భారత్ 182/4

- రోహిత్, యశస్వి అర్ధ సెంచరీలు
- విండీస్‌తో రెండో టెస్టు



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: రెండో టెస్టులోనూ భారత ఓపెనింగ్ జోడీ అదరగొట్టింది. కానీ తొలి సెషన్ వరకే ఈ శుభారంభం పరిమితమైంది. సెషన్ మారగానే వెస్టిండీస్ బౌలింగ్ ప్రతాపం మొదలైంది. 'టాప్' లేపింది. ఇరు జట్లు చెరిసగం ఆధిపత్యాన్ని పంచుకోవడంతో ఈ మ్యాచ్ పోటాపోటీగా మొదలైంది. టాస్ నెగ్గిన వెస్టిండీస్ బౌలింగ్‌కే మొగ్గుచూపగా, యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి కెప్టెన్ రోహిత్ శర్మ ఇన్నింగ్స్ ఆరంభించారు. ఉదయం సెషన్ అంతా వీళ్లిద్దరు ఆడుతూపాడుతూ పరుగులు సాధించారు. చెత్త బంతుల్ని సిక్సర్లుగా మలిచారు. ఈ క్రమంలో ముందుగా 'హిట్‌మ్యాన్' రోహిత్ 74 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 21వ ఓవర్లోనే జట్టు స్కోరు వందకు చేరింది. కాసేపటికే ధాటిగా ఆడుతున్న జైస్వాల్ కూడా 49 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. 121/0 వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. భోజన విరామం తర్వాత 30 నుంచి 40 ఓవర్ల మధ్యలో... కేవలం 8 ఓవర్ల వ్యవధిలో కీలకమైన టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. ముందుగా యశస్వి జైస్వాల్ (74 బంతుల్లో 57; 9 ఫోర్లు, 1 సిక్స్)కు హోల్డర్ చెక్ పెట్టగా, రోచ్ బౌలింగ్‌లో పేలవమైన షాట్‌కు శుబ్‌మన్ గిల్ (10; 2 ఫోర్లు) నిష్క్రమించాడు. కోహ్లితో కలిసి సెంచరీ దిశగా దూసుకెళ్తున్న రోహిత్ శర్మ (143 బంతుల్లో 80; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు)ను వారికన్ బోల్తా కొట్టించాడు. అనుభవజ్ఞుడైన రహానే (8) క్లీన్‌బౌల్డయ్యాడు. దీంతో 139/0 స్కోరు కాస్తా 182/4గా మారిపోయింది. టీ విరామానికి భారత్ 50.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కోహ్లి (18 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో బెంగాల్ పేసర్ ముకేశ్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. గాయపడిన శార్దుల్ ఠాకూర్ స్థానంలో అతన్ని తీసుకున్నారు. విండీస్ తరఫున కిర్క్ మెకెంజి కెరీర్ మొదలు పెట్టాడు.

10 ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా భారత స్టార్ విరాట్ కోహ్లి మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కలిపి అంతర్జాతీయ క్రికెట్‌లో 500 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న పదో క్రికెటర్‌గా నిలిచాడు. సచిన్ టెండూల్కర్, ధోని, ద్రవిడ్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో భారతీయ క్రికెటర్‌గా కోహ్లి గుర్తింపు పొందాడు.



భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య 100వ టెస్టు సందర్భంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు జ్ఞాపికను అందజేసిన వెస్టిండీస్ క్రికెట్ అధ్యక్షుడు డాక్టర్ కిశోర్ షాలో, దిగ్గజం బ్రియాన్ లారా

సాత్విక్–చిరాగ్ జోడీ ముందుకు...

పోరాడి ఓడిన ప్రణయ్, ప్రియాన్షు



యోసు (కొరియా): కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం సాత్విక్–చిరాగ్ 21–17, 21–15తో ప్రపంచ 16వ ర్యాంక్ జోడీ హి జి టింగ్–జౌ హావో డాంగ్ (చైనా)పై గెలిచింది. 43 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్‌లకు తొలి గేమ్‌లో ప్రతిఘటన ఎదురైంది. పలుమార్లు ఆధిక్యం దోబూచులాడింది. 11–12తో వెనుకబడిన దశలో భారత జంట వరుసగా మూడు పాయింట్లు గెలిచి 14–12తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని తొలి గేమ్ దక్కించుకుంది. రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్ ఆరంభంలోనే వరుసగా మూడు పాయింట్లు నెగ్గి శుభారంభం చేసింది. స్కోరు 10–8 వద్ద భారత జోడీ వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 14–8తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 11–21, 14–21తో రెండో సీడ్ బేక్ హా నా–లీ సో హీ (దక్షిణ కొరియా) జంట చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 15–21, 12–21తో ఫెంగ్ యాన్ జె–హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా) జంట చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుల కథ ముగిసింది. భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రపంచ 32వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. ప్రపంచ పదో ర్యాంకర్ ప్రణయ్ 15–21, 21–19, 18–21తో ప్రపంచ 18వ ర్యాంకర్ లీ చెయుక్ యిక్ (హాంకాంగ్) చేతిలో... ప్రియాన్షు 14–21, 21–18, 17–21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయారు.



ఇంగ్లండ్ దూకుడు

- తొలి ఇన్నింగ్స్‌లో 384/4
- జాక్ క్రాలీ మెరుపు సెంచరీ

మాంచెస్టర్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో ఇంగ్లండ్ రెండో రోజు అదరగొట్టింది. ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 384 పరుగులు సాధించింది. ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టు 67 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్ జాక్ క్రాలీ (182 బంతుల్లో 189; 21 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆసీస్ బౌలర్ల భరతంపట్టి త్రుటిలో డబుల్ సెంచరీని చేజార్చుకున్నాడు. మొయిన్ అలీ (82 బంతుల్లో 54; 7 ఫోర్లు), జో రూట్ (95 బంతుల్లో 84; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. ప్రస్తుతం హ్యారీ బ్రూక్ (14 బ్యాటింగ్), బెన్ స్టోక్స్ (24 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 299/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 18 పరుగులు జోడించి మిగతా రెండు వికెట్లు కోల్పోయి 317 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 5 వికెట్లు... బ్రాడ్ 2 వికెట్లు తీశారు.

పాక్‌దే తొలి టెస్టు

గాలె: శ్రీలంక జట్టుతో రెండు టెస్టుల సిరీస్‌లో పాకిస్తాన్ జట్టు శుభారంభం చేసింది. గురువారం ముగిసిన తొలి టెస్టులో పాకిస్తాన్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఏడాది తర్వాత పాక్ జట్టుకు టెస్టు ఫార్మాట్‌లో తొలి విజయం దక్కింది. 131 పరుగుల లక్ష్యాన్ని అందుకోవడానికి ఓవర్‌నైట్ స్కోరు 48/3తో ఆట చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్... 32.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. బాబర్ ఆజమ్ (28 బంతుల్లో 24; 5 ఫోర్లు), సౌద్ షకీల్ (38 బంతుల్లో 30; 6 ఫోర్లు) వేగంగా ఆడగా... ఓపెనర్ ఇమామ్ ఉల్ హఖ్ (84 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో పాక్‌ను విజయతీరానికి చేర్చాడు. రెండో టెస్టు కొలంబోలో సోమవారం నుంచి జరుగుతుంది.



ఏ ప్రాతిపదికన ఈ మినహాయింపు?

డబ్ల్యూఎఫ్ఐ అడ్‌హక్ కమిటీని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు




న్యూఢిల్లీ: నేరుగా ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అడ్‌హక్ కమిటీ ఇచ్చిన మినహాయింపు అంశం కోర్టుకెక్కింది. అండర్–20 ప్రపంచ చాంపియన్ అంతిమ్ పంఘాల్, అండర్–23 ఆసియా చాంపియన్ సుజీత్ కల్కల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ సుబ్రమణియమ్ ప్రసాద్ వీరిద్దరికి మినహాయింపు ఇవ్వడానికి గల కారణాలు, ప్రాతిపదిక ఏమిటని రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అడ్‌హక్ కమిటీని ప్రశ్నించారు. డబ్ల్యూఎఫ్ఐ మార్గదర్శకాల ప్రకారం అన్ని వెయిట్ కేటగిరీలకు సెలక్షన్ ట్రయల్స్ తప్పనిసరి అని పిటిషనర్ల తరఫు న్యాయ వాది వినిపించగా, జడ్జి తదుపరి విచారణను నేటికి వాయిదా వేశారు.

బ్రిజ్‌భూషణ్‌కు బెయిల్

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు గురువారం ఢిల్లీ కోర్టు పూర్తిస్థాయి బెయిల్‌ను మంజూరు చేసింది. మైనర్ రెజ్లర్ సహా పలువురు రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో ఢిల్లీ పోలీసులు బ్రిజ్‌భూషణ్‌పై ఎట్టకేలకు గత నెల 15న పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్ని విచారించిన అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. మంగళవారం కేవలం మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా తాజాగా పూర్తిస్థాయి బెయిల్ ఇచ్చింది. అయినప్పటికీ కోర్టు అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం లేదు.

భారత జట్టు ర్యాంక్ 99



న్యూఢిల్లీ: ఐదేళ్ల విరామం తర్వాత భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ర్యాంకింగ్స్‌లో 100లోనికి వచ్చింది. క్రితంసారి ర్యాంక్‌లను ప్రకటించినపుడు సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత ఫుట్‌బాల్ జట్టు సరిగ్గా 100వ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవల దక్షిణాసియా చాంపియన్‌షిప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడంతో భారత జట్టు ఒక స్థానం మెరుగుపర్చుకొని 99వ ర్యాంక్‌లో నిలిచింది. 1996లో భారత జట్టు అత్యుత్తమంగా 94 ర్యాంక్‌ను దక్కించుకుంది.

క్వార్టర్ ఫైనల్లో రిత్విక్–అర్జున్ జోడీ



న్యూఢిల్లీ: పోజోబ్లాంకో ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తన భాగస్వామి అర్జున్ కధేతో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్–అర్జున్ ద్వయం 6–4, 6–4తో కుజ్మిన్ (ఫ్రాన్స్)–సారియానో బరేరా (కొలంబియా) జంటపై గెలిచింది. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్, అర్జున్ మూడు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ ప్రారంభం



తొలి అడ్మిషన్ పొందిన మహాపాత్రోకి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నూజివీడు ట్రిపుల్ఐటీకి 1,040 మంది విద్యార్థులను ఎంపిక చేయగా... తొలిరోజు కౌన్సెలింగ్కు రావాలని 550 మందికి కాల్లెటర్లు పంపించారు. వారిలో 481 మంది హాజరవగా.. అందరికీ సీట్లు కేటాయించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన తొలి 30 మందికి అడ్మిషన్ పత్రాలను ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అందజేశారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం 20 కౌంటర్లను ఏర్పాటు చేసి 70 మంది సిబ్బందిని నియమించారు. కౌన్సెలింగ్కు వచ్చిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూశారు. అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మేరుగ అర్జునరావు పర్యవేక్షించారు.

26 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఈ నెల 26 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 5 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మార్కుల మెమో, పాస్ సర్టిఫికెట్లు నేరుగా వారి చిరునామాకే పంపుతామని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ ప్రక్రియ, అధ్యయన కేంద్రాలకు ఉండాల్సిన అర్హతలువంటి అంశాలపై అన్ని జిల్లాల సమన్వయకర్తలు, అసిస్టెంట్ కమిషనర్లకు దిశానిర్దేశం చేసినట్లు వివరించారు.

'జ్ఞానధార'యూట్యూబ్ చానల్ ప్రారంభం
ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 'ఏపీఓఎస్ఎస్- జ్ఞానధార' ప్రత్యేక యూట్యూబ్ చానల్ను గురువారం ప్రారంభించారు. ఇందులో పది, ఇంటర్ విద్యార్థులకు వీడియో పాఠ్యాంశాలు అందుబాటులో ఉంచుతామని శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

గూగుల్ టేక్ అవుట్ తప్పు!

▶ మొదటి పేజీ తరువాయి

మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ వివరాలు అంతా పొరపాటని అంగీకరించడం గమనార్హం. కాగా, ఈ కేసులో అరెస్టు చేసిన ఏ–6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి, ఏ–7 వైఎస్ భాస్కర్రెడ్డికి వ్యతిరేకంగా సీబీఐ ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయింది. కేవలం గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చూపిస్తూ వారిని అరెస్టు చేసిన సీబీఐ తుది చార్జ్షీట్లో ఎలాంటి ఆధారం చూపించకపోవడం గమనార్హం. మరోవైపు షర్మిల తన చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి కడప ఎంపీ టికెట్ను ఆశించనే లేదని సీబీఐకి వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. తద్వారా ఎంపీ టికెట్కు అడ్డుగా ఉన్నందునే వివేకాను హత్య చేశారన్న అభియోగాల్లో వాస్తవం లేదన్నది తేటతెల్లమైంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ అధికారులు హైదరాబాద్లోని సీబీఐ న్యాయస్థానంలో బుధవారం తుది చార్జ్షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అభియోగాలకు సరైన ఆధారమేదీ తుది చార్జ్షీట్లో సీబీఐ చూపించలేకపోయింది. వెరసి వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ఏనాడో దారి తప్పిందని.. కొందరి ప్రభావానికి గురై సీబీఐ అధికారులు వ్యవహరిస్తున్నారన్నది స్పష్టమైంది. వైఎస్సార్ కుటుంబంపై రాజకీయ దురుద్దేశంతో ఎల్లో మీడియా చేస్తున్న రాద్ధాంతం అంతా దుష్ప్రచారమేనన్నది తేలిపోయింది.

తూచ్.. అంతా ఉత్తిదే: కేసు దర్యాప్తులో కేంద్ర బిందువుగా పేర్కొన్న ప్రధాన సాక్ష్యాధారంపైనే సీబీఐ బొక్కబోర్లా పడింది. వివేకాను హత్య చేసిన నలుగురు నిందితుల్లో ఏ–2 సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాను సేకరించి ఈ కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించామని రెండేళ్లుగా చెబుతున్న సీబీఐ.. తుది చార్జ్షీట్లో మాట మార్చింది. 'సునీల్ యాదవ్ 2019 మార్చి 14వ తేదీ రాత్రి వివేకానందరెడ్డి నివాసంలో ఉన్నాడు. అర్ధరాత్రి దాటాక 2.35 గంటలకు వివేకా నివాసం సమీపంలో, 2.42 గంటలకు నివాసం లోపల ఉన్నాడు. ఈ విషయాన్ని ఆయన మొబైల్ నంబర్ గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించాం' అని సీబీఐ ఇన్నాళ్లు చెబుతూ వచ్చింది. తాజాగా న్యాయస్థానంలో దాఖలు చేసిన తుది చార్జ్షీట్లో అందుకు విరుద్ధంగా పేర్కొంది. 'సునీల్ యాదవ్ 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత వివేకానందరెడ్డి నివాసంలో లేరు. 2019 మార్చి 15న ఉదయం 8.05 గంటలకు వివేకా ఇంటి బయట, ఉదయం 8.12 గంటలకు ఇంటి లోపల ఉన్నాడు. గతంలో గూగుల్ టేక్ అవుట్ ద్వారా తెలుసుకున్నది గ్రీన్విచ్ కాలమానం ప్రకారం. కానీ ఏ దేశంలోనైనా స్థానిక కాలమానం ప్రకారమే చూడాలి. ఈ లెక్కన భారత కాలమానం ప్రకారం అంటే దానికి 5.30 గంటల సమయం కలపాలి. గతంలో పొరబడ్డాం' అని స్పష్టం చేసింది.

గూగుల్ టేక్ అవుట్ పేరిట బురిడీకి యత్నం!
కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు గూగుల్ టేక్ అవుట్ డేటా పేరిట సీబీఐ యత్నిస్తోందన్న సందేహాలు బలపడుతున్నాయి. వివేకా మరణించారనే విషయం 2019 మార్చి 15 ఉదయం 6.05 గంటలకే అందరికీ తెలిసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి కూడా వివేకా గుండెపోటుతో మరణించారని మీడియాకు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న వందలాది మంది ఉదయం 7 గంటలకే పులివెందులలోని వివేకా నివాసానికి చేరుకున్నారు. స్థానికులు ఆ విధంగా రావడం సహజం. ఆ తర్వాత 8 గంటల సమయంలో సునీల్ యాదవ్ అక్కడికి వచ్చారని సీబీఐ ప్రస్తుతం చెప్పడం గమనార్హం. ఆ రోజు వివేకా నివాసానికి చేరుకున్న వారిలో 248 మందిని సాక్షులుగా సీబీఐ అధికారులు విచారించారు. వారిలో ఎవరూ కూడా ఆ రోజు సునీల్ యాదవ్ అక్కడ ఉన్నట్టు చెప్పనే లేదు. గూగుల్ టేక్ అవుట్ పేరిట సీబీఐ ఉద్దేశ పూర్వకంగానే గందరగోళం సృష్టిస్తోందన్నది స్పష్టమవుతోంది.

ఒక్క ఆధారం లేదే: గూగుల్ టేక్ అవుట్ డేటా అశాస్త్రీయతతోపాటు ఈ కేసులో సీబీఐ అరెస్టుల వెనుక డొల్లతనం కూడా తుది చార్జ్షీట్లో బట్టబయలైంది. సీబీఐ హడావుడిగా అరెస్టు చేసిన వైఎస్ భాస్కర్రెడ్డి, ఉదయ్కుమార్రెడ్డిలకు వ్యతిరేకంగా కొత్తగా ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. వివేకా హత్యకు ముందు, తర్వాత సునీల్ యాదవ్ వైఎస్ భాస్కర్రెడ్డి నివాసానికి 30 సార్లు వచ్చినట్టుగా సీబీఐ గత చార్జ్షీట్లో పేర్కొంది. అసలు సునీల్యాదవ్ ముందు రోజు రాత్రి వివేకానందరెడ్డి ఇంట్లోనే లేరని తుది చార్జ్షీట్లో పేర్కొంది. హత్య సమయంలో వివేకా ఇంట్లోలేని సునీల్ యాదవ్.. ఆ రోజు రాత్రి భాస్కర్రెడ్డి నివాసం నుంచి వివేకా నివాసానికి వెళ్లినట్టు, హత్య తర్వాత మళ్లీ వివేకా నివాసం నుంచి భాస్కర్రెడ్డి నివాసానికి వచ్చినట్టు ఎలా చెబుతుంది? ఈ లెక్కన గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించామన్న సమాచారం కూడా తప్పే కదా! గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగానే భాస్కర్రెడ్డిని అరెస్టు చేయడం అసంబద్ధమన్నది స్పష్టమైంది. అదే గూగుల్ టేక్ అవుట్ ఆధారంగా గజ్జల ఉదయ్కుమార్రెడ్డిని అరెస్టు చేసినట్టు సీబీఐ చెప్పింది. వివేకా హత్య జరిగిన రోజు రాత్రి ఆయన తన ఇంటి నుంచి తొందరగా వెళ్లిపోయారని, మర్నాడు ఉదయం వివేకా ఇంటి వద్దకు వెళ్లారని చెప్పింది. కానీ ఆ రోజు రాత్రి ఉదయ్కుమార్రెడ్డి ఎక్కడ ఉన్నారన్నది సీబీఐ చెప్పనే లేదు. మర్నాడు వివేకా మరణించారని సమాచారం తెలిశాక వందలాది మంది ఆయన నివాసానికి చేరుకున్నారు. తాను ఉదయం 8 గంటల సమయంలో అక్కడికి వెళ్లానని ఉదయ్కుమార్రెడ్డే చెప్పారు. మరి దాన్ని ఏదో గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించినట్టు సీబీఐ చెప్పడమేంటి? అవినాశ్రెడ్డి, భాస్కర్రెడ్డి మార్చి 15 ఉదయం వివేకా నివాసానికి చేరుకోవడానికి ముందే తాము అక్కడకు వెళ్లామని ప్రత్యక్ష సాక్షి సత్యనారాయణ చెప్పినట్టు తుది చార్జ్షీట్లో ఉంది. అప్పటికే వివేకా గుండెపోటుతో మరణించినట్టు అక్కడ మాట్లాడుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అంటే వివేకా గుండెపోటుతోనే మరణించారని మొదట బయటకు పొక్కిన సమాచారంతో భాస్కర్రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నది స్పష్టమైంది. ఏ విధంగానూ భాస్కర్రెడ్డికి వ్యతిరేకంగా సీబీఐ తుది చార్జ్షీట్లో ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది.

చిన్నాన్న కడప ఎంపీ టికెట్ ఆశించనే లేదు

'మా చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి 2019 ఎన్నికల్లో కడప ఎంపీగా పోటీ చేయాలని భావించలేదు. ఆయన ఎంపీ టికెట్ ఆశించలేదు' అని షర్మిల స్పష్టం చేశారు. 'కడప ఎంపీగా నన్ను పోటీ చేయమని చిన్నాన్న కోరారు. కానీ ఆ సమయంలో కడప జిల్లా రాజకీయాల పట్ల నేను ఆసక్తిగా లేను' అని తెలిపారు. ఈ మేరకు షర్మిల ఇచ్చిన వాంగ్మూలాన్ని సీబీఐ తుది చార్జ్షీట్లో పొందుపరిచింది. దాంతో కడప ఎంపీ టికెట్ అంశంపై సీబీఐ ఇన్నాళ్లూ చేస్తున్న అభియోగాలు అవాస్తవం అని పరోక్షంగా తేలిపోయింది. వివేకానందరెడ్డి కడప ఎంపీగా పోటీ చేయాలని భావించారని, దీంతో ఎంపీ టికెట్కు అడ్డురాకుండా ఉండేందుకే ఆయన్ని హత్య చేశారన్న సీబీఐ అభియోగాల్లో నిజం లేదని నిగ్గు తేలింది. 2022 అక్టోబర్ 7న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి షర్మిల వాంగ్మూలం ఇచ్చారు. సీబీఐ అధికారులు అడిగిన 20 ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పారు. ఎన్నికలకు దాదాపు మూడు నెలల ముందు బెంగళూరులోని తన నివాసానికి వివేకానందరెడ్డి వచ్చారని, 2019 ఎన్నికల్లో కడప ఎంపీగా తనను పోటీ చేయమని కోరారని షర్మిల చెప్పారు. ఆ సమయంలో ఆసక్తిగా లేనని చెప్పానన్నారు. వివేకా ఎందుకు పోటీ చేయాలని భావించలేదని సీబీఐ అధికారులు ఆమెను ప్రశ్నించారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోవడంతో బహుశా ఆయన పోటీ చేసేందుకు సుముఖత చూపలేదని షర్మిల చెప్పారు. 2009లో తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఆదేశాలతో వివేకానందరెడ్డి తన తల్లి విజయమ్మపై పులివెందుల ఉప ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని షర్మిల గుర్తు చేశారు. బహుశా అందువల్ల తనకు టికెట్ రాదని ఆయన భావించి ఉండవచ్చని చెప్పారు.

మిగిలిన నిందితుల గూగుల్ టేక్ అవుట్ డేటా లేదా?

సీబీఐ ఎంతగా హడావుడి చేస్తున్నా గూగుల్ టేక్ అవుట్ డేటా శాస్త్రీయతపై మొదట్నుంచీ నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గూగుల్ టేక్ అవుట్ డేటా శాస్త్రీయమైనదని సీబీఐ భావిస్తే.. ఈ కేసులో మిగిలిన నిందితులు ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్రెడ్డి, దస్తగిరి మొబైల్ ఫోన్ల గూగుల్ టేక్ అవుట్ డేటాను సీబీఐ ఎందుకు సేకరించలేదన్నది ప్రశ్నార్థకం. నలుగురు నిందితుల్లో ఒకరి డేటానే సేకరించడమేంటి.. మిగతా ముగ్గురి డేటాను విస్మరించడమేంటన్నది కీలకంగా మారింది. ఆ సమాచారం శాస్త్రీయమైనదని సీబీఐ భావిస్తే హత్యలో పాలుపంచుకున్నారని నలుగురు నిందితుల మొబైల్ ఫోన్ల గూగుల్ డేటాను సేకరించి విశ్లేషించాలి. కానీ సీబీఐ అలా చేయకపోవడం సందేహాస్పదంగా మారింది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే సీబీఐ ఉద్దేశ పూర్వకంగానే ఇలా వ్యవహరిస్తోందని నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ ఎక్స్పోర్ట్ హబ్గా ప్రకాశం జిల్లా

ఒక జిల్లా–ఒక ప్రొడక్ట్ నినాదంతో ఎగుమతుల పెంపునకు కేంద్రం శ్రీకారం

మద్దిపాడు : ప్రకాశం జిల్లాను గ్రానైట్ ఎక్స్పోర్ట్ హబ్గా నిర్ణయిస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఎగుమతుల విభాగం జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావులు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఒక జిల్లా–ఒక ప్రొడక్ట్ అనే నినాదంతో పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు ప్రోత్సాహం కల్పించాలన్న లక్ష్యంతో గురువారం మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో రాష్ట్ర, జిల్లా పరిశ్రమల అధికారుల సమక్షంలో పారిశ్రామికవేత్తలతో సమీక్ష నిర్వహించారు. దేశంలో 700 జిల్లాల్లోని పారిశ్రామిక వనరులను గుర్తించి ఏ జిల్లాలో ఏవి ఎగుమతులు చేసేందుకు అవకాశాలున్నాయో తెలుసుకునేందుకు రూపొందించిన కార్యక్రమాన్ని తొలుత 200 జిల్లాల్లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా ప్రకాశం జిల్లాలో ఎక్కువగా 90 శాతానికి పైగా గ్రానైట్ పరిశ్రమలుండటంతో జిల్లాను గ్రానైట్ ఎక్స్పోర్ట్ హబ్గా నిర్ణయిస్తున్నట్టు ప్రకటించారు. ఎగుమతులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం, మార్కెటింగ్ వంటి వాటికి ఫియో ఆర్గనైజేషన్ సహకారం అందిస్తుందన్నారు.

22న 'రెండో సెమిస్టర్' పుస్తకాల పంపిణీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా సెప్టెంబర్లో ప్రారంభమయ్యే రెండో సెమిస్టర్కు సంబంధించిన పుస్తకాలు రాష్ట్రంలోని 45,409 పాఠశాలలకు చేరాయని చెప్పారు. విజయవాడలోని స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాల లోడుతో ఉన్న ఎండీయూ (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) వాహనాన్ని గురువారం ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా నడుపుతూ కృష్ణా జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులకు అందించారు. ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న 36 లక్షల మంది విద్యార్థులకు అవసరమైన 1,06,82,080 రెండో సెమిస్టర్ పుస్తకాలను పాఠశాలలకు చేర్చామని తెలిపారు. ఈ నెల 22న రాష్ట్రంలోని 45,409 పాఠశాలల్లో ఒకేసారి పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు.

రూ.30 లక్షల విదేశీ సిగరెట్లు సీజ్



షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అదనపు ఎస్పీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం దాడులు చేశారు. విశాఖ నగరంలో రెండు కస్టమ్స్ నోటిఫైడ్ షాపులతో పాటు రెండు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అదనపు ఎస్పీ జి.స్వరూపారాణి నేతృత్వంలో చేపట్టిన ఈ సోదాల్లో రూ.30 లక్షలు విలువ చేసే విదేశీ సిగరెట్లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలో కొంతమంది వ్యాపారులు, షాపుల వారు అనధికారికంగా, నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సిగరెట్లు నిల్వ ఉంచడంతో పాటు విక్రయిస్తున్నారని విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు డాబాగార్డెన్స్ ప్రాంతంలోని కస్టమ్స్ నోటిఫైడ్ షాపులు జపాన్ ప్లాజా, సింగపూర్ ప్లాజాతో పాటు జగదాంబ వద్ద వెంకటేశ్వర, శ్రీనివాస కిరాణా షాప్లకు చెందిన గొడౌన్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భారీగా విదేశీ సిగరెట్లను గుర్తించి సీజ్ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.